

ంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
4 అణాలు
ANDHRA PATRIKA



గొల్లలమామిడాడ గ్రామంలోని శ్రీ రామాలయ గోపురం

ఫొటో: షేక్ మహమ్మద్ గౌస్—అనపర్తి.


19 వ తేది
విడుదల
జూపిటర్ వారి
ఉమాసుందరి
N.T.రామారావు • శ్రీరంజని • నాగయ్య • కన్నాంబ • రేలంగి • సురభిబాలసరస్వతి
నటించిన కరుణరసమయకథ
దర్శకుడు...
పి.పుల్లయ్య
సహాదర్శకుడు...
లంకసత్యం

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 50
సంచిక 46
18-7-56

దుర్ముఖ ఆషాఢ శుద్ధ ఏకాదశి బుధవారం

★


ముఖచిత్రం : సినీతార మీనాక్షి.

ప్రధానమంత్రి నెహ్రూ పర్యటన ఫలితాలు

కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశం పదిరోజులు జరిగి శుక్రవారం సమాప్తమైంది. ప్రపంచ శాంతిని భిగ్నం చేయగల సమస్యలను, ప్రపంచ శాంతికి దోహదం చేయగల విధానాలను ప్రధానమంత్రులు చర్చించారు. కామన్వెల్తు రాజ్యాలు అన్నీ ప్రజాస్వామిక రాజ్యాలే. స్వాతంత్ర్యంలో, శాంతిలో సంపూర్ణ విశ్వాసంగల దేశాలే. సమావేశానంతరం వెలువడిన అధికార ప్రకటన కామన్వెల్తు రాజ్యాల స్వభావాలను, విశ్వాసాలను ప్రతిబింబించినది.

పదిరోజులు ప్రపంచసమస్యలన్నింటినీ కూలంకషంగా చర్చించినా ఏ ఒక్క సమస్యమీదా ప్రధానమంత్రులు ఒక నిర్ణయాన్ని ప్రకటించలేదు. నిర్ణయాన్ని ప్రకటించకపోయినా వివిధ సమస్యలపట్ల కామన్వెల్తు రాజ్యాల వైఖరి ఏమిటో తెలుసుకోవడానికి అధికార ప్రకటన ఉపయోగపడుతుంది. "కామన్వెల్తు రాజ్యాలు అన్నింటి లక్ష్యము ఒక్కటే. శాంతి సాధన, సంరక్షణ. ఈ లక్ష్యసాధనకు అనుగుణమైన విధానాలను అన్ని కామన్వెల్తు రాజ్యాలు అనుసరిస్తవి." యుద్ధనిర్వహణ శక్తి, ఆయుధబలం దృష్ట్యా చూస్తే కామన్వెల్తు రాజ్యాలు వ్యష్టిగా, సమష్టిగా చాలా బలహీనంగా వున్నవని అంగీకరించక తప్పగు. కాని కామన్వెల్తు రాజ్యాలకు సమిష్టిగా వున్నంత నైతికబలం ఏ 'కూటమికి' ఏ 'వర్గాని'కి లేదు తొమ్మిది రాజ్యాలు శాంతి సంరక్షణమే పట్టుదలగా, దీక్షతో పనిచేస్తే, ఈ కృషి ఫలప్రదం కాక తప్పదు. ఈ కృషి ప్రభావం ఇతర దేశాలపైనకూడా కొంత వుండక తప్పగు.

సోవియట్ రష్యాలో ఇటీవల వచ్చినమార్పులను గురించి లండన్ సమావేశం వ్యక్తం చేసిన అభిప్రాయం అమెరికా విధానాల్లో కాకపోయినా, వైఖరిలో కొంత మార్పును తీసుకు రావచ్చును. నవంబరు ఎన్నికలు పూర్తి అయ్యేవరకూ అమెరికా ప్రభుత్వ విధానాల్లో తీవ్రమైన మార్పులు రావడానికి అవకాశం లేదు. అమెరికాలో అధ్యక్షుని ఎన్నికలు పూర్తిఅయిన తరువాత ప్రభుత్వ రష్యా విధానంలో మార్పురాక తప్పగు. ఆ మార్పు అగ్రరాజ్యాల మధ్య సన్నిహిత



బొలారంలోని రాష్ట్రపతి నిలయంలో అలంకరణలు చేసిన లంబాడీ స్త్రీలకు, గ్రామీణ అలంకరణల పరిశ్రమలలో నిపుణులైన 400 మందికి రాష్ట్రపతి విందు చేశారు. రాష్ట్రపతి, డా॥ రామకృష్ణరావు, శ్రీమతి రామకృష్ణరావు, లంబాడీ స్త్రీలు.

★ ప్రధాన మంత్రి నెహ్రూ పర్యటన ఫలితాలు ★

సంబంధాల పెంపుదలకు ప్రయోజనపడు తుంది.

ప్రధానమంత్రుల సమావేశంలో కాశ్మీరు సమస్యను చర్చకు తీసుకు రావాలని పాకిస్తాన్ ప్రధానమంత్రి విశ్వప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నం ఫలించి వుంటే కామన్వెల్తు విచ్ఛిన్నమైపోయేది. ప్రధాన మంత్రుల సమావేశాల్లో ఇతర సమస్యలను చర్చించడానికి వ్యవధి వుండదు. ఈ సమావేశాల్లో భారతదేశం పై పాకిస్తాను ఫిర్యాదును శ్వేత ఆస్ట్రేలియా విధానం పై, దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వ జాతి వివక్షణ విధానం పై, భారత ప్రభుత్వ ఆక్షేపణలను చర్చించడం ప్రారంభిస్తే కామన్వెల్తు రాజ్యాల మధ్యస్పర్థలు పై వమ్యాలు, పరస్పర ద్వేషాలు ప్రబలడంకంటె జరిగేది ఏమీ లేదు. కామన్వెల్తు భావాన్ని ఇతర దేశాల్లో కూడా కలిగేటట్లు ప్రధానమంత్రుల సమావేశాలు జరుగుతూవుండాలి. కామన్వెల్తు రాజ్యాల మధ్య ఉత్పన్నమయ్యే సమస్యలను ప్రధాన మంత్రుల సమావేశం చర్చింపరాదనే సంప్రదాయాన్ని పాటించడంమీదనే కామన్వెల్తు మనుగడ ఆధారపడివుంటున్నది. ఈ సంప్రదాయాన్ని గౌరవింపలేని రాజ్యాలు కామన్వెల్తునుంచి వైదొలగడం ఆ రాజ్యాలకు, కామన్వెల్తుకుకూడా క్షేమం.

క్రిందటి శుక్రవారం సమాప్తమైన ప్రధానమంత్రుల సమావేశం నిరాయుధీకరణపై ఖచ్చితమైన అభిప్రాయాన్ని ప్రకటించినా అణుఅస్త్రాల పరీక్షల ఆపుదలను గురించి ఏమీ చెప్పలేదు. ఈ పరీక్షల ఆపుదలగురించి భారత ప్రధానమంత్రి బ్రిటిష్ ప్రధానమంత్రితో చర్చించేవుంటారు. ఈ సమస్యాపరిష్కారానికి బ్రిటన్, అమెరికా, రష్యాలు ఉమ్మడిగా ఒక నిర్ణయానికి రావలసివుంటుంది. అందువల్లనే ఈ విషయం కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశంపై వెలువడిన అధికార ప్రకటనలో కన్పించదు.

సమావేశాలు పూర్తిఅయిన తరువాత ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ భారతప్రభుత్వ విదేశాంగవిధానంగురించి బ్రిటన్ లోనూ ప్రపంచ రాజధానుల్లోనూ ప్రబలిన సందేహాలను నివృత్తిచేస్తూ లండన్ విలేఖరులతో గోష్ఠి జరిపారు. శ్రీ ఐసెన్‌హోవరు అస్వస్థత కారణంగా శ్రీ నెహ్రూ అమెరికా పర్యటన వాయిదాపడినప్పటికీ విలేఖరులగోష్ఠిలో ప్రధాని వెల్లడించిన అభిప్రాయాలను అమెరికావిధాన నిర్ణేతలు గమనించితే ముమ్ముందు జరిగే ఐసెన్‌హోవర్-నెహ్రూ సంప్రతింపులు ఫలించడానికి అనుకూలమైన పరిస్థితులను కల్పింపవచ్చును. భారత ప్రభుత్వం ఇంతవరకూ అమెరికా వ్యతిరేక విధానాన్ని అనుసరించలేదు. అమెరికా అధికారులు భారతప్రభుత్వ విధానాలను అర్థం చేసుకుంటే ఈ విధానాల్లో ఏ దేశ వ్యతిరేకతా లేదని గ్రహిస్తారు. దూరప్రాచ్య సమస్యల పరిష్కారానికి అమెరికా భారతప్రభుత్వ విధానాన్ని అర్థంచేసుకోవడం అవసరం.

కామన్వెల్తు ప్రధానమంత్రులు భారత ప్రభుత్వ విధానాన్ని తెలుసుకొని ఆవిధానంలోని మంచిని గ్రహించారని సమావేశానంతరం వెలువడిన ప్రకటనవల్ల స్పష్టమౌతుంది. భారత ప్రధానమంత్రి ప్రస్తుత పర్యటన సాధించిన తొలి విజయం ఇది. మరొక రెండు వారాల్లో శ్రీ నెహ్రూ విదేశ పర్యటన ముగుస్తుంది. పూర్వపు పర్యటనలకంటె ఈ పర్యటన ఎక్కువ విజయాలను సాధించగలదనడానికి ఇది నిదర్శనం. ఈ పర్యటన ఇతరదేశాలు భారతప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొనడానికే గాక, అనుసరించడానికి కూడా తోడ్పడుతుంది. కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశం కూడా రాజ్యాధికారులు తరచు కలుసుకుంటూవుండడం అవసరమని అభిప్రాయపడింది. ఇటీవల రష్యా నాయకులు ప్రారంభించిన ఈ పర్యటన విధానాన్ని ఇతర దేశాల నాయకులు కూడా అనుసరిస్తే ఐక్యరాజ్యసమితి క్రమంగా ప్రపంచరాజ్యాల కామన్వెల్తుగా రూపొందవచ్చు. ★

వింబుల్‌డన్ టెన్నిస్

క్రీడారంగంలో, టెన్నిస్ ఆడే ప్రతి వ్యక్తికీ ఏకైక లక్ష్యం అనదగ్గ వింబుల్‌డన్ చాంపియన్‌షిప్, ఈ ఏడాది అంచనాల ప్రకారం ఆస్ట్రేలియన్ ఆటగాడు ల్యూహోడ్‌కే లభించింది. 21 సంవత్సరాల ఈడుగల యువకుడు హోడ్ ఈ టూర్నమెంటులో, విజయానికి తన అర్హతను ఋజువు చేసుకున్నాడు. అయితే ఈసారి వింబుల్‌డన్ కథ యావత్తూ అనుభవజ్ఞుల, అంచనాలప్రకారం, ప్రవీణుల జోస్యాలప్రకారం మాత్రం సాగలేదు. దాదాపు చివరిఘట్టంవరకూ ఈ టూర్నమెంటు విశేషాల పుట్ట అనిపించుకోతగ్గట్టు సాగింది.

టూర్నమెంటు కమిటీ, ఎన్నికచేసిన ఎనమండుగురు సీడెడ్ ఆటగాళ్ళలో ఆస్ట్రేలియన్లు హోడ్, కెన్‌రోస్వాల్, అమెరికన్లు హామిల్టన్ రిచర్డ్‌సన్, విక్ సీక్సాస్‌లు నలుగురే చివరికంటా వెళ్లగలిగారు. మిగతా నలుగురులో ఈజిప్టుకుచెందిన జెరోస్లావ్ డ్రాబ్నీ తొలి ఘట్టంలోనే, పద్దెనిమిదేళ్ల యువకుడు రామనాథకృష్ణన్ చేతిలో ఓడిపోయాడు. డ్రాబ్నీ 34 ఏళ్ళవాడు. 1954 లో వింబుల్‌డన్ చాంపియన్. ఈసారి 6వ సీడ్. రెండవ ఘట్టంలో, అమెరికన్ చాంపియన్ (నాలుగవ సీడ్), బడ్జ్ పాటీ బ్రిటిష్ ఆటగాడు ఆర్. విల్సన్‌తో ఆడి, ఓడి తప్పుకోవలసి వచ్చింది అలాగే అంచనాలగాడి తప్పిన మరోపోటీ కూపర్, డేవిడ్‌సన్‌లది. మూడవ సీడ్ అయిన స్వెన్ డేవిడ్‌సన్‌ను, ఆస్ట్రేలియన్ ఆటగాడు ఆష్‌లీ కూపర్ 3-2 సెట్‌లతో ఓడించాడు. (6-3, 2.6, 6-8, 1-6, 6-4). మూడో ఘట్టంతో ఆగిపోయిన మరో సీడెడ్ ఆటగాడు డేనిష్ చాంపియన్ కర్ట్ నీల్సన్ (నెం 7). చిలియన్ ఆటగాడు ఎల్. ఆయలా ఐదింట మూడు సెట్‌లతో (5-7, 6-4, 6-4, 5-7, 6-4) నీల్సన్‌ను ఓడించాడు. సీడెడ్ ఆటగాళ్ళ జాబితాలోకి ఎక్కకపోయినా, పెద్దతలకాయలలో జమ అయిన అష్‌లీకూపర్‌ను (ఆస్ట్రేలియా [illegible]



ఆర్. కృష్ణన్.

తృతీయస్థానం గలవాడు) ఏమంత పెద్దవాడు కాని, పేర ప్రఖ్యాతులు లేని అమెరికన్ ఆటగాడు అలెన్‌మారిస్ (అక్కడ నెం. 17) 3-2 సెట్లతో ఓడించివేయడం ఈ టూర్నమెంటులో మరోసారి సంచలనం కలిగించింది. (1-6, 12-10, 8-6, 3-6, 6-3.)

జూన్ 25 సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు వింబుల్డన్ టెన్నిస్ పేరిట ప్రపంచ ప్రసిద్ధినొందిన ఈ అఖిల ఇంగ్లాండ్ టెన్నిస్ టూర్నమెంటు ప్రారంభం అయింది. తొలి పోటీలోనే, భారతప్రతినిధి రామనాథకృష్ణన్ ఎదుర్కొన్న ఆటగాడు బహుసమర్థుడూ, అనుభవజ్ఞుడూ, ఒకసారి ఇక్కడ ఛాంపియన్‌షిప్ సాధించినవాడూ అయిన జెరోస్లావ్ డ్రాబ్నీ. కృష్ణన్‌కు అంతకుముందే, బ్రిటిష్ టెన్నిస్ పోటీలలో కాలు బెణికింది. కాలుకి గట్టిగా కట్టుకట్టుకుని అతడు వచ్చాడు. స్వతసిద్ధమైన ఆత్మ విశ్వాసానికి తోడు, ఏడాది క్రితం మాన్‌చెస్టర్‌లో డ్రాబ్నీపై సాధించిన గెలుపు కూడా కృష్ణన్‌కు మానసికంగా కొంత ధీమా చేకూర్చింది. తొణుకూ బెణుకూ లేకుండా, ఆట ప్రారంభించి 6-1 గేములతో కృష్ణన్ మొదటి సెట్ గెలుచుకున్నాడు. రెండవ సెట్‌లో కృష్ణన్ కొంచెం తొట్రుపడి పొరపాటు చెయ్యడంతో, డ్రాబ్నీ పుంజుకుని, 6-4 గేములతో ఆ సెట్ గెలుచుకున్నాడు. ఆతరువాత కృష్ణన్ ఓజస్సత్వాలు చెలరేగాయి. అతి ధాటీగా ఆడాడు. వరుసపెట్టి రెండు సెట్లూ (6-1, 6-4) తద్వారా వింబుల్డన్ తొలి ఘట్టంలో గెలుపూ సాధించుకున్నాడు.

ఇది సంచలనం కలిగించింది. డ్రాబ్నీ అభిమానులు నొచ్చుకున్నారు. కొందరు కంటనీరు పెట్టుకున్నారు కూడా. అయితే, ఎవరూ కృష్ణన్ గెలుపును తక్కువచేసి మాట్లాడలేదు. ఇదేదో ఆషామాషీ ఫలితం అని కొట్టిపారవెయ్యలేదు. కృష్ణన్ అందుకు ఆస్కారం ఇవ్వలేదుకూడా. నిర్దుష్టమైన ఆటఆడాడు. గెలుపుకి అర్హతను ఋజువు చేసుకున్నాడు. మర్నాడు బ్రిటిషు పత్రికలు కృష్ణన్ శక్తి సామర్థ్యాలపట్ల ప్రశంసలు కురిపించాయి. "వింబుల్డన్ టోర్నీలో తొలిరాజు రాజు" అన్నాయి. కొందరు ప్రవీణులు కృష్ణన్ ఈసారి చాంపియన్‌షిప్ సాధించే అవకాశాలున్నవని కూడా అభిప్రాయాలు వెలిబుచ్చారు.

డ్రాబ్నీ దిగులు పడ్డాడు. గత అక్టోబరులో అతడికి జీర్ణకోశ వ్యాధివలన ఆపరేషన్ జరిగింది. దరిమిలా అతడు చాలా పోటీలలో పాల్గొన్నాడు. కొన్నిటిలో ఓటమిపొందాడు కూడా. ఈసారి ఓటమి ఫలితంగా ఇంక అతడు వింబుల్డన్‌కు రాడని కొందరు అన్నారు.

ఐతే ఈఓటమికి కారణం, ఒంట్లో బాగుండకపోవడం కాదని డ్రాబ్నీయే అన్నాడు.

"ఆట చూడవచ్చిన ప్రేక్షకులంతా నన్ను మెచ్చుకుంటున్నారని, నా మీద ఎంతో నమ్మకం, ఆశ పెట్టుకున్నారనీ,- "డ్రాబ్నీ గెలుస్తాడు. తప్పకుండా గెలిచి తీరుతాడు" అని పదేపదే అనుకుంటున్నారనీ, పరస్పరం హామీలు ఇచ్చుకుంటున్నారనీ చూస్తూ, వింటూ, తెలుసుకుంటూ ఉండడంతో మనస్సు ఎలాగో అయిపోతుంది. స్థిమితం చెడుతుంది. పరిపరివిధాల పరిగెడుతుంది" అన్నాడు డ్రాబ్నీ.

"అసలు ఇవాళ ఆయన ఆడవలసినంత ధాటిగా ఆడలేదు. లేకపోతే, నేను ఇంత దూరం వచ్చేవాణ్ణికాను" అన్నాడు ఆట గెలిచిన రామనాథకృష్ణన్ వినమ్రతతో. కృష్ణన్ మద్రాసులోని ఒక కళాశాలలో "ఎకనమిక్స్ ఆనర్స్" చదువుతున్నాడు. అతని తండ్రి శ్రీ రామనాథన్‌గారు కూడా టెన్నిస్‌లో మంచి పేరుగడించారు. చిన్నప్పటినుండీ ఆయన కృష్ణన్‌కు దగ్గర ఉండి కట్టుదిట్టంగా టెన్నిస్ నేర్పించారు. అశ్రద్ధకు ఆస్కారంలేకుండా సాధకం చేయించారు.

రెండవఘట్టంలో కృష్ణన్ ప్రత్యర్థి ఆస్ట్రేలియన్ ఆటగాడు కొండీ. ఇందులో కొండీని ఓడించడానికి కృష్ణన్ కొంత ప్రయాసపడవలసి వచ్చింది. కొండీ ఒకటవ, మూడవ సెట్లను 6-1, 6,2 తో గెలుచుకున్నాడు. కృష్ణన్ 7-5, 6-3, 6 3 తో మూడు సెట్లు గెలుచుకొని మూడవ రౌండులో ప్రవేశించాడు. జూన్ 28 న జరిగిన ఈ పోటీలో మరో ఆస్ట్రేలియన్ ఆటగాడు మాల్ ఆండర్సన్ 6-4, 6-4, 6-1 తో వరుసగా మూడు సెట్లు గెలుచుకోవడంతో కృష్ణన్ సింగిల్స్ పోటీలనుండి తప్పుకోవలసి వచ్చింది.

కృష్ణన్ జతగాడు నరేష్‌కుమార్ తొలి రౌండు పోటీ బ్రాజిలియన్ చాంపియన్ ఎ. వీరాతో పడింది. అయితే వీరా పోటీకి హాజరుకాలేదు. రెఫరీ కొంతసేపు వాయిదా వేసి, ఆపైన కుమార్‌కు 'వాకోవర్' (తరువాతిఘట్టంలో ప్రవేశానికి అర్హత) ఇచ్చాడు.

ఈ పోటీలో కుమార్ ప్రత్యర్థి ఇటాలియన్ చాంపియన్ ఆర్గాస్ సిరోలా. ఒకరికొకరు తీసిపోకుండా 'హోరాహోరీ పోరాటంలా' ఆటసాగించారు. రెండు సెట్లు కుమార్ గెలిచాడు. రెండు సిరోలా గెలుచుకున్నాడు. జయాపజయాలు తేల్చే ఐదో సెట్ ఆడేవారికి తీవ్రంగా, చూచేవారికి హుషారుగా సాగింది. సిరోలా పోను పోను బాగా విజృంభించి 8-6 గేములలో సెట్ గెలుచుకున్నాడు (2-6, 7-5, 6-2, 4-6, 8-6)

ఈసారి వింబుల్డన్‌కు భారతదేశం

(56-వ పేజీ చూడండి)

గీర్వాణ భాషాభ్యాసం

౫

గత సంచిక తరువాయి

ఎక్కడైనా ఏదైనా ఒక చిన్న విశేషం జరిగినదంటే అది పలువురి నోళ్ళలోపడి పలు విధాలుగా చిలవలు పలవలు వేస్తుంది. చిట్ట చివరి కా చిన్న విశేషానికీ, తరవాత బయలుదేరిన చిలవలకు పలవలకు ఎక్కడా కార్య కారణభావం కనిపించదు.

జలక్రీడోత్సవంలో జరిగిన చిన్న విశేషానికి కూడా సరీగా అదే గతి పట్టింది. ఆ మరునాడంతఃపురంలో ఎవరినోట విన్నా దానిని గురించిన గుసగుసలే!

అందులోను అయిదవరాణి అనంగలేఖకా విషయంలో ఎక్కడలేని తహతహ బయలుదేరింది! ఇన్నాళ్ళనించీ పట్టమహిషి మలయవతికీ ఆమెకు అంతటి సయోధ్యఏమీ లేదు గాని లీలావతి రాకతో వారిద్దరిమధ్య కొంత అప్యాయత పెరిగింది.

ఎన్నడు లేనిది అనంగలేఖ ఆనాటిఉదయమే పట్టమహిషి మలయవతీదేవి భవంతికి విచ్చేసింది. ఇద్దరుకొంతసేపిష్టాగోష్ఠిలో పడ్డారు. చివరికా ఇష్టాగోష్ఠి జలక్రీడా పరిహాసం వైపుతిరగడాని కాట్టేకాలం పట్టలేదు. ఆరవ రాణి లీలావతిహావభావ చేష్టలు, అభావ చేష్టలు, పట్టమహిషికన్నా అయిదవ రాణి అనంగలేఖనే ఎక్కువగా కలవర పరిచాయి. ఇన్నాళ్ళనించీ కొద్దిగానో గొప్పగానో చక్రవర్తి దగ్గర చిన్నరాణిగా మన్నన లందుకుంటున్న అనంగలేఖకు కొత్తరాణి రాకతో ఆ 'చిన్న'తనం కాస్తా పెద్దతనంగా మారిపోయింది! కనకనే అది పట్టమహిషిపై ఆమె కంత ఆప్యాయత బయలుదేరడాని కొక కారణంగా మారింది.

అనంగలేఖ వచ్చేసరికి పట్టమహిషి సాతవాహన సార్వభౌమ వంశాని కంతటికీ ఏకైక వంశాంకురమైన తన చిన్నికుమారుని కేదో వలతగా ఉన్నదని దిగులుపడుతున్నది.

ఆ పసికందు పుట్టినప్పటినించీ, నేటి వరకు—అంటే అయిదేళ్లు నిండినా—అలాగే ఉన్నాడు. పట్టపురాణి కుమార భృత్యా కుశలులైన భిషగ్వరులచేత చికిత్స లేవో చేయిస్తూనే ఉన్నదిగాని ఆ నిదానాలవల్ల ప్రయోజనమేమీ కలగడం లేదు. అది అలా గుండగా లీలావతీదేవి బెడద ఒకటి పులిమీద పుట్రలా వచ్చి పడింది. యువసార్వభౌముని శరీర స్వాస్థ్యాన్ని గురించి కుశలప్రశ్నలడిగిన తరవాత అనంగలేఖ మలయావతికి కొంచెం దగ్గరగా జరిగి రహస్యసైఖరిలో ప్రసంగం ప్రారంభించింది:

"విన్నారా? ఈ విచిత్రం! చక్రవర్తి గీర్వాణాధ్యయనం చేస్తారట!"

"ఓహో! అలాగా! నిజంగానే!"

"ఇంకా నెమ్మదిగా అంటున్నారేమిటి? శర్మవర్మామాత్యులు వారిచేత గీర్వాణాధ్యయనం చేయించడంకోసం ప్రత్యేకంగా ఒక నూతన వ్యాకరణం కూడా రచిస్తున్నారట!" అని కొంచెం వెటకారంగా నవ్వింది అనంగలేఖ.

"అంటే వారి వ్యాకరణ రచన పూర్తికాగానే వీరు గీర్వాణాధ్యయనాని కుపక్రమిస్తారన్నమాట!"

ప్రాచీన గాథాలహరి

"అవును! అమాత్యుల వ్యాకరణ రచన ఆషాఢ మాసాంతానికి పూర్తికాగలదట! శ్రావణిలో వీరు తమ అధ్యయనం ప్రారంభిస్తారట."

"ఇంకా ఎంతెంతటి వికారాలు, విడ్డూరాలు పుట్టుకొస్తాయో మరి!" అని పట్టమహిషి ఒక దీర్ఘనిశ్వాసం విడిచిపెట్టింది.

"పసివాడిమీద పంచప్రాణాలు నిలుపుగుని నేనిలాగ కాలం వెళ్ళబుచ్చుకుందామనుకున్నాను గాని, ఇంతకీ నా నుదుట ఏమి వ్రాసిఉన్నదో ఎవరు చెప్పగలరమ్మా!"

గద్గదికవల్ల మలయవతి మరి మాటాడలేకపోయింది.

అంతలో ఆమెకు - పూర్వం నవోఢగా తాను అంతఃపురంలో ప్రవేశించిన నాటి ఆప్యాయతలన్నీ జ్ఞాపకం వచ్చాయి.

అప్పుడు చక్రవర్తి ఒక్క నిమిషమైనా విడిచిపెట్టకుండా నిత్యము తోడునీడలా నా వెన్నంటి తిరిగేవారు! అలాంటి అనురాగం నేటి కీలాగైపోయింది! ఏదో ఆ పసికందు కలిగాడు కనక కొంచెం చుట్టపు చూపుగానైనా ఇక్కడికి విజయం చేస్తున్నారు గాని లేకపోతే ఈపాటికి నాగతి ఏమైపోయేదో! అని ఆనాటి ఆనందోత్సాహాలన్నీ జ్ఞాపకం చేసుకొని, మలయవతి మళ్ళీ ఒకమారు కుమారుని అస్వాస్థ్యం తలుచుకొని అదేపనిగా కంటనీరు పెట్టుకొన్నది. తిరిగీ ఒక నిమిషంలో మనస్సు కుదుటబరుచుకొని అనంగలేఖవైపు చూచింది:

"వారెప్పుడైనా మీభవంతికి విజయం చేస్తున్నారా?"

"లేదు! మీ భవంతి కెప్పుడైనా చుట్టం చూపుగానైనా రాకపోకలు సాగిస్తున్నారు. కాని నేనుదానికి కూడా నోచుకోలేదు!"

- "అదేమిటి చెప్మా!"

"ఆ లీలావతీదేవి అమ్మగారి అభ్యనుజ్ఞ లభించాలిగదా!"

"అప్పుడే అంతవరకు ముదిరిందా వ్యవహారం?"

"ఇంకొక విచిత్రం కూడా ఉంది! అది వింటే మీరు మరీ ఆశ్చర్యపోతారు!"

మలయవతి అనంగలేఖ వైపు ఆశ్చర్యంగా చూచింది:

"చక్రవర్తి లీలావతీదేవిగారి దగ్గరకూడా సంస్కృత భాషాధ్యయనం చేస్తున్నారట!" అన్నది అనంగలేఖ అతి రహస్యంగా.

"ఔరా! అందరి రాణులలోను అంత అవహేళనచేసి న్యూనతపరిచినా చివరికి వారికి ఆమెగారిమీదే అనురాగం ఇనుమడించిన దన్నమాట!"

"అవునంతే మరి! కాళ్ళావేళ్ళాపడి బతిమాలుకునే వారిని

ఈసడించి కొడతారు! ఈసడించి కొట్టే వారిని కాళ్ళావేళ్ళాపడి బతిమాలుకుంటారు. మగవారి తీరే అంత!"

"త్వరలోనే శర్మవర్మామాత్యుల దగ్గర గీర్వాణం ప్రారంభించబోతున్నారు గదా! అంతలోనే అంతటి తొందరా?"

"అంతవరకు వారు మనసు నిలవరించుకోగలిగితేనా?"

ఓ. గణపతి శాస్త్రి



జడి అలజడిలో పర్వతారోహణం.

—ఫొటో: సోమంచి బాలకృష్ణ.

"అతిశయించి చెప్పావ్! అమాంతంగా సంస్కృతం మీద వారికంతటి భక్తి కుదిరింది!"

"మీరింకా పెరటిదారినే ఉన్నారమ్మా! అది సంస్కృతం మీద భక్తికానే కాదు!"

పట్టపురాణి మరింతగా ఆశ్చర్యపోయింది.

"అయితే మరి దేని మీద?"

"చిన్నరాణి లీలావతీదేవి గారి మీద!"

"ఇదంతా నటననే నన్నమాట!"

"వారి నటన చాతుర్యం ఇంకా వర్ణించి చెప్పమన్నారా?"

"ఇంకా చిత్ర విచిత్రాలెన్నో ఉన్నాయన్న మాట!"

అనంగలేఖ కనురెప్పలు వాలిపోయాయి. నేలకేసి చూస్తూ నెమ్మదిగా మొదలు పెట్టింది.

"చక్రవర్తి లీలావతీదేవిగారి సన్నిధిని ఓన్నమశ్శివాయ అని గీర్వాణంలో అక్షరాభ్యాసం చేశారట!"

"అవును! ఆమాట మీరిప్పుడే అన్నారు గదా!"

"అలాగ కొన్నిరోజులైన తరవాత వారి చిన్న చిన్న పొరబాటులు చేశారట!"

"ఏ విషయంలో?"

"సంస్కృతాభ్యాసంలో!"

"సరే! ఇన్నేళ్లు ముదిరిన తరవాత ఇప్పుడు గీర్వాణాభ్యాస మేమిటి లేకపోతేను!"

"అబ్బే! అదంతా చక్రవర్తి నటన చాతుర్యమేనమ్మా! వారెంతటి వారని! అలా పొరబాటులు చేసినప్పుడల్లా లీలావతీదేవి వారి అరిచేయిమీద సువర్ణవేత్రంతో చురుకు చురుకుమని వడ్డించినదట!"

ఆ ప్రహారాలు మలయవతి హృదయంలో శూలాలై వేధించాయి:

"ఔరా! వారికేళ్లు ముదిరినకొద్ది నానాటికీ మరీ చిన్నతనం వస్తూన్నట్లుందే! తరవాత ఏమిజరిగిందో!"

"అలాగ వడ్డించిన తరవాత ఆ లీలావతీదేవి "అయ్యో! నేనెంతటి అపచారం చేశాను! తామరరేకువంటి మీ అరిచేయి ఎంత ఎర్రగా కందిపోయిందో!" అని అదేపనిగా దానిపై ముద్దులవర్షం కురిపించినదట!"

"ఔరా! వారిగీర్వాణాభ్యాసశ్రద్ధ అంతా చివరికిలాగ పరిణమించినదన్నమాట!"

"ఇంతా చేస్తే అవగింజలో అరపాలు కాలేదు వారి నాట్యచాతుర్యం!"

అని అనంగలేఖ తిరిగి ఇంకొక విశేషం సంగతి విన్నవించబోయింది కాని పట్టమహిషి ఆమెమాట కత్తిరించింది:

"చాలు చాలులే! దీనితోనే నా కడుపు నిండిపోయింది! ఇంకా విస్తరించి వర్ణించాలా వారి హావభావ చేష్టలన్నీని!"

అని మలయవతి తన ముఖం మరి ఒక పక్కకు తిప్పివేసుకొన్నది. ఎంతగా నిగ్రహించుకొన్నా ఆమె చెంపలనుండి బాష్పధారలు విరళధారగా ప్రవహించడం మానలేదు. తనలోని అక్కసంతా వెళ్లబోసుకోవడానికి అనంగలేఖ ఆవృత్తాంతం అంతా ఆమె దగ్గర పూస గుచ్చినట్టుగా ఏకరువు పెట్టింది. పట్టపురా

★ గీర్వాణ భాషాభ్యాసం ★

...లో కూడా కొంత అక్కసు రెచ్చిపోయిన తరవాత అనంగ లేఖ హృదయం కొంచెం ఉపశాంతి పొందింది.

హృదయంలో రేకెత్తిన ఆ అక్కసుతో మలయవతి కొక్కమారుగా చిన్నికుమారుని దుగ్గతి విషయం జ్ఞాపకం వచ్చింది.

వెంటనే ఆమె అనంగ లేఖతో కలిసి బంగారు తూగుటుయ్యాలలో నిద్రిస్తున్న కుమారుని సందర్శించవలెనని బయలుదేరింది.

అలసి సొలసి అమాయిక ముఖంతో నిద్రిస్తున్న కుమారుని ముఖం చూడగానే చక్రవర్తి తన యెడల ప్రదర్శిస్తున్న నిరాదరణ అంతా ఆమె కొక్కమారుగా స్ఫురణకు వచ్చింది:

"నా బంగారు తండ్రీ! పెరిగి పెద్దవాడవై మళ్లీ నా కేవో పెద్ద పెద్ద గౌరవాలు, మన్ననలు కలిగిస్తావని పగటి కలలు కంటున్నాను! అయితే ఏమి ప్రయోజనం! వారికి తప్పినట్టే గృహదేవతలకు కూడా నాపై దయ తప్పినట్టున్నది."

అని పైట చెరుగుతో నిరంతర ధారగా ప్రవహించే కన్నీటిధార తుడుచుకొన్నది.

౭

చక్రవర్తి సందర్శనం చేసుకుని తిరిగి తన భవంతి కెలాగ చేరుకొన్నాడో గుణాఢ్యామాత్యునికే తెలియదు! తన ప్రాసాదం చేరుకునేవరకు అతిడిట్టుడికి పోయినట్టుడికి పోయాడు.

భవంతిలో ప్రవేశించిన పిమ్మట, పరిచారకులెవరికీ అతనిని పలకరించడానికి కూడా సాహసం కలగలేదు.

గుణాఢ్యుని కావేళ జరిగినదంతా స్వప్నమా? యధార్థమా? అనే సంశయం పట్టుకుని వేధించింది.

ఎంత ప్రయత్నించినా అతనికి చక్రవర్తి దర్శనమే దొరకలేదు. అయినా సాహసించి చక్రవర్తి దర్శనానికి వెళ్లిపోయాడు. అక్కడ జరిగినదంతా అతనికొక విచిత్రమైన ఛిధిత్సనమువా కారంలా భాసించింది!

ఆరుమాసాల్లో గీర్వాణపాండిత్యం సాధించవచ్చునట! అలాగ తను ప్రతిజ్ఞను నిలుపుకోలేనిపక్షంలో నిండు పేరోలగంలో నా పాదుకలు శిరసుపై ధరించి శర్వవర్మామాత్యులు స్వయంగా నాకూడిగం చేస్తారట! ఆరుమాసాలలో సంస్కృత పాండిత్యం సాధించడానికి కనువుగా తామొక వ్యాకరణం కూడా వెలగబెట్టవలెనని సంకల్పించారట! ఆహా! పాణిన్యాది మహర్షులు చిరకాలం ఘోర తపస్సుచేసి సాక్షాత్కరింపజేసుకొన్న శబ్దబ్రహ్మ స్వరూపం వీరికొక లిప్తకాలంలోనే ప్రత్యక్షం కాబోతున్నదన్న మాట! ఎవరు చెప్పగలరు? కలిలో ఎలాంటి అత్యద్భుతాలైనా బయలుదేరవచ్చును! అందులో ఆశ్చర్యం ఏమిఉన్నది! అని ఆ వృత్తాంతం తలుచుకుని గుణాఢ్యుడనేక విధాలుగా గుంజాటన పడ్డాడు.

హాలచక్రవర్తి ఏదైనా ఒకవిషయం జిజ్ఞాసార్థకంగా ప్రశ్నించినప్పుడా ప్రశ్నమీద మంత్రులలో కొంత మీమాంస బయలుదేరడం సామాన్యంగా జరిగేవిషయమే! ఒక్కొక్కప్పుడు వాదోపవాద ధూళి ఝంఝూమారుతంలా చెలరేగడంకూడా కద్దు. అయితే ప్రతిజ్ఞపట్టడం వంటిదెన్నడు జరగలేదు! ఒకవేళ మంత్రులెవరయినా మాటపట్టింపుకో సంశపథం పట్టి మాట్లాడినా చక్రవర్తి ఆశపథాలాట్టే పట్టించుకొనేవాడు కాడు. కాని సంస్కృతాభ్యాసం మీద వాదోపవాదాలు, శపథాలు చెలరేగినప్పుడు చక్రవర్తి అవన్నీ యథార్థాలున్నట్టుగానే వ్యవహరించాడు!

దానితో గుణాఢ్యుని ఆత్మనిగ్రహం యావత్తు ఒక్కమారుగా పటాపంచలైపోయింది. హాలశాతవాహన చక్రవర్తి జనకుని కాలంనించీ తానన్న మాటకు తిరుగులేకుండా 'ఓహో' అనిపించుకొన్న గుణాఢ్యామాత్యుని కానాటితో అటకట్టినట్టయింది.

గుణాఢ్యుని జనకుడు, తాతముత్తాతలు, అవిరళ జపహోమతత్పరులు. సోమపీథులు. నిత్యషట్కర్మ నిరతులు. వారిలో ఎవరు ఎప్పుడు రాజసేవల్లో తలవంచినవారు కారు. వారి వంశంలో కవితా వ్యాసంగము, రాజసేవ గుణాఢ్యునితోనే అవతరించాయి.

మొట్టమొదట గుణాఢ్యుని జనకుని కివి రెండు రుచించలేదు. క్రమక్రమంగా కవితా వ్యాసంగంమీద ఆయనకు కలిగిన వైముఖ్యం కొంతవరకు సడలిపోయింది.

కాని రాజసేవ కాయన ఎంత మాత్రము అంగీకరించలేదు. "నాయనా! సేవావృత్తిశ్వవృత్తి! ద్విజన్ముడైయున వాడు శ్వవృత్తి చేపట్టరాదని మానవీయ ధర్మశాస్త్రం ఉద్బోధిస్తున్నది. అదిన్నీ గాక "విశ్వాసోనైవ కర్తవ్యః స్త్రీషు రాజకులేషుచ" అని పెద్దలంటారు. స్త్రీలయందున్ను, రాజులయందున్ను విశ్వాసం కూడదని చెప్పేమాటలో ఎంతైనా అంతరార్థం ఉన్నది. కనక రాజసేవ సమీపానికైనా నీవు పోరాదు సుమా!"

అని ఎన్నో విధాలు గుణాఢ్యుని కుపదేశించాడు. కాని యౌవనోన్మాదంలో గుణాఢ్యుడా సదుపదేశం చెవికెక్కనీయలేదు.

ఇప్పుడు గుణాఢ్యామాత్యుని కనభైమా పశి ప్రవేశించింది.

అతడు కొంతకాలంనించీ రాజసేవ విరమించి వింధ్యాటవిలో వింధ్యవాసినీదేవి సన్నిధికిని మహాకావ్య వ్యాసంగంతోను, గాథ తపశ్చర్యతోను కాలక్షేపం చేస్తూ అలాగే తనువు చాలించవలెనని అనుకున్నాడు. కాని నానాటికీ పెరిగిపోతున్న కుటుంబ భారం వల, కుమారులెవరు చేతికందిరాకపోవడంవల ఆ సంకల్పం కొనసాగలేదు. అంతలో నే శర్వవర్మ ఔద్ధత్యం క్రమక్రమంగా పెచ్చు పెరిగిపోవడం ప్రారంభమైనది. చక్రవర్తికి గుణాఢ్యుని మీద ఆదరానురాగాలు క్రమక్రమంగా సన్నగిల్లిపోయాయి అటుపిమ్మట సంస్కృతభాషాభ్యాస విషయంలో వాదోపవాదాలు, శపథాలు చెలరేగాయి.

ఆ విధంగా తనపై హఠాత్తుగా ఆదరణ తగిపోవడానికి కారణమేమీ ప్రధానామాత్యునికి గోచరించలేదు! బహుశః వృద్ధాప్యంవల్ల చక్రవర్తికి తనపై అనాదరణ కలిగిందేమో ననిఅనుకున్నాడు. ఏదైనా ప్రభువరేణ్యుల ఆదిరానాదరాలు కేవలం వారి స్వప్రయోజనాలపై ఆధారపడిఉండడం సహజమేకదా! దానికింత డొంక తిరుగుడెందుకో!

గుణాఢ్యుని కెదైనా దురవగాహమైన జటిలసమస్య ఉదయించినప్పుడు శిష్యులు గుణదేవ నందివర్మలతో కొంతవర కాయా విషయాలు చర్చిస్తూంటాడు. గుణదేవుని కంటె నందివర్మ కొంచెం ఎక్కువ లోకజ్ఞుడు. వయస్సులోకూడా గుణదేవునికంటె బాగా పెద్ద. ఆనా డెంతసేపటికీ ఆలోచన లెటూ తెగక నందివర్మతో తన హృదయ భారం అంతా వెళ్లబోసుకొన్నాడు నందివర్మ తటపటాయిస్తూ నీళ్లు నమిలాడు:

“శర్మవర్మామాత్యుల కెక్కడా పట్టపగ్గా లున్నట్లు కనబడదు! కనక కొంత కాలంపాటు ప్రవాహానికి తలవంచే నీటి ప్రబ్బలి ధోరణి అవలంబించక తప్పదు!” అని గుణాఢ్యుని విశాల నేత్రాంతాలపై కొనలు దేరుతున్న నీల నీల వార్థక్య రేఖల వైపవలోకిస్తూ కూర్చున్నాడు.

గుణాఢ్యుడు వ్యెత్తుగా నవ్వాడు :

“నీరాజ్య తంత్రజ్ఞతను నేనేమీ అనలేను గాని తలవంచితే మాత్రం ప్రవాహపు టురవడి తగ్గగలదనే నమ్మకమేమైనా ఉన్నదా?”

“తాము తలవంచినప్పుడు గదా! ఆవిషయం తేలేది! కొంచెం ఓపికపట్టి తలవంచడానికి సంసిద్ధులై ఉండాలి మరి!” అన్నాడు నందివర్మ

“నందీ! నీకీ విషయం కూలంకషంగా అవగాహనకాలేదు, ఏమీ చేసినా ఈ ప్రవాహవేగం మరి తగ్గుముఖం పట్టబోదు!”

“అలాంటప్పుడు మరింత జాగరూకత వహించాలి గదా!” అన్నాడు నందివర్మ కొంచెం తటపటాయిస్తూ. అసమాధానంతో గుణాఢ్యుని ముఖం తామ్ర కలశంలా ఎర్రబడిపోయింది. కోపద్రేకంతో అతని అధరం అల్లల్లాడింది :

“జాగరూకత! జాగరూకత! ఈ జాగరూకత కోసమే అనూచానమైన నా ఆర్షేయ పౌరుషేయాలన్నీ గోదావరిలో కలిపి అహోరాత్రాలుగా ఐశ్వర్య దుర్మదాంధులు, అజ్ఞులు అయిన దక్షిణాపథ చక్రవర్తుల దురహంకారానికి దాసోహదామని తల ఒగ్గాను!” అన్నాడు ఒణికిపోతూ.

“తమరంతగా తొందరపడితే నేనేమని విన్నవించగలను! చక్రవర్తి మీరన్నంతటి అజ్ఞులూ కాదు. దుర్మదాంధులూ కాదు! కాకపోతే గీర్వాణ పాండిత్యవ్యవహారం వారి కంతలోతుగా తెలియకపోవచ్చును! అంత మాత్రంచేత వారి నిలా తూలలాడడం న్యాయంకాదు!”

“వారికన్నీ తెలుసును! ఆ రహస్యం నీకు తెలియదు!”

“కావచ్చును! కాని తాము కొంచెం తొందరపడుతున్నారేమోనని అనిపిస్తూంది! ...నాదొక్క మనవి!”

గుణాఢ్యుడా మాటపై కొంచెం తమాయించి జిజ్ఞాసార్థకంగా నందివర్మ వైపు చూచాడు :

“ఇంతకీ వారు పెట్టిన ఆరుమాసాల అవధి గడిచిపోలేదు! ఆరుమాసాల అనంతరం చక్రవర్తే స్వయంగా శర్వవర్మామాత్యుని తప్పిదం గుర్తించకూడదా?”

“గుర్తింప కూడదని ముందుగానే నిశ్చయించుకొన్నప్పుడా గుర్తింపు మరి జరుగ నేరదు!”

“పోనీ అంతవరకు వేచి ఉండడం వల్ల మనకు వచ్చే ప్రత్యవాయం ఏమీ లేదు గదా!”

“లేనిమాట నిజమే!” అన్నాడు గుణాఢ్యుడు కొంచెం ఆలోచించి.

“అయితే అంతవరకు కొంత ఓరిమి వహించవలసిందని నా ప్రార్థన!” అన్నాడు నందివర్మ.

దానికి గుణాఢ్యుడేమీ బదులు చెప్పలేదు. అతడు కొంత అర్ధాంగీకార ధోరణిలో పడ్డాడని నందివర్మ గ్రహించాడు. అందువల్ల కొంతసేపటివరకూ మారు పలకకుండా నిశ్చల దృష్టితో ఆచార్యుని ముఖకవళిక పరిశీలిస్తూ నెమ్మదిగా వసిగాడు:

“అసలు దీనికంతటికీ శర్వవర్మామాత్యుడే ప్రధాన కారణమని నా ఊహ!”

“శర్మవర్మ కేమి తెలుసును! అతని కింకా ముక్కుపచ్చలే ఆరలేదు! కాని తానే మహా సర్వజ్ఞుడని మన్ను మిన్ను కానకుండా వ్యవహరిస్తున్నాడు. ఇదంతా విషసర్పాలతో చెరలాటమని అత డెరగడు! కాని క్రమంగా అన్నీ అతనికే తెలిసివస్తాయిలే!” తిరిగి గుణాఢ్యుని పెదవులు క్రోధావేశంతో వణికిపోయాయి!

నందివర్మకీ ప్రసంగం మళ్ళీ ఎత్తడంవల్ల పరిస్థితి విషమించిందని తెలిసింది. అందుచేత తన ప్రసంగం చల్ల చల్లగా జారవిడిచి వేశాడు:

“శర్వవర్మే దీని కంతటికీ మూలకారణమని నా దృఢనిశ్చయం. అయితే తమ కీమాట బొత్తిగా రుచించడంలేదు! ఆరు మాసాల అనంతరం నామాట నెగ్గి తీరుతుంది! చక్రవర్తి శర్మవర్మ తప్పిదం గుర్తించి తీరతారు! అంతవరకు మాత్రం కొంచెం నిదానించి చూడండి! అంతమాత్రంలో మునిగిపోయేదేమీ లేదుకదా! నా మాట కొంచెం మన్నించండి!”

గుణాఢ్యుడు కొంతసేపటి వరకు సమాధానం చెప్పలేదు! తరవాత ఒక నిట్టూర్పు విడిచి “సరే! అలాగే కానీ!” అన్నాడు.

అనంతరం అతడేదో గాఢాలోచనలో మునిగిపోయాడు. అంతలో ప్రతిష్ఠానగర రాజవీధులలో అతనికేదో పెద్ద కలకలం వినిపించింది.

గుణాఢ్యుని దృష్టి ఆ కలకలంవైపు తిరిగింది. అవి పౌరజానపదుల వసంతోత్సవ కోలాహలం!

గుణాఢ్యుని కది గమనించగానే ఆ వసంతోత్సవ కోలాహలం కేవలం స్వప్నలోక కోలాహాలాలం తీరులో స్ఫురించింది!

—సశేషం

అసమర్థుని ఆత్మకథ

'నీకు యీపాటికి పెళ్ళి అయిపోయి వుంటుందనుకున్నా.'

'నీకు తెలియకుండా ఎట్లా అవుతుందనుకున్నావ్!'

'నాకు తెలియాలని ఎక్కడుంది'

'నీకు ఉత్తరమైనా రాయకుండా చేసుకుంటాననుకున్నావా?'

'ఏమో!...ఎప్పుడో నిశ్చితార్థం అయిన సంబంధానికి, ఇంతవరకూ పెళ్ళి కాకుండా వుంటుందని ఎట్లా అనుకుంటా?'

'కనీసం శుభలేఖ అయినా వచ్చేదిగా.'

'ఏమో! గుర్తుండి వుంటానో! వుండనో'

'నీవు మరిచి పోతావేమో కాని, నే నెప్పుడూ మరిచిపోలేను'

ఆ నాడు ఇంతవరకూ జరిగిన సంభాషణ యింకా గుర్తుంది.

ఎదురుగుండా పసుపు పూసిన, సువర్ణాక్షరాలు గల 'శుభలేఖ' తళ తళా మెరుస్తోంది. శుభలేఖలో "శాంత" అనే రెండక్షరాలూ హృదయంలో ఏదో చెప్పలేని బాధని వేళ్ళు పెట్టి కెలుకుతున్నాయి.

"శాంత"

నేటి నా ఇరవై యేళ్ళ జీవితంలో, నా జీవితంతో సౌఖ్యం కలిగించుకున్న వ్యక్తుల్లో అర్థం చేసుకోలేక విడిచిన ఏకైక వ్యక్తి 'శాంత.'

హృదయమున్న వా డెవడూ శాంతలాంటి వ్యక్తిని మరిచిపోలేడు. నేనూ ఆమె జ్ఞాపకాన్నుంచి తప్పించుకో లేకపోయా.

* * *

నీలాల నింగిలో మబ్బు ముంగురులు పారాడాయి. శరత్కాల జలదాల మాటున శశి బింబం దోబూచులాడింది. ఆమె సన్నని కంఠంలో వీణారావం స్పందించింది. మెల్లగా ఏదో పాడుతోంది ఆమె.

గిరి శిఖరం నుంచి క్రిందికి దూకే సెలయేరులా, చాలా మధురంగా వుందిపాట.

ఆమె ముంగురులను ముఖం మీద నుంచి, సన్నని వేళ్ళతో వెనక్కి తోసుకుంటూ నా కళ్ళలోకి చూసింది. ఆమె చూపులు. అట్లా ఎంతసేపు నిలిచాయో! చివరికి నేనే నా ముఖాన్ని క్రిందికి దించుకున్నా.

ఆమె ప్రశాంతంగా ప్రకృతిని చూస్తూ, మధ్య మధ్య నావంక చూడటం మొదలు పెట్టింది. నాలో ఏవో భావాలు నోటి దాకా వచ్చి, ఆగిపోయాయి.

ఇంతలో 'బుజ్జిగాడు' వచ్చాడు 'అక్కయ్యా! అమ్మ పిలుస్తోంద'ని. శాంత లేచింది. ఒక్కసారి నావంక చూచి, కళ్ళు నేలకి దించి, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ బయలు దేరింది.

ఆమె అవతలికి వెళ్ళింది నాలో అంతవరకూ పాతరలాడుతున్న భావాలు, ఒక్కసారిగా బయటికి పొంగాయి. కాని అప్పటికే శాంత వెళ్ళిపోయింది.

కోకా బాలకృష్ణారావు

రాత్రి మామయ్య చెప్పాడు భోజనాల దగ్గిర 'సంబంధం ఖాయం చేసుకొచ్చా'నని.

'అంతకట్నానికే ఒప్పుకున్నారా?' అంది అత్తయ్య ఆదుర్దాగా.

'ఆం...ఒప్పుకోకం చేస్తారు? మన అమ్మాయిలాంటి అమ్మాయి వాళ్ళకి తలక్రిందులుగా తపస్సు చేసినా దొరుకుతుందా?'

భోజనాలు పూర్తయ్యాయి.

మసక వెన్నెల్లో అరుబయట కూర్చున్న మామయ్యతో 'మామయ్యా! ఈ వేగం యిప్పుడప్పుడే తెగేట్టులేదు. రెండురోజులాలస్యమైతే అయింది. ఎట్లాగో నువ్వే ఫైసలు చేసేయి. నే రేపు వెళ్ళిపోతా' అని అరుగుమీద నాకోసం వేసిన పక్కమీద పడుకున్నా.

కొంచెంసేపటికి అత్తయ్య పని పూర్తిచేసికొని, వక్కనములుతూ మామయ్య మంచం దగ్గిరికివచ్చి 'అమ్మాయ్ శాంతా! తలుపేసుకో' అంది చాప పరుస్తూ.

తెల్లవారింది. నే కళ్ళు తెరిచేటప్పటికి, ఎండపొడ నా పక్కమీద పడుతోంది లేచి పడిమందంమీద కూర్చున్నా. అరుగు చివరగా ముఖం కడుక్కోటానికి పెట్టివున్న చెంబూ నీళ్లూ కనిపించాయి. మాట్లాడకుండా కార్యక్రమంలోకి దిగా.

కాఫీ త్రాగింతర్వాత కొంచెంసేపాగి అత్తయ్యిచ్చిన తువాలు కట్టుకొని స్నానానికి 'బాత్ రూమ్'లో ప్రవేశించా.

అక్కడ నీళ్ళుతోడుతోంది శాంత.

'శాంతా! నీకెందుకీకష్టం. నే తోడుకుంటాలే'

'ఇందులో కష్టమేముంది. అయినా అసలు దాన్ని నేవుండగా నీవు తోడుకోవలసిన ఖర్మ ఏంపట్టింది'

'కాదుశాంతా! మీ అమ్మ ఒక్కతే వంటింట్లో పని చేసుకుంటోంది. కాస్త సాయంవెళ్ళు'

'ఏం అక్కర్లేదు. పొద్దున్నే అందరికీ నీళ్లుపోయటం నాపని. వంటపనంతా అమ్మే చూచుకుంటుంది'

'అయితే యీలోపల మిగతావాళ్ళ పని కానీ'

'నాన్న స్నానంచేసి వెళ్ళాడు. ఇక బుజ్జిగాడు, మణి, శశి మిగిలారు చంటి దానికి అమ్మేపోస్తుంది ముందు నువ్వు త్వరగా కానిస్తే, మిగతావాళ్ళపని నేచూసుకుంటా' అంటూ శాంత దబదబా నా ఒంటిమీద రెండు చెంబులనీళ్ళు దిమ్మరించింది.

ఎంత సరిపెట్టుకుందామనుకున్నా యీ కృతకమైన వాతావరణంలో నేను ఒక్క క్షణంకూడా యిముడలేకపోతున్నా.

మామయ్య ఎప్పుడూ చాలా ముభావంగా వుంటాడు. అత్తయ్యకి ఎప్పుడూ వంటిల్లే ప్రపంచం. మనోభావాల్లో, మనతల్లో కూడా పరివర్తన కలుగుతుందనటానికి మామయ్య మనసాక ప్రబలనిదర్శనం.

ఆ యింట్లో అందరికీ తామేక గొప్ప కుటుంబానికి చెందిన వాళ్ళమనే అహంభావం కనిపిస్తూవుంటుంది. నే నేదో ఒకపని పెట్టుకొని, చుట్టంచూపుగా వచ్చినవాడిని. నా చుట్టుపక్కలవున్న భయంకర వాతావరణాన్ని, విషహాసాల్ని, కపటప్రేమని, పసిహృదయాల్ని, ఒంటరితనాన్ని, ఛేదించుకొని నాలోకి ప్రశాంతంగా చూసి కలిగేది ఒక్క శాంతి మాత్రమే. ఆ వ్యక్తి అంటూ అక్కడ లేకపోతే నేను అసలక్కడ అంత సేపు వుండగలిగే వాడిని కానే కాను!

భోజనాలయాయి నా బట్టలు సర్దుకోవటం మొదలు పెట్టా. శాంత వచ్చింది గదిలోకి.

'నే సర్దుతా లే బావా!' అంది చొక్కా తీసి మడత పెడుతూ.

'ఎందుకులే శాంతా! నే పెట్టుకుంటా!

'అదే నీకు పొద్దున కూడా చెప్పింది. మళ్ళీ మొదటికొచ్చావ్ చాల్చాల్లే కూచో' అని నా చేతులో బట్టలు లాక్కుంది శాంత.

నే నేం చేయలేక పోయాను.

శాంత ఏ పనిలోనైనా కల్పించుకుంటే, నా పోక్యం అంగులో ఏ మాత్రం వుండనివ్వగు. శాంత ఆజాపనతో నాలో ఏదో దౌర్బల్యం బయలు దేరుతుంది. వెంటనే ఆ పనినుంచి వెనక్కి తగ్గుతా.

'అయితే వెళ్ళిపోతావా బావా?'

'ఊ'

'మా ఇంట్లో రెండు రోజులైనా వుండకూడదు గాబోలు.'

'పరిస్థితులు నీకు తెలుసు శాంతా.'

'ఉత్తరాలైనా రాస్తూ వుంటావా.'

'రెండు చేతులు కలిస్తేకాని, చప్పట్లు చరవటానికి వీలు లేదు శాంతా.'

'పోనీ-జవాబైనా యిస్తావా,'

'తప్పకుండా'

'మళ్ళీ ఎన్నాళ్ళకి రావటం?'

'ఏమో!'

'మా గడప దాటితే, మళ్ళీ మేం గుర్తుంటామా?'

'అదే సరిగ్గా నేను అనుకుంటూ.'

'నా సంగతి అందరికంటే నీకే బాగా తెలుసు బావా.'

'తెలుసు... కానీ... వెళతా శాంతా!'

గదిలోంచి బయటికివచ్చా అత్తయ్య వంటింట్లో ఏదో పని చేసుకుంటోంది. మామయ్య వాకిట్లో అరుగుమీద పడుకున్నాడు.

'వెళుతున్నా నత్తయ్యా.'

'మంచిది నాయనా! అమ్మనీ వాళ్ళనీ అడిగానని చెప్పు-వచ్చిన వాడివి, రెండు రోజులైనా వుండాకుండా పోతుంటివి— పెళ్ళికి తప్పకుండా రండి నాయనా!' అని యింకా ఏమో చెప్పబోయింది. నేను అక్కడ నించో లేదు

వాకిట్లో, మామయ్య మందంమీద ఇటూ అటూ పొర్లుతున్నాడు.

'వెళుతున్నా మామయ్యా' అన్నా.

'ఊఁ...' అని మాత్రం అని ఆయన అటు పొర్లాడు.

రోడ్డుమీద చకచకా నడవటం మొదలు పెట్టిన వాణ్ణి, రోడ్డుగుమ్మం దగ్గర నించున్న శాంత మాత్రం కనిపించింది పాటాత్తుగా.

* * *

'ఏం చేసుకొచ్చావ్ వ్యవహారం' అంది అమ్మ

'అక్కడ పలికే నాధుడు లేడు. నన్నేం చేయమంటావ్. మాట్లాడకుండా వెనక్కి తిరిగి వచ్చా' అన్నా కసిగా.

'నిన్నే పనికి పంపినా యింతేరా నాయనా! ఇట్లాగైతే ముందు ముందు ఎట్లా నెగ్గుకొస్తావురా!'

'చాలే యింకనోరు. వడ్డించు' అని దొడ్లోకి పోయా కాళ్ళు కడుక్కోటానికి.

* * *

మామయ్య ఆవూళ్ళో హైస్కూలు అసిస్టెంటు. వచ్చే జీతం కాక పైన 'ప్రైవేట్లు' చెప్పి ఒక వందరూపాయలదాకా సంపాయిస్తాడు. పదేళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నాడేమో, బాగా గడించాడు.

అత్తయ్య స్వయానా మానాన్న చెల్లెలు. అత్తయ్యని బట్టి మామయ్య

నే చదువుకుంటున్నంత కాలం మా కుటుంబం ఆ వూళ్ళోనే వుంది. స్వగ్రామమని చెప్పుకునే ఆవూరికీ, మాకూ, మానాన్న చావుతో ఋణంతీరిపోయింది. తత్ఫలితంగా పొట్టచేత్తో పట్టుకొని వచ్చిన నేను అమ్మతో యీ వూళ్ళో ఒక చిన్న యింట్లో వుంటున్నా.

మా వూళ్ళో మా తాలూకు ఆస్తి ఒక యిల్లు మాత్రం వుంది. ఇక ఆ వూరికి వెళ్ళి కాపరం చేసేది ఎట్లాగూ లేదు కాబట్టి అది కాస్తా అమ్మకొద్దామని బయలుదేరా. వెళ్ళిన పని కాలేదు. ఎంతసేపటికీ బేరం వానవేస్తారు కాని, తెగనీయరు. మళ్ళీ మాట్లాడితే మన అవసరం బేరం వెయ్యి రూపాయలకంటె పలకలేదు. నాకు విసుగెత్తింది.

పైగా ఆ యింట్లో అందరూ బంధువులే అయినా పరిస్థితులలో మాత్రం చాలా మార్పు వచ్చింది. ఆ యింట్లో హృదయం విప్పి మాట్లాడేది ఒక్క శాంతమాత్రమే. మా ఇద్దరిలో చిన్నప్పట్నుంచి ఆత్మీయత అలముకుంది పరస్పరంగా.

పరిస్థితులను బట్టి వాతావరణం మారింది. మా నాన్న బతికుండి, సంపాయించిన రోజుల్లో మామయ్యా వాళ్ళకీ మాకూ మధ్య కొంత రాకపోకలు వుండేవి — అత్తయ్య వట్టి అమాయకురాలు. మామయ్య గీచిన గీటు దాటేశక్తి ఆమెకు లేదు

చుట్టు ప్రక్కల వాళ్ళు అనుకున్నారు మా రెండు కుటుంబాల మధ్య బంధుత్వం యింకా దృఢతరమౌతుందని. దానికి ఆధారాలు లేవు.

* * *

ఎవరి కన్నబిడ్డలసుఖం వాళ్ళు ఎందుకు కోరరు? అమ్మ నా సుఖాన్ని గురించి ఎన్నో ఆలోచనలు చేసేది ఆఫీసు జీవితంతో అనుక్షణం విసుగెత్తే నేను జీవితంమీద ఒక విధమైన నిరాశ పెంచుకున్నాను నాకు తెలియకుండానే నేను ఎప్పుడూ యింట్లో చిర్రుబుర్రు మనేవాణ్ణి అమ్మ అన్నిటికీ సహించేదిఓపికగా. ఒక్కొక్కప్పుడనుకు నేవాణ్ణి 'అమ్మ ఎంత శాంతిమూర్తి' అని.

అమ్మ నాకు పెండ్లి చేయాలని చాలా ప్రయత్నిస్తుంది. నా మనః ప్రవృత్తి ఆమెకి అర్థం కాదు. క్షణక్షణం మారుతూండే నా మనస్సులోనించి వచ్చేమాటలు ఆమెకి పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి నన్ను అర్థం చేసుకోవటం ఆమెకి చాతకాదు.

నన్ను నేను విమర్శించుకున్న రోజులు చాలా అరుదు. అట్లా చేసిన రోజున నా ప్రవర్తన నాకే అర్థం లేనిదిగా కనిపిస్తుంది.

(54-వ పేజీ చూడండి)

★ కొత్తరస్తా ★

రావికొండల వేంకటరావు

ఆని అమావాస్య అసురసంజ ఘడియ అవటంచేత, పడమటకు వాలిపడే ఎఱ్ఱటి పెద్దబింబం, ఆకాశాన్ని, సూర్యునిదే అని నిర్ధారించడానికి అవకాశం వుంది కాని, లేకుంటే పూర్ణచంద్రమేనా అనే అని వుందును. అంత చల్లగాను, అంత ఎఱ్ఱగాను, అంత పెద్దదిగాను, అంత దర్శనీయంగాను వుంది నాటి అస్తమానారుణ బింబం.

ఆ దిశ మఱి వెలుగులేదు. మేఘం లేదు. అంతా అడ్డులేని దిఙ్మండలాకాశం. ఐతే గోదావరి నీటిమీదుగా ఈవలి గట్టునుండి నేను చూస్తున్నాను అంటే రాజమహేంద్రవరపు గట్టునుండి. కనుక ఒక్క సూర్య బింబమే కాకుండా యింకా యేవో కాన వచ్చాయి. కెరటాలు, లంకలు, ఆ మధ్యను తెరచాపను పోయే నావలు, ఒక టేమిటి అవీ ఇవీ సుందరంగా నున్నాయి కష్టమన్నది తోచడంలేదు. అంతా తనంతటదే జరిగిపోతూన్నట్టుంది. ఈ జీవితమంతా స్వయముగా ఉత్తీర్ణమౌతూవున్నట్టు అగుపించింది ఆ ఘడియప్పుడు. నీళ్లుముంచే పణతి, కాళ్లు కడిగే కోడెకాడు ఒకేలాంటి విలాసంతో ఉన్నట్టున్నారు.

ఆయాసమన్నది ఎచ్చటా కనిపించడం లేదు. చెమట తనంతన పోస్తూవుంది. గాలి తనంతన వీస్తూవుంది. బయట పడ్డ బండల యొక్క అనగా రాళ్లయొక్క అరుదుల అరుదలగా లేకుండా నీటి తుంపర యదృచ్ఛ తడుపుతూవుంది చిమ్ముటగొట్టం కొట్టినట్టు. దూరాన్ని నీరాడుతూ వున్నట్టు ఆవలిగట్టు నీటివంచ పచ్చిక లున్నాయి. దృశ్యం బహురమ్యంగానుంది, యీవలివైపునుంచి ఆవలివైపుకంటా చూస్తూ వుంటే. అందులోను ఆ నిలిచి పడుతూవున్న ఒంటిపాటు అరుణాస్తమయ బింబమువందే మఱీ విడ్డూరమనిపిస్తూవుంది అటువంటప్పుడు కలవరపాటు అసంభవం!

అలా క్రిందకుపడ్డాడు సూర్యుడు. అనగా అస్తమించాడన్నమాట. ఇలా చూచాను వెనుతట్టు. నేనునించున్నగట్టు నే ఒకతురాయి మొక్క ఎఱ్ఱగాపూచి ఎక్కడా ఆకులేక వింత గొల్పుతూ వుంది వేసంగిలో. ఆ చెట్టును చూస్తూ దానిక్రింద అసలు ఒక గుడిసె ఉండేదే! ఏమైంది? చెప్మా! అని అనుకున్నాను. అలా అలా చూడ్డంలో, పెక్కు గుడిసెలు అక్కడ అదివఱదాకా ఉండేవి కూడా లేకుండా, గోడలుపడి కొన్ని, తడికలు పడి కొన్ని, అతి నిశ్శబ్దంగా కానుపించింది ఆ స్థలం ఆ స్థలంలో ఈ చెట్టు ఒకటే చైతన్యంతో కూడి, వేసంగికి విస్తరించుకు, తన ఋతుధర్మం తాను నెఱపుతూ వుంది.

నేనున్ను ఎఱుగున్నవానిలాగ ఆ చెట్టు వంకకు వెళ్లాను. ఇక లేక పోయి నా ఆవంకకు ఎందుకువెళ్లానా అని అనిపించింది ఈ తరువాత. కాని ఆ నిమేషమప్పుడు అప్రయత్నంగా అటువైపు నా అడుగులు సాగినాయి చెట్టంతా ఎఱ్ఱగావుంది. తురాయి చెట్టు అది. ఆ చెట్టుక్రింద మఱి

(58-వ పేజీ చూడండి)



29

వైశాఖమాసం రాగానే హరిహరుడు నిశ్చిందిపురంనుంచి నివాసం యెత్తెయ్యటానికి ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు. వాళ్లు తమ సామానులన్నీ వెంటతీసుకుని వెళ్లిపోవటం లేదు. వాటినన్నిటినీ అమ్మి చిల్లరబకుళ్లు తీర్చేశారు. ఏ కాలం నాటివో ఆ పనస చెక్క భోషాణం, కొవడిపెట్టె, మామూలు పెట్టెలు, పీటలు చాలా ఉన్నాయన్న సంగతి తెలిసి పొరుగూరు బేరగాళ్లు కూడా వచ్చి చవకగా కొనుక్కుని వెళ్లిపోయారు.

ఊళ్లో పెద్దలంతా వచ్చి హరిహరునికి నచ్చచెప్పి వాళ్లని వెళకుండా చెయ్యటానికి ప్రయత్నించారు. నిశ్చిందిపురంలో పాలు, పెరుగు, చేపలు-కూరలు ఎంతచవకో, ఎంత కొద్దిలో ఇక్కడ సంసారం వెళ్లిపుచ్చుకోవచ్చునో ఆ జాబితా అంతా ఏకరువు పెట్టారు. రాజకృష్ణ భట్టాచార్య మాత్రం — భార్య సావిత్రీ వ్రతానికి భోజనానికి పిలవటానికని వచ్చి, అవీయివీ మాట్లాడి చివరకు ఏదిఉంటే మాత్రం ఈ ఊళ్లో ఉండమని ఎలా అనగలంలే - అదీకాక జాతిరత్నాలన్నీ ఒకచోట కుప్పగాఉన్నా ప్రయోజనం లేదు. నేను నా అనుభవాన్ని బట్టి చెపుతున్నాను గా. మనస్సు సంకుచితమయితే దాని విహావికాసం కుంటుపడుతుంది. భగవంతుని కృప తిన్నగావుంటే చంద్రనాథుని ఈ సారయినా సేవించుకు రావాలని ఉంది..." అన్నాడు.

ఈ సంగతివిని రాణి అపూవాళ్ల ఇంటికి వచ్చింది. "ఏరా. అపూ! మీరు ఈ ఊరు విడిచి వెళ్ళిపోతున్నారటగా! నిజమేనా?" అని అడిగింది.

"నిజమే రాణీదీ! ఇంకా అమ్మని అడుగు—" అన్నాడు అపూ.

అప్పటికీ రాణికి నమ్మకం కుదరలేదు. చివరికి సర్వజయ చెప్పగా సంగతంతా విని రాణి తెల్లబోయింది. అపూని బయటికిపిలిచి "ఎప్పుడు వెళ్ళేది?" అని అడిగింది.

"వచ్చే బుధవారం కాక, పైబుధవారం".

"ఇంకెప్పుడూ రారా అసలు?"

రాణికి కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. "మన నిశ్చిందిపురం చాలా మంచిఊరని, ఇలాంటి ఏరు, ఇలాంటి మైదానం ఇంకెక్కడా లేవని నువ్వుఎప్పుడూ అనేవాడివిగా! ఈ ఊరు విడిచిపెట్టి మరిఇప్పుడు ఎలా వెళ్ళగలవురా?" అన్నది రాణి.

"నేనేం చేసేది? నేను రానని ఎలా చెప్పేది? నాన్నకు అక్కడ ఉండాలని ఉంది, మాకు ఇక్కడ ఎలా గడుస్తుందిమరి? నా పలక, పుస్తకాలు నీకు ఇచ్చి వెడతాలే రాణీదీ! మళ్లీ పెద్దవాళ్లమయినాక కలుసుకుంటా మేమో—" అన్నాడు అపూ!

అనువాదం:
మద్దిపట్ల సూరి

"నా పుస్తకంలో కథా పూర్తి చెయ్యలేదు నువ్వు. ఆ కథ నువ్వురాసినట్లు క్రింద సంతకమూ పెట్టలేదు. నువ్వు మొత్తానికి భలే వాడివిరా అపూ!"

కళ్లనీళ్ళు రెప్పలతో అప్పళించుకుని, రాణి గబగబా అక్కడినుంచి బయటికి వచ్చేసింది. రాణీదీకి ఉత్తపుణ్యానికెందుకో అంతకోపం-అపూ అర్థం చేసుకోలేకపోయాడు. తానేం కావాలని ఊరు విడిచి పోతున్నాడా?

స్నానాల రేవుదగ్గిరపటూ, అపూ చాలాసేపు మాట్లాడుకున్నారు. పటూకి ఈ సంగతి తెలియదు. అపూ చెప్పగా విని చాలా నిరుత్సాహ పడ్డాడు—"నీ కోసమని నేను ఎంత కష్టపడి నాచు అంతా ప్రక్కకు లాగి అక్కడ గుంట తీశాను! అందులో ఒక్కసారయినా చేపలు పట్టనేలేదు" అన్నాడు పటూ...

ఈసారి శ్రీరామనవమి, చైత్ర సంక్రాంతి గోష్ఠి విహార్ దగ్గరదగ్గరగా వచ్చాయి. ఏటా ఈ ఉత్సవాల రోజుల్లో అపూ ఉత్సాహం, ఆనందం పట్టశక్యం కాకపోయేవి. వాడు, వాళ్ల అక్క అన్ని రోజులూ నిద్ర పోయేవాళ్ళు కాదసలు. ఈ సారి అపూ కూడా ఆ విషయంలో మాత్రంలోటు చెయ్యలేదు.

చైత్ర సంక్రాంతినాడు ఊళ్ళో దయ్యం ముసలిది చచ్చిపోయింది. ఇటీవల క్రొత్తగా ఈ ఉత్సవాలు జరుగుతున్న మైదానానికి దగ్గరలోనే ఆ ముసలిదానిపాక. చాలామంది గుమికూడటం చూసి, తానూ అక్కడికి చూడటానికి వెళ్లాడు. వెనక ఒకసారి ఈ దెయ్యం ముసలిదానికి భయపడే వెదురు తోపుకు అడ్డంగా పడి పరుగెత్తాడు. అప్పుడు తాను చాలా చిన్నవాడు. ఇప్పుడా సంగతి గుర్తొచ్చినప్పుడెల్లా నవ్వొస్తూ ఉంటుంది. ఈ ముసలిది దయ్యమూ కాదు, ఏం కాదు అని తెలుసుకున్నాడిప్పుడు. ఊరికి ఓ కొసని, అందరియిళ్ళకూ దూరంగా ఒక్కతే ఉండేది. పేదది, దిక్కు లేనిది. కొడుకులు లేరు, కూతుళ్లు లేరు, కనిపెట్టుకుని ఉండే వాళ్లెవరూ లేరు. అలాంటివాళ్లు ఎవరైనా ఉంటే ఇంట్లో చచ్చిపోయిన మనిషి [illegible] అక్కడ ఉండేదా? సంస్కారం జరిపేందుకెవరైనా వచ్చేవాళ్ళుగా! జాలరి పాంచూ కొడుకు ఓకుండ బయటికి తీసుకువచ్చి బోర్లించాడు. దానినిండా మామిడి వరుగు ఉంది. రాలిపోయిన మామిడికాయలు ఏరుకునివచ్చి, ముసలిది వరుగుచేసేది. అవి బజారుకు తీసుకెళ్లి అమ్ముకుని, ఆ వచ్చిన [illegible]

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. బడి చదువుకూడా వాడికి ఏమీ అంటలేదు. ఇంట్లోనే తండ్రితాలూకు పుస్తకాలన్నీ చదివేస్తూ ఉండేవాడు. ఒకసారి వాళ్ల ఊళ్లోకి ఒకనాటక సమాజం వచ్చింది. వాళ్లువేసిన నాటకాలు చూసి అపూ తన్మయుడైపోయాడు. తనుకూడా పెద్దయ్యాక నాటక సమాజాల్లోచేరి నటుడైపోవాలని కలలు కన్నాడు తను చూసిన నాటకం కథ ఆధారంగా స్వయంగా ఒక నాటకంకూడా రాసేశాడు. మొత్తానికి వాడి ఆదర్శాలకు ఆకాశమే అవధి. దుర్గకి మంచి సంబంధం ఏదన్నా చెయ్యాలని తల్లి ఆవేదన పడేది. కాని మంచిసంబంధాలనేవి హరిహరరాయ్ కుటుంబానికి ఎన్నటికీ అందని మ్రానిపండ్లే. ఎప్పుడో ఏదో అదృష్టం కలిసివచ్చి తమ సంసారం బాగుపడుతుందనీ, దుర్గ గొప్ప ఇంటి కోడలైపోతుందనీ, అపూ పెద్దవాడై ప్రయోజకుడై తమ కష్టాలు గట్టెక్కిస్తాడనీ ఆమె కలలు కనేది. కాని ఆ కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

ఒకసారి దుర్గకి జ్వరం పట్టుకుని ఎన్నాళ్ళకీ తగ్గలేదు. హరిహరుడు ఊళ్ళోలేడు. తల్లి, పిల్లలూ తిండికికూడా మొహం వాచిపోయారు. ఆఖరుకి ఒక భయంకరమైన రాత్రివేళ, వర్షం ప్రళయంగా కురుస్తున్నవేళ దుర్గ ప్రాణవాయువులు అనంతంలో లీనమైనాయి. ఆమె జనన మరణ, సుఖదుఃఖ ద్వంద్వాతీతమైన ఏదో అజ్ఞాతలోకానికి వెళ్లిపోయింది. హరిహరుడు ఊరినుంచి తిరిగి వచ్చినతరవాత గాని దుర్గ మరణం వార్త అతనికి తెలియలేదు.

★ పథేర్ పాంచాలి ★

డబ్బుతో జీవిస్తూ ఉండేది. ఆ సంగతి అపూ ఎరుగును. క్రితం సారి రథోత్సవంలో కూడా ముసలిది జంగిడి పెట్టుకుని మామిడి తరుగు అమ్మటం చూశాడు.

ఈసారి సంక్రాంతి తిరునాళ్లు ఏమిటో దప్పదప్పగా ఉన్నట్లుంది. నిరుడు తిర్నాలకు కూడా అక్క పటాలూ అవీ కొని ఎంతో సంబరపడింది. వాడికది జ్ఞాపకంఉంది. ఆరోజున ప్రొద్దున అక్కా, తనూ పోట్లాడుకున్నారు. సాయంకాలం అక్క- "డబ్బులిస్తాకాని, తిర్నాళ్లలో 'సీతాపహరణం' పటంఉంటే చూసికొనుక్కుని రారా" అన్నది. అపూ కసితీర్చుకోటానికి "నువ్వెక్కడో ఎందుకూ పనికిరాని పాడు పటాలన్నీ కొనుక్కురమ్మంటావ్. నావల్ల కాదు. ఫో. ఏం రామరావణ యుద్ధం పటం ఎందుకు కొనకూడదూ?" అన్నాడు. "నీకెప్పుడూ యుద్ధాలపటాలు కావాలి! నీ మొహంపోదూ! దేముళ్ల పటాలు నీకు బాగుండవాయేం?" అన్నది అక్క. అక్క చిత్రకళాభిరుచిమీద అపూ కెన్నడూ సదభిప్రాయం లేదు.

తమ కంచెచుట్టూఉన్న మొక్కలు పూసిన ఎర్రటిపూలు చూడగానే అక్క ముఖం గుర్తువచ్చేది. పక్షులకూతలు చెవిని పడ్డా, మదాసాని పూలకదలికలు కంట పడ్డా-అక్క గుర్తువచ్చి వాడి మనసు అదోకలా అయిపోయేది. పరుగు పరుగున వెళ్లి చెపితే పరవశురాలయ్యే అక్క ఎక్కడికి, ఎంత దూరానికి వెళ్లిపోయిందో కదా. ఎప్పుడూ, ఇంకెప్పుడూ వీటిఅన్నిటితో ఆడుకోటానికి రాదుగా, అనిపించేది.

ఆ తిరునాళ్ల గందరగోళంలో ఎవరో దక్కగా పిల్లంగ్రోవి వాయిస్తున్నారు. క్రొత్తఫణితిపాట వాడికి చాలాబావుంది. ఎవరా అని వెతగ్గా వెతగ్గా మేదరివీధిలోని హారాన్ వెదురుకర్రతో చేసిన ఇన్ని పిల్లంగ్రోవులు కట్టకట్టి నెత్తినపెట్టుకుని, ఒకటి తాను వాయించిచూపిస్తూ, వాటిని అమ్ముతూండటం కన్పించింది. "ఎంత ఇది?" అని అడిగాడు అపూ. హారాన్ వాణ్ణిబాగా ఎరుగును. వాళ్ళఇంట యిల్లు ఎన్నోసార్లు వచ్చి నేశాడుకూడా. "మీరు ఈ ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారటగా అబ్బాయ్? ఏ ఊరువెళుతున్నారు?" అని అడిగాడు. అపూ అరణాయిచ్చి సన్నటి పిల్లంగ్రోవి ఒకటి కొన్నాడు. 'ఏ యే బెజ్జాలు మూస్తూ వాయించాలో ఒకసారి చెప్పు హారాన్ నేర్చుకుంటాను' అన్నాడు......

ఒకసారి అర్ధరాత్రప్పుడు తనకు హఠా

త్తుగా మెలకువవచ్చిన సంగతి గుర్తువచ్చింది. ఏటవదరిని ఎక్కడో పల్లెవాళ్ల దీపాల వెలుతురులో, చేపలుకై గంపలుపెట్టే తూముదగ్గర టక్ టక్ మని ఒకటే చప్పుడు వినిపిస్తోంది. అప్పుడు దూరంగా నీలమైదానం వైపుగా ఎవరో గొంతువిప్పి పాడుకుంటూ వెళ్ళటం తన చెవిని పడింది. నీలిమైదానం దారిన అంత రాత్రివేళ యెవరూ నడవరు సాధారణంగా. రాత్రిళ్లు వెన్నెల్లో ఎవరో అపరిచిత పథికులు పాటలు పాడుకుంటూ వెళ్ళటం. ఆ పాట క్రమంగా దూర దూరాన లీనమైపోతూ ఉండటం తనకు చాలాసార్లు అనుభవమే. కాని ఆసారి విన్న గొంతులాంటిది ఏన్నడూ వినలేదు ఆ ఫణితి పట్టుకోలేకపోయాడు. ఆ కలత నిదుర వేళ-గాఢంగా హృదయంలో నాటుకుపోయిన ఆ అతిసున్నితమైన పాట—క్రమక్రమంగా దూరమైపోతూ ఎప్పుడు విలీనమైపోయిందో —మళ్ళీ యెప్పుడూ దాని జాడయినా కన్పించలేదు. కాని అప్పూ దాన్ని ఎన్నడయినా మరచిపోగలడా?......

* * *

తిరునాళ్లు చూడటానికై వచ్చిన పాటక జనం—ఆడవాళ్లు మగవాళ్లు రంగు రంగుల-రకరకాల దుస్తులు ధరించి జట్లుజట్లుగా ఇళ్లకు తిరిగి వెడుతున్నారు. పిల్లలు పిల్లనగ్రోవులు ఊదుకుంటూ పోతున్నారు. "గోష్ఠివిహార్" ఉత్సవం చూడటానికని నాలుగయిదు క్రోసుల దూరం నుంచికూడా వచ్చారు జనం. గుడ్డ చిలకలు, కొయ్య బొమ్మలు, రంగుకాగితాల విసనకర్రలు రంగు రంగుల కుండలు—ఎవరి చేతిలో చూసినా ఏదో ఓ వస్తువు లేకుండా, లేదు. పాతాని శ్రీనివాసు తిర్నాళ్లలో మిఠాయి దుకాణం ఒకటి పెట్టాడు. అతడి దుకాణములో ఓ అర్ధణా పెట్టి నూనె సరుకేదో కొనుక్కొని, ఇంటిముఖం పట్టాడు అప్పూ. తిరిగి వస్తూంటేగ మనసుకి తోచింది: తాము వెడుతున్న ఆ వూళ్లో ఇలాంటి 'గోష్ఠి విహార్' ఉత్సవం ఉంటుందీ! ఇవానిలాంటి చైత్ర సంక్రాంతి తిరునాళ్లు చూడడం పడదేమో!...అక్కడ ఇలాంటి తిరునాళ్లు లేకపోతే—'నేను తిర్నాళ్లు చూస్తాను నాన్నా! నిశ్చిందిపురం వెడతాను. పోనీ రత్నాళ్ళు పిన్నిగారింటి కెళ్ళి ఉండి వస్తాను' అని తండ్రితో చెప్పదామనే ఊహ తట్టింది...

సంక్రాంతి వెళ్లిన మర్నాడు సామానులవీ మూటలుకట్టటం ప్రారంభించారు. రేపు మధ్యాహ్నం భోజనాలు చేసుకుని బయలు దేరాలి.

సాయంత్రం వంటయింటి వసారాలో పర్వజయ వేడివేడి పరోటాలు వండి పెడుతోంది పిల్లవాడికి. నీలమణి పెదనాన్నగారి

★ పథేర్ పాంచాలీ ★

నివేశనంలో కొబ్బరిచెట్లు ఆకులు వెన్నెలలో మిల మిలలాడుతున్నాయి. వాటికేసి అలా చూస్తూ కూచుంటే అపూ కెక్కడలేని దుఃఖమూ వచ్చింది. క్రొత్తచోటుకు వేడుతున్నామని ఇన్నాళ్ళనుంచీ పడుతున్న ఉత్సాహమంతా, వెళ్ళేరోజు దగ్గిరపడుతున్న కొద్దీ సన్నగిలిపోయి, రానున్న విరహాన్ని తలచుకున్న కొద్దీ మనస్సు వికలమైపోసాగింది.

ఈ ఇల్లూ వాకిలీ, ఆ వెదురుతోపు, మామిడితోట, ఏటిఒడ్డు, అక్క-తాను కలిసి వన భోజనం చేసిన ఆచోటు-ఇవన్నీ తన కెంత ఇష్టం! ఇలాంటి కొబ్బరిచెట్టు అక్కడ-తాము వెళ్ళిపోయేచోట ఉన్నదీ! బుద్ధితిరిగిన దగ్గిర్నుంచీ తానీ కొబ్బరిచెట్టును ఇక్కడ చూస్తున్నాడు. వెన్నెల్లో ఆ ఆకులు ఎంత చక్కగా కన్పిస్తాయి! వెన్నెలరాత్రివేళల ఈ వసారాలో కూర్చుని వెన్నెల్లో మిలమిలలాడే ఆ కొబ్బరి మట్టలకేసి చూస్తూ అక్కతో ఎన్నిసార్లు కబుర్లాడాడు! తమ నిశ్చిందిపురం ఎంతో బావుంటుందని ఎన్నిసార్లు తోచలేదు మనస్సుకి! తాము వెళ్ళిపోయేచోట వంటయింటి వసారా ప్రక్కన ఇలాంటి కొబ్బరి చెట్టు ఉంటుందీ! అక్కడ చేపలు పట్టుకోటానికి మామిడికాయలు ఏరుకోవటానికి, నావలెక్కి తిరగటానికి, రైలుఆట ఆడుకోవటానికీ వీలుంటుందీ? కడిమిచెట్ల రేవులాంటి రేవు అక్కడ ఉంటుందా? రాణూదీ ఉంటుందా? పోనా డాంగా మైదానం ఉంటుందా? ఇవన్నీ చాలా నచ్చినవి తనకు, ఎందుకు ఊరికే వీటి నన్నిటినీ ఇలా విడిచిపెట్టుకుని వెళ్ళటం?...

మధ్యాహ్నం ఓ సంఘటన జరిగింది.

వాళ్ళ అమ్మ సావిత్రీవ్రత భోజనానికి వెళ్ళింది. హరిహరుడు భోజనమయి ప్రక్కగదిలో పడుకున్నాడు. అపూ చావడిలో చెక్కలమీద ఉన్న సామానులు తీసుకు వెళ్ళేవి అవునా కాదా అని అటూ ఇటూ సర్ది చూస్తున్నాడు. పై చెక్కమీద ఉన్న మట్టిపిడత ఒకటి అక్కడినుంచి తీయబోతే అందులోంచి ఏమిటో ఘల్లుమని క్రింద పడింది. క్రిందపడిన దాన్ని తీసి చూసి అపూ తెల్లబోయాడు. దాన్నిండా దుమ్మూ అదీ పడిఉన్నా అది ఏంవస్తువో, దాని చరిత్ర ఏమిటో అపూ క్షణంలో గ్రహించాడు.

అది ఆ చిన్న బంగారు కుంకుమ భరిణె, క్రితం సంవత్సరం భువనముఖర్జీగారింట్లో ఎత్తుకువచ్చిన కుంకుమభరిణె

మధ్యాహ్నవేళ ఇంట్లో యెవరూ లేరు. ఆ భరిణె నలాగే పట్టుకుని పరధ్యానంగా చాలాసేపు నిలబడ్డాడు. వైశాఖమాసపు మిట్టమధ్యాహ్నపు మండుటెండలో వెదురుతోపులోని జుయ్ జుయ్ ధ్వనులు ఎక్కడెక్కడి వార్తల లాగానో చెవికి సోకుతున్నాయి. 'పాపిష్టిది అక్క ఎత్తుకువచ్చి ఈ పిడతలో దాచిపెట్టింది' అనుకున్నాడు తనలో తాను.

వాడు కాసేపు ఆలోచించాడు. తర్వాత నెమ్మదిగా దొడ్డికుమ్మందాకా వెళ్ళి అక్కడ నిలబడ్డాడు. చాలా దూరంవరకు విస్తరించి ఉన్న వెదురుతోపు మధ్యాహ్నం ఎండకు జోగుతున్నట్లుంది.

ఆ తెల్లగ్రద్ద ఏ చెట్టుకొసనో కూర్చుని సాగతీస్తున్నట్లు కూస్తోంది. ద్వైపాయన హ్రదంలో దాక్కున్న పూర్వయుగంలోని పరాజితుడు, దైవోపహతుడైన రాజపుత్రుని వేదనాకరుణిత మధ్యాహ్నం! కాసేపు అలా

నుంచుని చేతులోని బరిణెను వెదురుతోపు లోకి ఒక్క విసురు విసిరి పారేశాడు. వాళ్లి అక్క పిలిస్తే వుక్క పరుగెత్తుకుంటూ వచ్చేదే సరిగ్గా అక్కడికే—ఎండిపోయిన వెదురుటాకుల కుప్పలో కొమంచిచెట్ల గుబురు ప్రక్కగా ఎక్కడికో పోయి పడిం దది.

'అక్కడే ఉండనియ్. ఎవరికీ తెలియ కుండా ఉంటుంది సంగతి. అక్కడికెవరు వెళ్లి వచ్చారు?' అనుకున్నాడు తనలో.

ఆ బంగారు బరిణె సంగతి అపూ ఎన్నడూ-ఎవ్వరికీ-ఆఖరికి వాళ్ళ అమ్మకు కూడా చెప్పలేదు.

ప్రొద్దు కొంచెం తిరగగానే హీరూ ఎద్దు బండి బయలుదేరింది. ప్రొద్దున్నే ఆకా శంలో అక్కడక్కడ కొసిని మబ్బులున్న మాటయితే నిజమే. కాని పదిగంటలయే సరికే ఆ మబ్బు లెక్కడి వక్కడ విడిపోయి ఆకాశం నిర్మలంగా ఉన్నది మిటమిట లాడే వైశాఖమాసపు మండుటెండ, చెట్లు వగుసగా ఉన్నా మైదానమంతా నిప్పులు చెరగుతోంది. పటూ బండివెనుకే చాలా దూరం వచ్చాడు. "అపూదా, ఈసారి ఉత్సవానికి మంచి నాటక సమాజానికి బయానా ఇచ్చారు. నీకు తెలియదేమో ఈసారి-"

"ఏ నాటకమో- ఏమిటో. ఆ కాగితాలు నువ్వు మరి కొసిని తీసుకుని పంపించు నాకు" అన్నాడు అపూ.

ఆ తిర్నాల జరిగిన మైదానం ప్రక్క నుంచే దారి.. తిర్నాలు జరిగిన గురుతులుగా-మైదాన మంతటా ఒలిచిన కొబ్బరి డొక్కలు, టెంకాయచిప్పలు, అరటిగెలల మోడులు దొర్లుతున్నాయి. మైదానంలో ఎవరో ఓ ప్రక్కన అన్నం వండు కున్నారు. కాలిన పొయ్యి, మసిబారిన క్రొత్తకుండ పడిఉన్నాయి అక్కడ. హరి హరుడు మెదలకుండా కూర్చున్నాడు బండిలో. అతడి మనస్సు ఎలాగో ఉంది. 'ఇది మంచి పనేనా? ఎన్నాళ్ల నాటిదో-తండ్రి కట్టించిన యిల్లు, ప్రక్క పాడుబడిన నివేశనంలోని రగడ అంతా ఆఖరయిపోయి నట్లేనా! ఆ గడ్డమీద 'ఇంతవరకు మినుకు మినుకుమని వెలిగిన దీపం ఇవాళ సాయంత్రం నుంచీ శాశ్వతంగా ఆరిపోయినట్లేనా! తండ్రి రామచంద్ర తర్కవాచస్పతి స్వర్గంలోనుంచి చూసి ఏమనుకుంటూ ఉంటాడో!

ఊరు దాటిపోతోంది. ఆదయ్యాపు ముసలి దాని గుడిసె కన్పిస్తున్నంతసేపూ అపూ అటువైపే చూస్తూ కూర్చున్నాడు తర్వాత పెద్ద ఖర్జూరపుతోట ప్రక్కనుంచి వెళ్లి 'ఆసాఢ్యా' వెళ్లే కంకరరోడ్డు ఎక్కింది బండి. ఊరు దాటిపోగానే సర్వజయకి మాత్రం ఇన్నాళ్ల ఈ దారిద్ర్యం, ఈ నైచ్యం ఈ అవమానపు బ్రతుకూ కూడా దాటి వచ్చేశాం. ఇహ ఎదుటనున్నది - క్రొత్త జీవితం, క్రొత్త సంసారం, క్రొత్త సిరి మాత్రమే...అనిపించింది.

క్రమంగా ఎండ తగ్గిపోయింది. బండి సోనాడాంగా మైదానం మధ్యనుంచి వెడు తోంది. హరిహరుడు మైదానం మధ్యనున్న పెద్ద మర్రి చెట్టును చూపిస్తూ - "అదుగో అదే ముసలమ్మ చెరువు. దొంగల మర్రి" అని చెప్పాడు. సర్వజయ చప్పున ముఖం బయటికి పెట్టి చూసింది. దారికి కొంచెం ప్రక్కగా చిన్న రాళ్ళగుట్ట ప్రక్కన నాలుగు వైపులా ఊడలుదిగి ఉన్నదా మర్రి చెట్టు. ఆవృద్ధ బ్రాహ్మడు, అతడి కొడుకు గాథ ఎన్నోసార్లు విన్నదామె. ఇప్పటికి యాభైయేళ్ళ క్రితం తన మామగారి పూర్వీ కులు ఇలాంటి సంజెవేళప్పుడు—ఏ పాప మెరుగని ఆ బ్రాహ్మణుని, అమాయకు డైన అతడి కొడుకుని డబ్బుకోసమని క్రూరంగా హత్యచేసి, ఇక్కడే - అప్పుడు ముసలమ్మ చెరువు అని ప్రసిద్ధికెక్కిన ఈ పల్లపు చోటులో ప్రుక్కారు. ఆ పిల్ల వాడి తల్లి తన కొడుకు ఇంకా వస్తాడు, ఇంకా వస్తాడు అని ఎన్ని నెలలు, ఎన్ని యేళ్లు యెదురుచూచిందో! ఆ పిల్లవాడిహ అసలు తిరిగి వెళ్ళనేలేదు! అమ్మో! సర్వ జయకి హఠాత్తుగా కళ్లలో నీళ్లు తిరిగాయి. గొంతు ఏమిటో పట్టుకుపోయి నటయింది.

ఈ ప్రాంతపు మైదానాలన్నిటిలోకీ సోనాడాంగా మైదానమే పెద్దది. అక్క డక్కడ ఏవో తుప్పలు, పొదలు, బూరుగు

★ పథేర్ పాంచాలి ★

చెట్లు, తుమ్మచెట్లు...ఖర్జూరచెట్లని గెలలు వ్రేలాడుతున్నాయి. కొండగోగుపూల గుత్తులు ఊగిసలాడుతున్నాయి. ఎటు చూసినా 'పాపియా' పక్షుల రొదలు, సుదూర వ్యాప్తమయిన మైదానంపైన అవిశపూరంగులాంటి ముదురునీలపు రంగు ఆకాశం వెల్లకిల పడుకున్నట్లుంది. పచ్చటిగడ్డి పరచుకున్న మిటపల్లంగా ఉండే మైదానంలో ఎక్కడా వ్యవసాయయోగ్యమయిన భూమి అనేది లేదు. అన్నీ చెట్లూ,పొదలూ తుప్పలే, మిగిలిన ప్రదేశమంతా గడ్డి పెరగటంతో పచ్చగా వుంది. ఎదుట మట్టిరోడ్డు సంసారం వదలిపోయే నిరీహుడయిన విరాగిలాగా చాలాదూరం వరకు తన యిష్టంవచ్చినట్లు వంకరటింకరగా పోయింది. పూర్వం యెన్నడో ఏదో నది ఎండిపోయి, జీవితయాత్రలోని పదచిహ్నాల్ని మాత్రం మిగిల్చిపోయింది. అంతర్హితమైపోయిన నది తాలూకు లోతైన ప్రదేశమంతా ఇప్పుడు తామరపూలతో నిండివుంది. అపూ బండిలో కూర్చుని మైదానంకేసి, చుట్టూ ఉన్న అపూర్వమైన ఆకాశపు రంగుకేసి చూస్తూ వస్తున్నాడు. సాయంకాలపు స్వప్న చిత్రంలోకి చిన్నప్పటి స్మృతులెన్నో వచ్చి విలీనమైపోతున్నాయి. వాడు ఊరు విడిచి వెళ్ళటం ఇదే. ఇప్పుడింకా ఎంతదూరం వరకూ వెళతాడో! తన ప్రయాణం ఆరంభమయినది ఇప్పుడే. ఇంకా బహుశా ఆ దేశాలు, కలలుగన్న ఆ అపూర్వజీవితం చూడవచ్చు.

హరిహరుడు దూరంగా కన్పిస్తున్న ఓ గ్రామాన్ని వ్రేలితో చూపిస్తూ—'అదుగో అదే 'పలాశ్ గాఛి', దాని ప్రక్కనే 'నాటాబేడే', అక్కడే బన్‌బీబీ మసీదు దగ్గర శ్రావణమాసంలో పెద్ద ఉత్సవం జరిగేది! ఇక్కడ దొరికినంత చవకగా గుమ్మడికాయ లింకెక్కడా దొరకవు' అని చెప్తున్నాడు.

'ఆసాఢూ' బస్తీకి దిగువ బంస్లెసులాబీ దగిర 'వేత్రవతి' నదిని దాటుతూండగా నెల పొడిచింది. వెన్నెల కాంతికి నీళ్లు మిలమిల లాడుతున్నాయి. ఇవాళ ఆసాఢూ సంత. సంతకు వెళ్లివస్తున్న జనం సందడి చేసుకుంటూ అవతలి ఒడ్డునుంచి సంగడి దాటి ఇవతలి ఒడ్డుకు వస్తున్నారు. అపూ తండ్రితో చెప్పి సంతచూడటానికి దిగాడు. చిన్న సంత. దుకాణాలు బారులు తీర్చి ఉన్నాయి. కంసాలి దుకాణాల్లో సుత్తి దెబ్బలు టక్ టక్ మని విన్పిస్తున్నాయి. ఓ బెల్లపుబట్టీముందు ఎద్దుబళ్ళు గుంపుగా ఉన్నాయి. మాఝేర్ పాడా స్టేషన్ ఇంకా ఇంచుమించు నాలుగు క్రోసులుంది. మట్టిరోడ్డయినా విశాలమైన రోడ్డు. రెండు వైపులా నీలిమందు దొరలహయాంలో నాటిన మర్రిచెట్లు, రావిచెట్లు. కంబళి చెటు దండిగా ఉన్నాయి. వైశాఖమాసపు తొలిరోజులు. దారి ప్రక్కనున్న మర్రిచెట్లు రావిచెట్ల మామిడిచెట్ల కొమ్మల్లో ఎక్కడో ఉండి, కోయిల కూసికూసి అలసిపోతోంది. దారి పొడుగునా పెద్ద పెద్ద మర్రి చెట్ల ఊడలు వ్రేలాడుతున్నాయి వెన్నెల పడి చిగురుటాకులు తళతళలాడుతున్నాయి.

బాంగ్లా దేశపు వసంతం—మైదానాలలో, తోటల్లో, తోపుల్లో, ఎక్కడ పడితే అక్కడ, కోయిలకూతలో, నాగకేసరపు చెట్లని ఒత్తుగా విరిసిన పూల బరువులో, అడవిపూల వాసనలతో నిండిన, జ్యోత్స్నాస్నిగ్ధమైన దక్షిణ వాయువులో ఉల్లాసంగా ఆనంద నృత్యం ప్రారంభించింది. ఇలాంటి అపురూపవసంతదృశ్యాన్ని అపూ జీవితంలో ఇదే మొదటి సారిగా చూడటం. ఈ చిన్న వయసులోనే వాడి మనస్సులో బాంగాదేశపు మైదానాలు, నదులు, నిర్జన వన ప్రాంతాల్లోని వెన్నెల రాత్రుల అద్భుత శోభలు హత్తుకుపోయాయి అవే వాడికి అనంతర శిల్ప జీవితంలో మధురభావనలు రేకెత్తేట్లు చేశాయి.

* * *

రాత్రి ఇంచుమించు పది గంటలకు స్టేషన్‌కు చేరుకుంది బండి. ఇవాళ బండి ఎప్పుడెప్పుడు స్టేషన్‌కు చేరుకుంటుందా అన్న ఆశతో కూర్చున్నాడు అపూ. బండి ఆగగానే దిగి, ఒక్క పరుగు తీశాడు ప్లాట్ ఫారం మీదికి. రాత్రి ఎనిమిదిన్నర రైలు వెళ్ళి చాలాసేపయింది. తండ్రి నడిగితే ఇంక ఈరాత్రికి రైలు లేదని చెప్పాడు. హీరూ బండికికట్టిన ఎడ్లు రెండూ దమ్మువి. అందుచేతనే ఇలా జరిగింది, లేకపోతే రాగానే రైలు చూడగలిగేవాడు తాను. ప్లాట్ ఫారం నిండా పొగాకు బేళ్లు పడేసి ఉన్నాయి ఇద్దరు రైల్వే వాళ్లు ఇనుప దిమ్మలాగా ఉన్న దాని మీద ఈ బేళ్లను పెట్టి ఏమిటో చేస్తున్నారు. వెన్నెల పడి రైలు బద్దీలు నిగనిగలాడుతున్నాయి రైలురోడ్డుకి అటువైపున ఎత్తుగా ఉన్న స్తంభం మీద రెండు ఎర్ర దీపాలు, అలాగే ఇటువైపున ఓ రెండు దీపాలు వెలుగుతున్నాయి. స్టేషన్ గదిలో టేబిల్ మీద పలకలలాంతరు వెలుగుతోంది, ఓకట్ట పుస్తకాలున్నాయి ప్రక్కన అపూ గుమ్మం దగ్గరకు వెళ్లి, చూస్తూ నిలబడ్డాడు స్టేషన్ మాస్టర్ ఏదో ఓకొయ్యగుబ్బలాంటి దాన్ని నొక్కుతూ టక్ టక్ మనిపిస్తున్నాడు. స్టేషన్! స్టేషన్! ఇంకెంతో వ్యవధి లేదు. రేపు ప్రొద్దున్నే రైలును ఊరికే చూడటం కాదు, ఎక్కబోతున్నాడు తాను.

వాడికి ప్లాట్ ఫారం మీదనుంచి కదల బుద్ధిపుట్టటం లేదు కాని వాళ్ళనాన్న పిలవటానికి వచ్చాడు. ఆ కొయ్య గుబ్బ లాంటిది నొక్కటం-టెలిగ్రాం కొట్టటంట! వాళ్ళ నాన్న చెప్పాడు.

అపూ వెనక్కి తిరిగిచూశాడు, స్టేషన్ ప్రక్కనే చెరువుగట్టునవంట—భోజనశాల ఏర్పాట్లు జరుగుతున్నాయి అంతకుముందు నుంచే అక్కడ ఇంకొకబండి ఆగి వుంది. ఆ బండిలో వచ్చినవాళ్లు ఓ పద్దెనిమిదేళ్ళ యువతి, మరొక యువకుడు. ఆ అమ్మాయి హబీబ్‌పూర్‌లోని విశ్వాస్ గారింటి అమ్మాయి అని, అన్నని తీసుకుని అత్తవారింటికి వెడుతున్నదని అపూ విన్నాడు. ఆ అమ్మాయికి వాళ్ళ అమ్మతో బాగా చనువయింది వాళ్ళమ్మ 'కిచిడీ' చేస్తోంది.

(41-వ పేజీ చూడండి)

అంతా విషాదాంతం కాదు

హావల్లార్ల మెస్సులో ఓ అరడజను చపాతీలూ, యింత తర్కారీతిని బయటకు అడుగుపెట్టాడో లేదో- రొప్పుతూ రొజుతూ ఎదురుగా మణి నిలబడివున్నాడు- వరండాలో.

"నీకోసమే బ్రదర్! పొద్దున్నించీ వెతుకుతున్నాను. బ్యారక్సన్నీ గాలించి వస్తున్నా. అడ్జుటాంటు చెప్పాడు-మనిద్దరికీ వచ్చేవారం డీమాబ్! ఇ గ్రూపులో వున్నాం."

"డీమాబ్?"

"అవును బ్రదర్. ఇ గ్రూప్. ఏమిటట్లా చూస్తావ్. యుద్ధం అయిపోయింది. మనకీ యీ ఖాకీ యూనిఫారం పోతుందన్నమాట. తెల్సిందా?"

విశ్వనాథం కళ్ళు పెద్దవి చేసి మణి ముఖంలో ముఖంపెట్టి, నాలుగుతువాలు దిగాలుపడి చూశాడు. మిలిటరీనుంచి తన్ని డిస్ఛార్జిచేస్తున్నారు. మణి అబద్ధం చెప్పటం లేదు. నేరుగా అడ్జుటాంటుగది ముందుకు పోయి నోటీసుబోర్డు చూశాడు. 'ఇ' గ్రూపులో తనపేరున్నది.

నాలుగురోజుల్లోనే పోసన్నులు, గ్రాట్యూటీలు, పాతజీతం పద్దులు అన్నీ సెటిల్ అయిపోయినై. మరుసటివారం అదే రోజున-జేబులో పదిహేనువందల రూపాయలు, చేతిలో మిలిటరీ రైల్వేవారంటు, చంకలో చిన్న సూట్‌కేసు-యీ పరంజామాతో గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో కూర్చొని వున్నాడు-విశ్వనాథం. తనెక్కడికి పోతున్నట్టు? తనెవరికి కావాలని? ఎక్కడ దిగాలి? ఏగమ్యం? ఎందుకు? ఇన్నాళ్ళూ? రైలుపెట్టెలో కూచొన్నాక గాని అతనికి జీవితాన్ని సింహావలోకనం చేసుకొనే అవకాశం లభించలేదు.

తనను కని తల్లి గతించింది. నాల్గవఫారం హైస్కూల్లో చదువుతూండగా తండ్రి గతించాడు. దయతలచి మేనత్త మొగుడు వారాలు యిప్పించాడు. వాళ్ళింట్లోనే వుండి చదువుకొనేవాడు. పరాయివాడైనా వెంకటప్పయ్యగారే తనను కొంచెం ఆదరించేవాడు. తన మేనత్త ఎప్పుడూ ఏదో పాతసంగతులు కడుపులో దాచుకొని సాధిస్తూవుండేది. ఆమెకూతురు సరోజిని-బిక్కుబిక్కుమంటూ తను చదువుకుంటూంటే లాంతరు క్రీనీడలో వచ్చి కూర్చునేది. అట్లా స్కూలుఫైనల్ గట్టెక్కించాడు. చందాలలిస్టు, వారాలతిండి ఆసరాగా చూసుకొని కాలేజీలోగూడా చేరాడు. ఎద్దులాంటి పిల్లాడికి వారాలేమిటని కొందరన్నారు. ఈ చీట్లపేక పంచరంగా యిట్లాగే చందాలలిస్టుతో తయారవుతున్నారే యీ మధ్య-అని మరికొందరన్నారు. తనకు అవమానం ఏమిటిగాని-మణివచ్చి మిల్టరీలో చేర్దామా అని తన ముఖంవంక ఆశగా చూశాడు. గత ఎనిమిదేళ్ళ జీవితానికి అదీనాంది. దేశాలు తిరిగాడు. పదిమందితో ధైర్యంగా మాట్లాడటం నేర్చాడు. ప్రపంచజ్ఞానం సంపాదించాడు. కాని ఆరోజున ఎక్స్‌ప్రెస్సునుంచి దిగితే తన గమ్యం ఏమిటో తెలియదు. ఎవరు? ఎందుకు? ఏమిటి? అన్నట్టుగావుంది యీ జీవితం.

మునిపల్లె రాజు

మణి బెజవాడలో దిగిపోతూ—మీ మేనత్తగారింటికేపో. నాకు చూడగానక్కడే నీకు వివాహం అయ్యే సూచనలు గూడా కనబడుతున్నై—అన్నాడు. విశ్వనాథానికి సరోజిని—చిన్నతనంలో గౌను వేసుకొని, లాంతరు క్రీనీడలో కదలక మెదలక కూచునే సరోజిని గాదు—కొత్త సరోజిని, కన్నె ముగ్ధ, అందమైన పరికిణీ,ఓణీ, కాళ్ళకు చిరుగజ్జెల పట్టీలు, పెదవులమీద చిరునవ్వుతో రైలుపెట్టె కుదుపు నిద్రమగతలో కన్పించింది.

రైలుదిగి—జట్కా సాయిబుతో—నేరుగా వెంకటప్పయ్యగారింటికి సాయిబూ అన్నాడు.

"అగ్గర్ ఆరం హైం బోల్ పంతుల్ వెంకటప్పాగారండీ"

"అఁ అఁ"

"జీ - చలో"

* * *

విశ్వనాథం ఆగమనాన్ని ఆయింట్లో ఎవ్వరూ ప్రతీక్షించలేదు. అతని రాకను ఎవ్వరూ విస్తుపోయినట్లుగా గూడా లేదు. చివరకు తన మిలిటరీ జీవితంలో విశేషాలను గురించి, యిరుగు పొరుగు వాళ్లు తప్పితే అత్తయ్య ఒక్క ప్రశ్న గూడా వెయ్యలేదు. తను వచ్చిన నాలుగుదినాలకు గాబోలు మామయ్య వెంకటప్పయ్యగారన్నాడు. ఎవ్వరూ పనికిరాదన్న పెట్రోమాక్సు లైటును తను ఖచ్చితంగా మరామత్తు చేసి యిచ్చినపుడు:

"వోరివిన్నూ—ఎంత అసాధ్యుడివైనావురా."

విశ్వం చిరునవ్వు నవ్వి వూరుకొన్నాడు. పొద్దుపోవటానికని—యింట్లో పాతకుర్చీలను తను మిలిటరీలో సంపాదించిన వడ్రంగం నేర్పుతో రిపేరుచేశాడు. దొడ్లో కూరపాదులకి శాస్త్రీయంగా నీటి వసతి ఏర్పరిచాడు. వంటింటి గడపమీదకూర్చొని అత్తయ్యతో కల్పించుకొని కబుర్లు చెప్పబోయాడు. కాని ఆమె అత్యంత ముభావంగా మాట్లాడింది. తనకు మణిచెప్పిన అమాయకపు జోస్యంలో నమ్మకం మాత్రం చావలేదు. రైలుకుదుపు మగతలో తనకు సాక్షాత్కరించిన ప్రబంధకన్య సరోజిని సమక్షంలో వున్నా, ఆమె చిరునవ్వుకు నోచుకోలేదు. తనను 'బావా' అని పిలిచే ఏమని బదులివ్వాలో తెలియక గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీనుంచి బెజవాడదాకా బుర్రబద్దలు చేసుకొన్నాడు గాని, ఆ ఆలోచనలకు అవసరమూ, అర్థమూ లేందూ లేవని అత్తయ్యగారింట్లో దిగిన వారంరోజుల్లోనే తెలుసుకొన్నాడు.

విశ్వాన్ని మిలిటరీలో మృత్యువు వెన్నాడలేదు. అలవాటుపడిన కసాయివాడివలె దాని సంగతే మరచిపోయాడు. అస్సాం అడవుల్లో అందరికీ మలేరియా వచ్చినా తను సంపూర్ణ ఆరోగ్యంతో అక్యాబ్ దాకా చేరాడు. అన్ని రకాల తిండి తిప్పలూ అతన్నెప్పుడూ బాధించలేదు. తన ఒంటరి తనమే తనీడ, తన వేదాంతం, తన తోడుగా-తనతో ఆ ఎనిమిదేళ్లూ తిరిగింది. ఆ ఒంటరి తనమే ఇప్పుడు గూడా నీడలేని తోడువలె వెన్నాడుతున్నది.

ఒకరోజున అత్తయ్య అతన్ని హఠాత్తుగా ప్రశ్నించింది.

"ఒరే విన్నూ, నీకు హార్మోనీ పెట్టె బాగు చేయటం వచ్చా?"

"ఎందుకు రాదత్తయ్యా. ఏదైనాసరే-

★ అంతా విషాదాంతం కాదు ★

తెస్తువు తేసరికి బాగుచేసిస్తాను. మిల్లరీ అంటే అంతే అత్తా."

"బాబు బాబు నీకు పుణ్యంవుంటుంది. సరోజ పెట్టె కొత్త బాగుచేసి పెట్టు బావా!"

సరోజనితో యిన్నాళ్లకుగాని మాట్లాడే అవకాశం దొరికింది. పని పురమాయించి అత్తయ్య వంటయింట్లోకి పోయింది.

"ఏదీ-చూద్దాం."

"నా గదిలో వుంది. నేను తెయ్యలేను."

అని సమాధానం యిచ్చింది సరోజని.

ఆమె ముఖంవంక చూశాడు. ఆ అమ్మాయి నవ్వుతూ వుంది. ఆమె పెదవులు "బావా" అని సంబోధించినట్లుగా వున్నవి.

"నేను తీసుకొస్తాలే పద."

గదిలో పాతపెట్టెల పేటికమూట క్రింద దుమ్ముకొట్టుకొని, మూగగా పాత నాటకాల్లోని పద్యాలు పాడి పింఛను తీసుకొంటున్నట్లుగా వుంది-ఆ హార్మోనియం. కాని విశ్వానికి దానిమీద ఎక్కడలేని ఆప్యాయత పుట్టుకొచ్చింది. ఇన్నాళ్ళూ దాన్ని అంత అశ్రద్ధగా ఎందుకు కాపాడారో, యిప్పుడంత అవసరంగా ఎందుకు దానిమీద జాలి తలిచారో-అత డాలోచించలేదు.

"ఏం రీడ్సు?"


"తెలీదు బావా—"

తన చెవులను తను, చివరకు తనను తనే నమ్మలేక సరోజని ముఖాన్ని తిరిగి సాలోచనగా పరికించాడు. రైలు కలలోని చిరునవ్వులో, ముత్యాల పలువరసలో, సిగ్గులో కంది ఎర్రనైన ముఖంతో-ఆ సరోజనే. ఆ సరోజనే. తన...సరోజనా?! గుండె సముద్రంవలె పరుచుకొన్నది. ఉత్తుంగ తరంగాలెన్నో లేచినవి.

అది పాత హార్మోనియం. నాటు రీడ్సు. ఇంట్లో పారబడలేక సెకండ్ హాండ్ మార్కెట్లో మామయ్య మన్నా కొన్నాడేమో. వాయించి చూశాడు. ఎప్పుడూ, ఎక్కడా వినని శ్రుతి ఏదో వినబడ్డది. ఆ శ్రుతిలో ఒక ప్రబంధకన్య చిరునవ్వు తరంగాలు కలిసిపోయినవి.

"ఓ. బంగారంవంటి పెట్టె. ఇట్టే బాగు చేసేస్తా-సరూ!" అనేశాడు.

సరూ!-బావా - సరూ!! ఒక్క పదంలో నే-బావా అన్న ఒక్క సంబోధనలో నే-తన జగత్తు సంగీతాన్ని విన్నాడు. తన భవిష్యత్తు ప్రేమగీతిక విన్నాడు. తన లోకపు చంద్రకిరణ శైత్యాన్ని అనుభవించాడు. ఇక అమె గొంతెత్తి పాడితేనో? ఏ లోకాల మధుర గానం వినిపిస్తుందో? ఏ



వృక్షశాస్త్రోద్యానవనంలో ఒక దృశ్యం — ఉదకమండలం.

—ఫొటో: కె. వి. ఆర్. నాథ్.



వృక్షశాస్త్రోద్యానవనం — ఉదకమండలం.

—ఫొటో: కె వి ఆర్ నాథ్

అమరస్వరాల ఆనందానుభూతుల్ని వెద జల్లుతుందో!

ఆ సాయంత్రమే బెజవాడ పరిగెత్తు కెళ్లాడు మధ్యే బస్సు చెడిపోయి ప్రయాణం ఆలస్యమైనప్పుడు డ్రైవరుమీద అమాంతం కోపంకూడా వచ్చింది బెజవాడలో దుకాణాలన్నీ గాలించగా గాలించగా తనకు కావల్సిన పారిస్ రీడ్సు దొరికినై సుతిమెత్తని సుతెలు, యితర పనిముట్లు కూడా సంపాదించాడు పాపువాడు తన ఆదుర్దాచూసి మొదటచెప్పిన రేటుకన్నా బిల్లులో ఎక్కువ ఖరు చేసినసంగతికూడా అతనికి తట్టలేదు ఆరాత్రి యింటకివచ్చి పెట్రోమాక్సు లైటు వెలిగించి—రీడ్సన్నీ మార్చేశాడు గాలిపోసుకోమని ఎదురుతిరి గిన తిత్తుల్ని బుజ్జగించాడు. నడిరేయికల్లా కొత్త హార్మోనియం మిలిటరీ కవాతును కూడా పాటగా మార్చేసింది

"ఒరేయ్—విస్సూ—పూరంతా లేస్తుం దిరా అదక్కడ పెట్టి పడుకో" అని మామ మందలింపు సెమ్మదిగా వినవచ్చింది

ఆరాత్రి భళ్లున తెల్లవారుతుంది సరూకి మాత్రం తనకు మాదిరిగా ఆత్రంలేదెందు చేత? ఎప్పుడు పాడుతుందో మొదటిపాట ఏమవుతుందో? బహుశః—"తొలనేజేసిన పూజా—" గావచ్చు తనుమాత్రం పూరు కొంటాడా? తనకొచ్చిన సైగల్ పాట లన్నింటిని పాడక మానుతాడా!

*   *   *

విస్సు తన కలలకు ఒక రూపం కల్పించు కొన్నాడు కలలేగాదు ఆలోచనలకు సైతం కొత్త రూపంవచ్చింది రూపమే గాదు— విద్యుద్వేగం వచ్చింది ఆ ఆలోచనలకు లయ, రాగము, తాళము సుదిరికగా కుదిరి నాయి అట్లా వీధికిపోతే అతనికి నిన్నటి దాకా—తనపాలిట పాత యమకింకరులు కన్పించేవాళ్లు తను గతిలేక వారాల తిండి తింటూండగా పురుగును చూసినట్టు చూసి, తన సరసనే భోజనానికి కూచున్న తమ బిడ్డ లకు వేడన్నం, బంగాళాగుంపల కూర వడ్డించి, తనచేత పాచిపోయిన చద్దెన్నం. పాత చింతకాయలపచ్చడి కొద్దిగా తినిపిం చిన పెద్దలే యీ కింకరులు ఈనాడు తాను కొంచెం పొద్దుగా భారీగా పెరిగి ఎదిగి కళ్ళ తర్వాత మనిషిగా కనిపించగానే, తన అభివృద్ధికంతా తామే కారణమని డబ్బా వాయించుకునే పెద్దలే యీ కింకరులు ఈ కింకరుల కూచిభార్యలు సరేసరి! ప్రతి

మాటవెనక—బంగాళాదుంపల కూరతిన్న తను బిడ్డ ప్రతి తరగతిలోనూ దండయాత్ర చేస్తుంటమూ, యీ 'తద్దినం' కుర్రాడు దిగులూ విచారంలేకుండా పెద్దవాడైనట్లు కనబడ్డమూ—యీ ఆశ మందూ కాలకు కడుపు కోత. వాళ్లందరూ తనచేతి బలవంతంగా గౌరవం పొందడం, తను వాళ్ళ తలనొప్పి సన్నిధిలో వినయవినమ్రులు నటించడమూ—అక్కడ దిగినప్పటినుంచీ దుర్భరంగావుంది కాని ఆరోజున ఆ కింకరుల కుళ్లు వ్యాఖ్యలకన్నింటికి కులాసా సమాధానాలు చెబుతూ ఆనందంగా కన్పించాడు.

"ఏమోయ్ విశ్వనాథం—మళ్లీ ఎన్నాళ్ళకు కనిపిస్తావో?"

"అదేమిటండీ సేనిక్కడే సెటిల్ అయిపోయి మీ అందరు పెద్దలముందూ బదుకుదామనుకుంటుంటే."

"అట్లాగా, భేష్. భేషుగ్గా వుంది."

ఆరోజున మణికి పెద్దవుత్తరం వ్రాశాడు. వాడి దూరదృష్టికి, దివ్యజ్ఞానానికి ఆశ్చర్యం ఆనందానందం ప్రకటించాడు. వాడి ఆశీర్వాదాలకు ధన్యవాదాలర్పించాడు.

ముహూర్తం అనేమాట, త్వరలో అన్నమాట - చివరిపంక్తుల్లో - తప్పక 'రావాలి సుమా - అన్న విజ్ఞాపన పదిసార్లయినా వ్రాశాడు. వుత్తరం అందిస్తారో లేదోఅన్న భయంతో, తంతి తపాలా శాఖ ముందరి కాళ్ళకు బందాలువేస్తూ, దాన్ని సర్టిఫికేట్ ఆఫ్ పోస్టింగుకింద అంపించేశాడు. అక్కడినుంచి నల్లులుకుట్టే థియేటరుకువెళ్ళి, తన మిలిటరీ జీవితంలో నేర్చుకొన్న కొత్త అలవాటు—అమెరికన్ పాతచిత్రాన్నొకదాన్ని చూసి అందులోని విలన్‌నూ, హీరోనూ యిద్దర్నీ మెచ్చుకొన్నాడు. దారిలో యిన్ని పూలుకొని చక్కగా యింటికొచ్చాడు.

విస్సు యిలు చేరేటప్పటికి - అపరిచిత బంధువుల కొలిహోళ్ళు గుమ్మంలోనే కన్పించాయ్. వాకిట్లో వుండగానే సరోజిని గొంతు, తను బాగుచేసిన హార్మోనియం శృతి చక్కగా వినిపిస్తున్నాయ్. అక్కడి సంఘటనలను ఆకళింపు చేసుకోడానికి విశ్వానికి ఒక్క క్షణంకూడా పట్టలేదు. "తన"- సరోజిని పెళ్ళిచూపుల మధ్యవున్నది. పెద్దల మధ్య- వుంగరాల జుట్టుతో, కళ్ళజోడుతో ఎర్రగా బక్కపలచగా వున్న పెళ్ళికొడుకు మనసు రంజింపజేయాలని ఆమె పాటపాడుతోన్నది.

* * *

ఆ వూళ్ళో విశ్వం నిజమైన శ్రేయోభిలాషి ఒక్కడే వున్నాడు-అనంతరామయ్య. ఆయన పంతులు. తన గర్భ దరిద్రంలో కూడా పిలిచి విశ్వానికి ఆనాడు వారం యిచ్చాడు. జీవితంమీద రోసిపోయి నప్పుడల్లా- ఆ దిక్కులేని కుర్రవానికి-తన వేదాంతంతో చిరునవ్వు, మనో ధైర్యం కల్పించాడు. ఆయనన్నాడు—"తల్లికి పిల్లవాడి ఆస్తి కూతురికి ఏర్పడబోయే నగలు కావాలి. తండ్రికి- పిల వాడి వుద్యోగం. అసలుపిల్లకు పిల్లవాడి షోకు, చర్మపు రంగు, అందం కావాల్సివచ్చేను. నిజానికి ఆ ముగ్గురికీ అనుభవంలేదు నాయనా. వాళ్ళు జీవితాన్ని కాచి వడబోయలేదు. నీ సంస్కృతే నీ ఆస్తి. నీ జీవితానుభవమే నీ వుద్యోగం. నీ ఆత్మ సౌందర్యమే నిజమైన అందం. కాని బాహ్యదృషికి ఆ పిల్లవాడికన్నా అన్నివిషయాల్లోనూ నువ్వు తక్కువేనేమో."

విశ్వం అశ్రునయనాలతో అనంతరామయ్యగారి మాటలను, ఆయన వుపదేశాన్ని విన్నాడు.

"పెదనాన్నగారూ, నేను రేపే వెళ్లుతున్నాను. మీ కళ్ళజోడుకు ఫ్రేమొకటి కావాలి. ఇంకా ఎన్నాళ్ళు ఆట్వాయిన్ దారం కట్టుకుంటారు?" ఆయనకని తెచ్చిన కొత్త ఫ్రేమును అమర్చియిచ్చాడు. ఆ మర్నాడే విశ్వం వెళ్ళిపోయాడు ఆ రాత్రి పొంటిముద్ద నోటిదాకా ఎత్తి భోజనం ముందర అనంతరామయ్యగారు భార్యతో అన్నాడు- "విశ్వం ఓడిపోలేదు. ఇకనుంచి వాడి జీవితమంతా విజయమే."

అనంతరామయ్యగారి మాటలు—అతని మనః ప్రవృత్తిని దృఢతరం చేయటానికి మిక్కిలిగా వుపయోగించినై. ఆ మాటలవెనక వున్న సత్యాన్ని గ్రహించి భవిష్యత్తుకు గట్టిపునాదులు వేసుకున్నాడు. సరోజినిని గురించి ప్రేమగీతాలు రచించలేదు. విరహగీతాలు పాడుకోలేదు. శరత్ దేవదాసువలె సారాసీసా శరణు కోరలేదు మిలటరీనుంచి విడుదల పొందినవాళ్ళకు ప్రభుత్వమిచ్చిన ప్రోత్సాహ ప్రోద్బలాలన్నింటినీ చక్కగా వినియోగించుకొన్నాడు. మిలటరీలో వున్నప్పుడే బియ్యే దాకా చదవాలని చేసుకొన్న నిర్ణయం అమలులోకి తెచ్చాడు. మిలిటరీలో పాసయిన ఇంగ్లీషు సర్టిఫికేటు పరీక్షమూలంగా రెండేళ్ళలోనే డిగ్రీ పుచ్చుకున్నాడు. ఈ లోపల వున్న డబ్బును పినాసిలాగా వాడాడు. సీజన్‌లో హైస్కూల్లో మొద్దుపిల్లలకు ట్యూషన్లు చెప్పాడు. ఒక చలికాలం, వర్షాకాలమంతా కాలేజి లేనప్పుడు-సైకిలురిక్షా తొక్కి ఒకరోజులో రెండురోజుల భత్యం చొప్పున సంపాదించాడు. మణి తననుగురించి జాలిపడ్డప్పుడల్లా గట్టిగా మందలించాడు.

అనంతరామయ్యగారొక్కరే అతనికి అడపా దడపా వుత్తరాలు వ్రాసేది. అతను బి. ఇ డి. చదివి వుపాధ్యాయవృత్తికి సంబంధించిన వృత్తిలోనే వుండాలని సలహా యిచ్చిందికూడా ఆయనే. ఆ సలహాను విశ్వం శిరసావహించాడు. బి. ఇ. డి. ట్రైనింగు అయిపోతుందనగా అనంతరామయ్యగారి వుత్తరం వచ్చింది—"మాకావా ఎర్రగా వున్నాడని సరోజినిని ఆత్వ్యష్ట్రికి అంటగట్టారా? తనయిల్లు అత్తగారిల్లు గుల్లచేశాడు. సినిమాలు తీస్తానని చివరకు వళ్ళుకూడా గుల్లచేసుకొని హఠాత్తుగా చచ్చిపోయాడు. అర్నెల్లయింది. మీ మామకు దిగులుతో మంచం శరణ్యమయింది. పక్షవాతం. "జీవితానివి" నువ్వుండగా పోయి "మృత్యువును" కౌగలించుకొన్నాడు. మీ అత్త నీ అడ్రసు కావాలని తీసుకెళ్ళింది. బహుశః జాబు వ్రాయిస్తుందేమో. పాపం తిండికికూడా యిబ్బందియేట్లుగా వుంది—తల్లీ కూతుళ్ళకుకూడా."

ఆ తరువాతి సంవత్సరంలోనే విశ్వం స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగా సెలెక్టు అయి,

వాడు. ఉద్యోగంలో చేరినరోజే అనంతరామయ్యగారికి జాబు వ్రాశాడు. కాని ఆ వుత్తరం తిరిగివచ్చింది. దానిమీద తప్పాకు ఇంగ్లీషులో "చిరునామాదారు చచ్చిపోయాడు" అని వ్రాసివుంది. విశ్వం-యిక తన బ్రతుకులోని సంతోషదుఃఖాలు తన కొక్కడికే అనుకొన్నాడు.

* * *

ఉద్యోగపర్వంలో ఎంతిదూరపు జిల్లాకి బదిలీ అయితే అంత సంతోషించే విశ్వానికి-నాలుగేళ్ళలోనే తిరిగి తన జిల్లాకే, తన రేంజికే, 'తన' వూరువున్న రేంజికే హఠాత్తుగా బదలీఅయింది. విశ్వం వేదాంతి ధోరణికి యిదేమంత పెద్ద సంఘటనగా అవుపించ లేదు. అనంతరామయ్యగారు లేని ఆ వూరుకు తనెట్లా పోగలనా అని మాత్రం ఒక్కక్షణం విచారించాడు. కానీ గ్రాంట సమయం. ఆ కొద్ది రోజుల్లోనే తాలూకా అంతా ఇన్స్పెక్షనువుంది.

సరిగ్గా-పదేళ్ళకు మళ్ళీ ఆ వూరు గడ్డమీద పాదం మోపాడు విశ్వం. దేశానికి పట్టిన సౌభాగ్యం ఆ వూరికి పట్టినట్లుగా లేదు. పాత గోడ లుమరింతగా కూలిపోయి, దిబ్బరిగొట్టుగా కనబడుతున్నై. ఊళ్ళో చాలా యిళ్ళు ఖాళీచేసిన దయ్యాల కొంపలుగా కనిపించినై. ఆ యిళ్ళల్లో తన మామగారి యిల్లొకటి. ఆ యింటి మీదుగానే చెరువుగట్టునున్న తాటాకుల పాఠశాల కెళ్ళాలి.

స్కూల్లో ఒక పంతులమ్మ వుంది. బడి ముందు తోటలో పూల మొక్కలే ఎక్కువగా కన్పిస్తున్నై. గ్రామంలో కల్లా ఆదొక్కటే రమణీయ ప్రదేశంగా గోచరించింది.

ఇనస్పెక్టరు గారు తోటలో వుండగానే పంతులమ్మ బయటికొచ్చి నమస్కారం చేసింది.

"ఎవరూ!"

"బావా—! విస్సు బావగారూ"

"సరోజినీ—"

ఆ రాత్రి-ఇన్స్పెక్షను పగలే అయిపోయినా—స్కూల్లో బల్లలు దగ్గిర జేర్చి విశ్వం పడుకొని మకాం వేశాడు. ప్యూను గొణుగుతున్నా. తెలతెల వారుతూండగా కలవచ్చింది. అనంతరామయ్యగారు కనబడి అడుగుతున్నాడు—"విశ్వం! నీకు వితంతు వివాహంలో నమ్మకం వుందా?" అని.

విశ్వం-కలలోనే "వుంది" అని స్పష్టంగా జవాబిచ్చాడు. తోటలో పూలన్నీ మంచువానకు తడిసి వుదయ కిరణాల్లో మెరుస్తున్నై. తనిక్కడికెందుకొచ్చిందీ విశ్వానికి అర్థమయింది. ★

నమ్మలేని నిజాలు

కె. పి. బాబు

భోజనానికి వచ్చిన రామకృష్ణకి అన్నం, పప్పు, చారు, కూరలూ అన్నీ వేడి వేడిగా పొగలు క్రక్కుతూ కన్పించాయి. ఏకో ఆ ఉప్పూ, మజ్జిగా మంచినీళ్లూ మాత్రమే చల్లగా వున్నట్లూ– చిన్న తమాషా చేస్తే కమలకూడా వేడెక్కిపోతుందన్పించింది.

చిరునవ్వుతో తన పీటమీద కూర్చుంటూ "ఒరే, చిన్నకథ చెప్పనా? భలే తమాషా కథలే!" అన్నాడు.

చల్లార్చుకొని, భోజనం చేయడానికి తిప్పలు పడుతున్న పిల్లలు ఈ మాటలతో ఎగబడ్డారు.

"చెప్పండి నాన్నగారూ, చెప్పండీ! ఈలోగా అన్నమైనా చల్లారుతుంది." అన్నారు.

కమలమాత్రం ఓ సారి గంభీరంగా భర్తకేసి చూచి, మళ్లీ తనపనిలో నిమగ్నురాలై పోయింది.

రామకృష్ణ మందహాసంతో మెల్లగా "తెనాలిరామలింగడి పిల్లి" కథ చెప్ప నారంభించాడు. అతని ఉద్దేశ్యం, కథంతా చెప్పి, చివరన "అలనాడా రామలింగడు అలా వేడిపాలుపోసి పిల్లికి పాలు పోసేబాధ తప్పించుకొన్నాడు; ఈ నాడీ రామకృష్ణ అర్ధాంగి వేడి వేడి అన్నాలెట్టి ఇక అన్నం పెట్టేబాధ తప్పించుకోవాలని చూస్తున్నట్లుందీ!" అని చమత్కరించాలని. కాని, పాపం—అతను కథ ప్రారంభించగానే అవాంతరం ఎదురయ్యింది!

"ఉహూఁ! ఈ కథా? నా కేనాడో తెల్సు. ఒద్దుబాబూ, మరోకథ చెప్పండీ" అన్నాడు, పెద్దబ్బాయి.

"నాకూ తెల్సులే." అని అడ్డొచ్చింది, పెద్దమ్మాయి.

"నాకు తెలీదు నాన్నగారూ, చెప్పండీ, పూర్తిగా. నే వింటానుగా" అని అక్కనీ, అన్ననీ కసురుకొంది, చిన్నమ్మాయి.

చిట్టాడు మాత్రం సాలోచనగా "నాన్నారూ, నాన్నారూ! మరే-మరే-రామలింగడంటే మీరే కదూ? నాకు తెల్సులేండి" అన్నాడు, ఉన్నట్లుండి.

రామకృష్ణ నవ్వి "నేను రామకృష్ణనిరా! వాడు రామలింగడు!" అన్నాడు.

క్రిందటిసారి తాను చూచిన 'తెనాలి రామకృష్ణ' సినిమా గుర్తుకు తెచ్చుకొంటూ, వాడు "ఊఁ! పోండి! రామలింగడన్నా, రామకిట్నుడన్నా, ఒకళ్లేనని అమ్మ చెప్పలా! ఆ రామకిట్నుడి పెళ్లాం పేరూ మనమ్మ పేరేగా?" అన్నాడు.

ఆ మాటలకి కమలకికూడా నవ్వవచ్చింది కాని, బిగబట్టుకొంది

రామకృష్ణ నవ్వుతూనే "అయితే ఆ రామకృష్ణుడికి ఒక్కడే కుర్రాడుగదా, ఈ రామకృష్ణుడికి ఇంతమం దేమిట్రా పిల్లలూ" అని ప్రశ్నించాడు.

వాడు ఓ క్షణం ఆలోచించి "ఆ సినీమా తీసేసరికి ఇంకా పుట్టలేదేమో!" అని జవాబిచ్చాడు.

"ఓరి పొట్టోడా! పుట్టేడు బుద్ధులూ నీవు, నిజంగాను!" అంటున్న భర్తకి అడ్డు తగిలి కమల "ఏం, గొప్పకర్ర లాగుండే మీకేం బుద్ధులకి కొదువనా?" అంటూ లేచింది.

"సిగ్గు లేకపోతే సరి! ఈ మిటమధ్యాన్నపు వేళకిగాని పొయ్యిలో పిల్లిని లేపలేకపోయారు, పైగా వేడివేడిగా వున్నాయి వంటలని తెనాలి రామలింగడి పిల్లికథ చెప్తున్నారు! అయనంటే—ఆ పిల్లి మూతి కాల్చడంవల్ల అవు పాలన్నా పొందాడు; నేను మీమూతి కాల్చి ఏం పొందగలవని?"

ఇంక చాలు, అధికమైతే సరసం విరసమే నని రామకృష్ణ మందహాసంతో ఊరుకుండి పోయాడు

అతని ఓటమితో కమలకి ఇంకొంచెం ఏడ్పించా లన్పించింది.

"ఊరుకుండి పోతే సరిపోతుం దనుకొంటున్నారా, పాపం! ముందున్నది ముసళ్ల పండుగ—ఇరసై ఆర్తో తేదీ!" అంది

అమ్మ అలా అనగానే చిన్నమ్మాయి గభాలున లేచింది "ఓ! ఇది జనవరి నెల కదూ?" అని గబగబా వాళ్ల నాన్న దగ్గరికి వెళ్లి ఠీవిగా నిల్చింది. "ఏమండోయ్, ఇలా చూడండి సార్! గుర్తుందా, రిపబ్లిక డే! మనం పుట్టేంరోజు! హే!" అని హుంకరించింది, సగర్వంగాను

దించిన తల వెంటనే ఎత్తలేక పోయాడు రామకృష్ణ

సరసం విరసమైపోయింది! కాకపోయినా, రిపబిక్ ఉత్సవాలైనా, ఆ పిల్లకి తన పుట్టినరోజు గుర్తు లేక మానవు; అప్పుడయినా అది గోలచేయక ఊరుకోదు! ఇంతకీ అది పుట్టక పుట్టక ఆ రిపబ్లిక్ డేనాడే ఎందుకు పుట్టాలని! పుట్టిందే అనుకొందాం, అసలీ కష్టకాలంలో ఈ పుట్టినరోజులూ, పెళ్లిరోజులూ-ఇవన్నీ చేసుకొని తీరాలనే పట్టుదలలేమిటి?...

అంతలోనే, "ఛా! పసిపిల్ల! పెద్దాళ్ళం అన్నీ తీర్చుకున్నాం చక్కగానే! పాపం ఈ పిల్లలవిషయంలో ఈ కష్టూరి ఊహ

మిటే?" అనుకొని ఆ వెంటనే బాధపడి, రామకృష్ణ నవ్వుతూ తలెత్తాడు.

"దానికేంటిలే! మాదక్కాగా జరుపుకొందాం!" అన్నాడు.

"ఏది జరుపుకొందామనుకోవడం లేదూ? అవే జరగడంలేదు గాని!" అని మూతి విరిచింది కమల.

"అదే-అదే-చూస్తుండూ" అని గబగబా భోజనం చేయడం ముగించాడు.

*　　　*　　　*

జనవరి-ఇరవైఆరో తేదీ ఉదయానికి రామకృష్ణ జేబులో దమ్మిడీ లేదు

నెలాఖరురోజులని తను తలపట్టి ఆలోచిస్తుంటే-ఇంట్లో ఏమీ లేవని అర్ధాంగి హెచ్చరికలు, పుట్టినరోజని చిన్నమ్మాయి గోల!...

సైకిలెక్కి సరాసరి రావు ఇంటికి వెళ్ళాడు.

"ఏమిటో బ్రదర్ విశేషాలు? ఊరకరారు మహానుభావులు!" అన్నాడతను మందహాసంతో.

ఇంట్లో ఏమీ లేకుంటే బాగోదని, చిన్నమ్మాయి నష్టం చేసుకొన్నాడు రామకృష్ణ.

"ఇదిగో నాదగ్గరున్న వే పదిహేను రూపాయలు! నీవో పది పుచ్చుకో. అయిదుతో నేను ఒకటో తారీఖు చూడగలనే గాని, ఒక చిన్న సలహా-మనబోటి బ్రతికి చెడ్డవాళ్ళకి ఈరోజుల్లో కూడా ఇంకా ఈ పుట్టినరోజు పండుగలూ, పబ్బాలూ ఏమిటో బ్రదర్? పిల్లలంటే సర్దాలూ, ప్రేమలేని వాడి నేంకాదు గాని, కాలాన్నిబట్టి చెప్తున్నాను, తగ్గాలి తగ్గాలి అని" అన్నాడు స్నేహితుడు.

నిజమే నన్పించింది రామకృష్ణకి. నిత్యజీవితమే గడవడానికి కిన్ని ఇబ్బందులూ పడ్తుంటే, మధ్యమధ్య ఈ వినోదాలు, విలాసాలూ ఎటొత్తటుకొనేది! ఉన్నప్పుడు చేసుకొన్నటే, లేనప్పుడు విరమించుకోవాలి గాని లేకుంటే ఎట్లా బ్రతికేది?...ఇంతకీ కలవారింటి పిల్లని పెళ్లి చేసుకోవడంవల వచ్చిన తిప్పలివి - అని నాలిక్కరుచుకొన్నాడు. అది సరిగాదు — పెద్దలు చేతి కందించిపోయిన సిరిసంపదలను విచ్చలవిడిగా ఖర్చు చేసుకొన్న స్వయంకృతాపరాధం, అని మళ్ళీ సమాధాన పర్చుకొన్నాడు.

ఏదో ఒకటిలే కొనిద్దూ—అనుకొంటూ బజారుకిపోయి, ముందుగా చిన్నమ్మాయికి ఒక గౌనూ, లంగా కొని, ఆ పైన ఆ రోజుకి ంటి కవసరమైన వస్తువులుకొని మిగిలిన ిల్లర జేబులో వేసుకొని . తిన్నగా ఇంటి గారి పట్టాడు.

నాన్నగారి చేతిలోనుండి పొట్లాం లాక్కొని మహానందంగా గంతులేస్తూ చిన్నమ్మాయి "అబ్బబ్బ! కొత్త బట్టలు—నాకే!" అంటూ లోనికి పోయింది.

ఆక్షణంలో రామకృష్ణకి "ఎంతైతే నేమి? ఏమైతే నేమి? కన్నబిడ్డల తృప్తి చూడగలితే చాల్దుగదా, మనిషన్నవాడికి!" అన్పించింది.

అంతలోనే చిట్టాడు "నాకేవి నాన్నగారూ? ఊఁ!" అంటూ రాగాలు ప్రారంభించాడు. వాడి వెనకనే పెద్దమ్మాయి "స్కూలుకి పోవడానికే సిగ్గేస్తుంది, ఒక్కటే మంచి చొక్కా లేదండీ!" అని గుణిశాడు. అతనికి వంతపాడింది పెద్దమ్మాయి

ఏమీ తోచక రామకృష్ణ తిన్నగా ఇంట్లోకి—ఆ పిలల్ని తీసుకుపోయాడు.

అక్కడ కమల తెచ్చిన గౌనూ, లంగా చిన్నమ్మాయికి తొడిగి గిరగిరా త్రిప్పి ఊరికే నవ్వుతోంది రామకృష్ణ లోనికి రాగానే అతని ముందుకా పిల్లని తోస్తూ "పోవే, చాల బాగున్నావులే, అచ్చం మాల పిల్లలాగ!" అంది.

ఆ పిల్ల తండ్రి దగ్గరకిపోక, సిగ్గుతో ఓ మూలకిపోయి, తను తొడుక్కున్న బట్టలు చూసుకొంటూ నిల్చుంది.

"ఏం బాగాలేవా?" అనడిగాడు.

"ఇన్నేళ్లుగా సంసారం చేస్తున్నారు, ఈరోజుకి మీకు ఎటువంటి బట్టలు కొనాలో తెలీ లేదండీ!" అని ఊరికే నవ్వుతూ, "అవి మాలపిల్లలు కట్టుకొనే గుడ్డలు!" అంది.

తన తెలియనితనానికేమీ బాధ కలుగలేదు రామకృష్ణకి కాని, భార్య అంత నాగరీకురాలూ, అతి తేలిగ్గా 'మాల పిల్లల్ని', వాళ్లు కట్టుకొనే బట్టల్ని చులకన చేసి మాట్లాడ్తూవుంటే ఎంతైనా చురుకు తగిలింది.

ఈ లోగానే కమల లోననుండి ఒక

★ నమ్మలేని నిజాలు ★

పార్సిల్ తెచ్చింది. అందులో ఒక వెల్వెట్ ఫ్రాకూ, సిల్కు లంగా ఉన్నాయి!

"మా బెజవాడక్కయ్య ఈ మెయిల్లో ఎవరో వస్తుంటే, గుర్తుచేసుకుని మరీ దీని పుట్టినరోజుకివి పంపింది—చూచారా?" అని జబర్దస్తీగా చూపెట్టింది.

అంతవరకూ చూడని కారణాన పిల్లలంతా అమ్మపైకి ఎగబడ్డారు.

రామకృష్ణకి తల తీసేసినట్లయింది. ఆ 'బెజవాడక్కయ్య' సంగతి తనకి తెలియనిది కాదు. పాపం, ఆ 'బావ'గారెంత అభాగ్యుడో! తానింకా నయం, తన పెళ్ళాం పిల్లలకోసమే ఇన్ని అవస్థలూ పడుతున్నాడు. ఆయనగారు ఇతరుల పెళ్లాం బిడ్డలకోసమూ శ్రమ పడ్డాడుగదా! తన చెల్లి బిడ్డ పుట్టినరోజుకీ బట్టలు పంపితీరాలని కనీసం ఒక రాత్రయినా ఆమె, ఆయనపై సత్యాగ్రహం చేసివుంటుంది! ఆయనకీ నెలాఖరు రోజులే! ఊరంతా పిచ్చాడిలా తిరిగి తిరిగి, ఏ స్నేహితుల కాళ్లో, గడ్డాలో పట్టుకొని మరీ ఇవి కొని పంపి 'ఆవిడ'గారికి సంతృప్తి కలించి వుంటాడు!

సంసారం!

ప్రేమసుధా పూరమా?

దుఃఖ సాగరమా?

ఏది సత్యం?...ఏది తనకి అర్థంగాక, ఎవరినడిగి తెల్సుకోవాలో తెలియక రామకృష్ణ తిలాంచుకొని బయటికి వచ్చాడు.

2

ఆ పూట పిండివంటలతో సహా చక్కని భోజనాలు తయారుచేసింది కమల. పిల్లలంతా ఉత్సాహంగా భోజనం చేస్తున్నారు. రామకృష్ణ తన కెదురుగా కూర్చున్న చిన్నమ్మాయి వేసుకొన్న 'బెజవాడ బట్టలు' చూచి, కమలని "నేను తెచ్చిన బట్టలేవీ?" అనడిగాడు.

"పెద్ద పెట్టెలో పెట్టాను. ఇంట్లో ఉన్నప్పుడు వాడుకోవడానికి పనికొస్తాయిలెండి!" అంది, భర్త బాధ తగ్గించాలని.

భోజనాలవీ అయ్యాక, "మరి రేపటి సంగతో?" అంది మెల్లగా, కమల.

రామకృష్ణ ఆలోచనలో పడ్డాడు...

మళ్లీ రేపొద్దుటే ఊళ్లోపడి అడుక్కోవాల్సిందేనా? ఛి, ఛీ! - అనిపించింది కాసేపు...మళ్ళీ కొంతసేపు 'ఛి, ఛీ అనుకొంటే ఎట్లాగు? ఇది జీవితం!' అనిపించింది.

చప్పున ఒకటి గుర్తొచ్చింది....ఉదయం బజార్లో బాబాయిగారగుపించారు. "ఏం నాయనా, అసలు కన్పించడమే లేదు. వీలైతే ఇవ్వాళైనా పిల్లల్ని తీసుకొని అలా రాకూడదా? బ్రహ్మాండంగా వుంటుంది ఉత్సవం!" అన్నారు. "వీలైతే తప్పక అంతా వస్తా"మని చెప్పాడతను...

రామకృష్ణ ఈ రాయపురం స్టేషనుకి ట్రాన్స్ఫర్ కాకముందు అతని నివాసం మౌంట్ రోడ్డులో ఆ బాబాయిగారింట్లోనే.

ఆయన మదరాసులో స్థిరపడిపోయిన ఆంధ్రుడు. రిటైర్డు ప్రభుత్వోద్యోగి. మౌంట్ రోడ్డు ప్రక్కనే గల కోమలేశ్వరన్ పేటలో స్వంత డాబా ఇల్లుంది. తినడానికిన్ని గింజలిచ్చే పొలముంది. ఖర్చుకి కావలసినంత రొఖ్ఖం బాంకీలో వుంది. ఆయనా, భార్య ఇద్దరే. సంతానం లేదన్న దిగులొక్కటి తప్ప వారికే చీకు, చింతా లేదు.

వాళ్లింట్లో కొంతభాగం అద్దెకిస్తుండే వాళ్లు. ఆ భాగం బ్రహ్మచారుల కివ్వను నే వాళ్లు. అది ఒక మాదిరి సంసారానికి సరిపోదు! అటువంటిది ఈ రామకృష్ణకి చక్కగా నచ్చింది. తనూ, భార్యా, పిల్లలు హాయిగా వుండొచ్చు - మరచి ప్రదేశం, తెలుగు పొరుగు కూడా అనుకొన్నాడు. కమలకీ నచ్చడాని కదే కారణం!

ఆ వృద్ధదంపతులకి సైతం వారింట్లో అంతమంది ఎక్కువగా అద్దెకు వుండక పోయినా, ఉండిపోయిన కొద్దిమందిలో ఈ రామకృష్ణ, కమల లంత ఇదిగా ఎవరూ ఆకర్షించలేదు.

'చిలకా గోరింకల్లాగు వుంటారు ఈ మొగుడూ పెళ్లామనీ - 'రత్నాలు, ముత్యాలు వాళ్ళ పిల్లలనీ ఆ వృద్ధదంపతుల కన్పించేది.

అనతి కాలంలోనే వాళ్ళ పేరు మరుపులో పడిపోయాయి. రామకృష్ణ వాళ్లని "బాబాయిగారూ, పిన్నిగారూ" అనే పిలిచేవాడు. కమలేమో "మామయ్యగారూ, అత్తయగారూ" అనేది.

అంతకాలం మిగిలివున్న ఒక్కలోటు కూడా ఈ యువదంపతుల వల్లనూ పిల్లల వల్లనూ

అంటూ ఆ వృద్ధులకి తీరిపోయింది. "అబ్బాయీ, అమ్మాయీ" అంటూ ఎంతో ఆప్యాయంగా చూచుకొంటూ వచ్చారు, వీళ్ళనే. పిల్లలు కూడా "తాతగారూ, మామ్మగారూ" అంటూ అలవాటైపోయారు. దానితో వారిదిక నవజీవనమైంది.

అలా ఏకధాటిగా రెండున్నర ఏళ్లు అక్కడ వున్నారు. అప్పటికి రామకృష్ణని బీచీ స్టేషన్నుండి రాయపురం స్టేషన్కి ట్రాన్స్ఫర్ చేశారు. బీచీలో పని చేస్తుండగా అతనికి 'క్వార్టర్స్ లేవు, బయట ఎక్కడైనా అద్దెకుండ'మన్నారు. రాయపురంలో పని వచ్చాక, అక్కడ క్వార్టర్స్ వున్నాయి కనుక, విధిగా అక్కడికేపోయి కాపుర ముండాలీ అన్నారు అధికారులు!

సాధారణంగా అంతా అద్దె కొంపలొదిలి క్వార్టర్స్కి పోవాలని ఆత్రపడతారు కాని, రామకృష్ణ దంపతులు ఈ వృద్ధ దంపతులను వదిలిపోయి ఆ మూల క్వార్టర్స్లో నివసించడానికెంతో బాధపడ్డారు కాని, ఉద్యోగ ధర్మం నిర్వర్తించక తప్పలేదు!

కలిగిన ఎడబాటుకు ఆ వృద్ధ దంపతులూ ఈ యువ దంపతులూ చాలా విచారించారు కాని, 'ఒకే ఊళ్లో వున్నాం ఇంకా ఏమిటి గాదా' అని తరువాత ఊరడిల్లారు. ఆ పైన పండుగల్లో, సెలవల్లో, వీళ్లు వారింటికి లేక వాళ్లు వీరింటికి పోయి ఒకటి రెండు నాళ్లుండి మరీ రావటం జరుగుతూ వుండేది.

ఇప్పుడు బాబాయి గారింటికిపోతే అన్ని విధాలా మంచిదని, ఆలోచించాడు రామకృష్ణ. వెంటనే కమలకి చెప్పి పిల్లల్ని ఆమెనూ తయారవమన్నాడు.

నాటి సాయంత్రం రామకృష్ణ, భార్యాబిడ్డల్ని వెంటేసుకొని అలా కసమ్స్‌హౌస్ వరకూ నడక సాగించాడు. ట్రైవ్ బాంక్ బస్ స్టాపింగ్ వద్ద ఆగకుండా ముందుకి నడుస్తున్న రామకృష్ణని చూచి "అదేమిటండీ, ఇక్కడ బస్సెక్కొద్దూ?" అంది కమల.

"కాదు, అలా హార్బర్ దగ్గరికి పోయి, అక్కడ ట్వంటీవన్. సి. ఎక్కుదాం—పదండి" అంటూ నడిచాడతను

రామకృష్ణ ఆశించినట్లే అక్కడ డబుల్ డెక్ బస్సు బయలుదేరడానికి సిద్ధంగా వుంది.

నడిపిస్తున్నాడని అంతవరకూ తండ్రి మీద అలిగిన పిల్లలు అది చూచి "భలే, భలే" అన్నారు. అందరూ బస్సు పై అంతస్తులో కూర్చున్నారు.

బస్సు పారిస్ కార్నర్ దాటేసరికి దీపాలు వెలిగాయి. రిపబ్లిక్ ఉత్సవ సందర్భం—డబుల్ డెక్ బస్సులో కూర్చున్న పిల్లలకి మరీ సంతోషం కలిగించింది

అందులో చిన్నమ్మాయికి మరింత ఎక్కువ సర్దాగా వుంది. తను ధరించిన వైట్ ఫ్రాక్, సిల్కు లంగా, తడిచి చూచుకొంటూ, ఉత్సవ కోలాహలాన్ని గమనిస్తూ ఆ పిల్ల గర్వపడసాగింది.

బస్సు అలా సెంట్రల్ దగ్గరకొచ్చి ఆగింది... సెంట్రల్ స్టేషన్, ఎస్. ఐ ఆర్. ఆఫీసూ రంగు రంగుల దీపాలతో, వైభవోపేతంగా ప్రకాశిస్తున్నాయి.

"అక్కా, అక్కా, అటుచూడవే—ఆ లైట్లు ఎలా తిరుగుతున్నయ్యో—భలే!" అన్నాడు చిట్టాడు. అప్పటికి గాని అవకాశం చిక్కనట్లుగా చిన్నమ్మాయి-"చూచావా మరి, మన పుట్టిం రోజంటే ఎంత ఇదిగా వుంటుందో! నీ పుట్టిం రోజూ వుంటుంది, అమావాస్యలాగ!" అని సగర్వంగా వెక్కిరించింది. ఇక వాడందుకొన్నాడు రాగాలాపన!

కమల కసురుకోవటం, రామకృష్ణ సముదాయించడం ముగియకముందే, మౌంట్ రోడ్డులో బస్సాగింది.

ఆ రాత్రి ఆ వృద్ధదంపతులు వీళ్ళందరితో కలిసి రిపబ్లిక్ ఉత్సవాలను ఎంతో ఉల్లాసముగా చూచి ఆనందించారు. పిల్లలకీ పరమానందంగా తోచిందారోజు. అప్పటికీ రామకృష్ణకి మనశ్శాంతి కలుగలేదు.

అతను వచ్చేముందు తివతో ఒక ప్యాకెట్టు తెచ్చాడు. అందులో ఉదయం తాను కొన్న గౌను, లంగా వున్నాయి. అది కమల చూచిందిగాని, దేనికి తెస్తున్నారని అడగలేక పోయింది. చూస్తూవుంది. ఆ ప్యాకెట్టుని - బాబాయిగారింటి ప్రక్కింటిలో అద్దెకుంటున్న బీదమిత్రుని పిల్లకి రాగానే రామకృష్ణ ఆదరంతో ఇవ్వడం చూచింది. అప్పుడు మాత్రం ఉండబట్టలేక చాటుగా "అదేమిటండీ?" అనడిగింది.

రామకృష్ణ వెటకారంతో కూడిన నవ్వు నవ్వాడు. "మరేం లేదులే, మనమైతే వాటిని ఇంట్లోనే ఉపయోగిస్తాము. వాళ్ళు బయట కూడా వాడుకోగలరు, అంగుకని ఇచ్చేశాను!" అన్నాడు.

మళ్ళీ ఆ విషయంలో కమల నోరెత్తలేదు. అప్పటికి రామకృష్ణ తృప్తి కలిగినట్లుగా ఈలపాట సన్నగా ప్రారంభించాడు....

"ఏం బాయనా, చాలరోజులకి తెచ్చావు అమ్మాయినీ, పిల్లల్నీ. మళ్ళీ రేపే ప్రయాణం అంటావా?" అనడిగింది అడ్డుతిగిలి పిన్నమ్మగారు.

"అహాహా! ఇలా తీసుకువస్తే వాళ్ళకి రిపబ్లిక్ ఉత్సవాలు చూపినటవుతుంది, మీకు వాళ్ళని చూపినట్లూ అవుతుందని తీసుకొచ్చాను" అని ఆగి, ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చాడు. "ఒకటో తారీఖుదాకా ఇక్కడే వుంచేస్తాను. ఇప్పుడెక్కడికిపోయి మాత్రమేం ప్రయోజనం? ఆ కుండలతో కుస్తీలు పట్టలేక బాధపడ్డమేగదా?" అని మందహాసంచేసి, "ఆ కుస్తీలైనా నిండు కుండలతోనైతే ఫర్వాలేదనుకోండి గాని ఖాళీ కుండలతో గదా! కొంపదీసి అవి కాస్తా పగిలిపోతే, కొత్తవాటిని తేవడానికి నేను చావాలి మళ్ళీను..."అన్నాడు.

కమలముఖం ఆ చీకటి వెలుగులో అంత స్పష్టంగా కన్పించలేదు, అయినా, తేరిపార చూడ్డానికతను సాహసించనూలేదు...

రామకృష్ణమాటలు విని పిన్నమ్మగారు నవ్వేశారు ఆమె ప్రక్కనే వున్న బాబాయిగారూ నవ్వుతూ అతని వీపుతట్టి చాల్లే ఇక "ఊరుకో! ఎవరన్నా విన్నా నవ్విపోతారు. మరీ అంతిమోటు సరసాలా? చూడు, అమ్మాయి ఎలా చూస్తూందో నిన్ను—మింగేస్తా నన్నట్టుంది!" అన్నారు......

భోజనాలయ్యాక కమల వీలు చూదుకొని ఒంటరిగా రామకృష్ణని కల్సుకొంది.

ఇందాక అతనన్న మాటల్లో అబద్దాలేవీ లేనిమాట నిజమే కాని, అవసరమైతే కడుపులో కాళ్ళు పెటుకొనైనా బ్రతుకుతాగు గాని ఇట్లా ఇతరులఎదుట చెప్పేసుకోవడమూ? ఛి...ఛీ! ఎంత అప్తులైతే మాత్రం ఇటువంటి సంగతులు సరసానికైనా చెప్పకో వచ్చా? ఈమధ్య మరీ ఇదైపోతున్నారు లెద్దూ-అని బాధపడూ వచ్చింద ఆబాధతోనే అతని ప్రవర్తన నుద్దేశ్యించి, "నాకెంత బాధగా వుందో, తెలుసా!" అంది గాద్గదికంగాను.

గంభీరంగా, నిలబడి యేదో యోచిస్తున్న రామకృష్ణకి ఆమె మాటల్లోని అంతరార్థం బోధపడలేదు. మొత్తానికి అతనాలో చిస్తున్నదీ ఇందాకటి విషయమే అయితే భార్యకీ అతనికీ ఇందులోనూ చాల వ్యత్యాసం కన్పిస్తుంది.

ఇందాక పిన్నమ్మగారితో తానన్న మాటలు సర్దాగా అన్నవి ఎంత మాత్రం కావు కాని, వారంతా కేవలం తాను హాస్యానికే అలాగన్నా ననుకొంటున్నట్లు కన్పిస్తున్నారు. అంతే, రేపుదయమే తను పెళ్ళాంపిల్లల్ని వెంట తీసుకొని స్వంత నివాసానికి చేరుకోవాలన్న మాట పిల్లని ఇంటికి తీసుకెళ్ళడానికే జేబుల్లో ఏమీ లేవే—ఇక తీసుకుపోయి ఈ నాలురోజులూ ఎట్లా గడిపేది? చూచేవాళ్ళకేం దక్కగానే కన్పిస్తారు తామంతాను 'వాళ్ళకేమమ్మా-చిలకాగోరింకల్లా, పిల్లాపీచుతో హాయిగా వుంటారు' అంటారు కూడాను. వాళ్ళ ఊహల్లో తను తెచ్చేది సంసారానికి సరిపోగా, ఇంకా పదో పరకో బాంకీలో వేసుకోవడానికి మిగులుందని! అవును మరి, తిండీబటల ఖర్చు లొక్కటేగా వాళ్ళందరికీకన్పించేది! కాని, పిలల చదువు సంధ్యలకీ, తమ కప్పుడప్పుడు వచ్చేఋండుల అవసరాలకీ-తరుచుగా భార్య పట్టుదలవల్ల తీరవేర్చాల్సి వచ్చే ఇటువంటి సంతుగపబ్బాలకీ ఎంతెంత అయిపోతుంటుందో తమకిప్ప డక్కడక్కడా చిల్లర మల్లరఅప్పులెన్ని వున్నయ్యో—ఇవన్నీ ఎవరికి తెలుస్తాయి? ఇలా తెలియవని, మరీ, తెగించి ఎలా చెప్పకొనేది? 'సభ్యత', 'అభిమానం' ఇంకా ఇట్లాటివి చావలేదుగా! అయితే మరి.

ఆ ఆలోచనలతో సతమతమైపోతూ మౌనంగానే వుండిపోయిన భర్తని, తిరిగి రెట్టించింది కమల "నాకెంత బాధగావుందో తెలుసా?" కాని, ఈసారికూడా "మీ ప్రవర్తన" అని వివరించి చెప్పలేకపోయింది—ఎంత అభిమానవతియైనా, అవతలి వ్యక్తి 'భర్త' అన్న గుర్తింపు వుంది కనుక.

ఈసారి తేరుకొని రామకృష్ణ ఆమెని దగరికి తీసుకొంటూ "నిజం, నాకూ చాల బాధగావుంది! నిజం చెప్పేకూడా నమ్మించలేకపోతున్నామే, ఇంకెట్లా బ్రతికేది?" అన్నాడు, తనలో తాననుకొంటున్నట్టుగాను...

మితిమించిన క్రోధంతో తలెత్తిచూచింది కమల.

రామకృష్ణ మాత్రం ఇంటికప్పకేసి చూస్తూ, మళ్ళీ ఏదో దీర్ఘాలోచన ఆరంభించి బరువుగా నిట్టూరుస్తున్నాడు.

భర్త సితికి చకితురాలై, అలానే చూస్తూ నిల్చుండిపోయిందామె ★



డి. డి. కాశ్యప్ నిర్మిత



ఏన "హలాకూ" చిత్రంలో మీనాకుమారి.



"భాగ్ తే రహో"లో బెంగాలీతార సుమిత్ర.

బొంబాయి సినిమా లేఖ

...ల, ఒక చిత్రం నిర్మించ నిశ్చ...చింది. ఈసారి ఈ చిత్రాన్ని ...ర్ లో నిర్మించి, విదేశాలకు కూడా ... ఆమె సంకల్పం. అయోధ్య 'వజీద్ అలీషా' జీవితం దీనికి ఇతి...ు. 'షా మీ ఔద్' అని నామ... జరిగింది. దీనికి ఎస్. కె ఓఝా ...ం నిర్వహిస్తారు. మధుబాల ప్రధాన ... నిర్వహిస్తుంది. ఆమె సోదరి కూడా ఇందులో పాల్గొంటుంది.

* *

...స్లోవాకియా చలనచిత్రోత్సవం ... విదేశాలలో భారతీయ చిత్రాలకు మంచి మార్కెట్ సంపాదించడానికి గట్టి ప్రయత్నం జరుగుతోంది. మన చిత్రాలను తీసుకోవడానికి అవకాశం ఇవ్వనే అమెరికా వైఖరికి విసుగెత్తిన భారతీయ నిర్మాతలు ఇపుడు, యూరప్, మధ్య ప్రాచ్యదేశాలలో ప్రదర్శన వసతులు సంపాదించడానికి శ్రద్ధగా ప్రయత్నాలు ప్రారంభించారు. దూరప్రాచ్యంలో కూడా ఈ అవకాశాలు సంపాదించుకోవడానికి కొందరు కృషి చేస్తున్నారు.


ప్రసిద్ధ దర్శకుడు శ్రీ జయంత్ దేశాయ్ ఈమధ్యనే జపాన్‌తో కలిసి ఒక చిత్రం నిర్మించడానికై ఆ దేశంలోని ఒక ప్రముఖ సంస్థతో ఒప్పందం వ్రాసుకున్నారు. ఇందులో భారతీయ నటీనటులు, జపానీయులూ కూడా పాల్గొంటారు. ఇరు దేశాలలోనూ చిత్రనిర్మాణం సాగుతుంది.

* * *

మీనాకుమారి భర్త కమల్ అమ్రోహీ ఒక టెక్నికలర్ చిత్రం నిర్మించబోతున్నారు. గత మాసం ఆయన, మీనాకుమారి దక్షిణ భారతంలో 22 రోజులు పర్యటించడం విదితమే. ఆ యాత్రలోనే, వారు ఈ చిత్రానికి స్క్రిప్టు కూడ తయారు చేసుకొన్నారు. దర్శకత్వం కూడా కమల్ అమ్రోహీయే నిర్వహిస్తారు.

* * *

ఫిలింస్తాన్ చిత్రనిర్మాణ వ్యవహర్త ఎస్. ముఖర్జీ మూడు మాసాలు యూరప్‌లో ఉండి మొన్ననే తిరిగి వచ్చారు. ఫిలింస్తాన్ సినిమాస్కోప్ చిత్రము "బాంబే ఫయిట్ 417" విదేశీ వ్యవహారాలు పురస్కరించుకొని అప్పుడే ఆయన లండన్



నందీశ్వర్స్ వారి "సౌభాగ్యవతి"లో సావిత్రి, రామారావు.



సమతావారి "అమరజీవి"లో ఇ. వి. సరోజ, పద్మిని.

★ బొంబాయి సినిమాలేఖ ★

విశ్లేషం జరిగింది. పరిమితా అస్వస్థులు కావడం అక్కడే ఆపరేషన్ జరగడం జరిగింది. అక్కడనుంచి స్విట్జర్లాండు వెళ్ళి విశ్రాంతి తీసుకొని వచ్చారు. ఇంతకీ అసలు, ఆ 'సినిమా స్కోప్' చిత్రం డబ్బింగ్, విడుదల వ్యవహారాల్లు ఏ స్థితిలో ఉన్నదీ ఆయన ఏమీ చెప్పలేదు.

* * *

ఫిలింసాన్ వారి గేవాకలర్ చిత్రం "దుర్గేశ నందిని"లో నళిని జయవంత్, బీనా రాయ్, అజిత్, ప్రదీప్‌కుమార్ ప్రభృతి అగ్రశ్రేణి నటీనటులు ఉన్నారు.

గురుదత్ కొత్తచిత్రాలు 'సి. ఐ. డి.', 'ప్యాస్' ల నిర్మాణం పూర్తి అయినట్లే. త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి "రోజులు మారాయి" చిత్రంలో పేరుప్రఖ్యాతులు గడించుకున్న నాట్యతార వహీదా రెహమాన్ ఈ రెండుచిత్రాలద్వారానూ ఉత్తర భారతంలోని ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నది. ఈ రెండుచిత్రాలకు ఓ. పి. నయ్యార్ కూర్చిన సంగీతం, చిత్రాలు విడుదలకాకుండానే ప్రజాదరణ సంపాదించుకుంటుంది.

* * *

దేవానంద్ స్వంతచిత్రం "ఫన్‌టూష్" హాస్యరస ప్రధానమైనదని తెలుస్తోంది. ఆ తే చిత్రంపొడుగునా పాటలు, నృత్యాలు పుష్కలంగా ఉన్నాయి. చేతన్ ఆనంద్ దీనికి దర్శకుడు. దేవానంద్, శీలారామాని ప్రధాన భూమికలు నిర్వహించారు. ఇందులో ఒక సన్నివేశంలో దేవానంద్ ఆరురకాల వేషాలు వేసుకున్నాడట.

* * *

షాలీమిస్త్రీ నిర్మించిన "తాజ్" చిత్రం ఈమధ్య విడుదలఅయింది. వైజయంతిమాల, ప్రదీప్‌కుమార్, నటించిన ఈ చిత్రానికి నందలాల్ జస్వంతలాల్ దర్శకుడు. బాక్సాఫీస్ విజయానికి కావలసిన హంగులతో భారీఎత్తున తయారైన ఈ చిత్రంలో, హేమంతకుమార్ సంగీతం విశేషాకర్షణ.

ఆర్. సి. తల్వార్ చిత్రం "మేమ్ సాహిబ్" హాస్యసన్నివేశాలతో, అహ్లాదకరంగా తయారైనా, కథ నడపడంలో, పాత్రలకు రూపురేఖలు దిద్దడంలోనూ దెబ్బతింది కొన్ని కొన్ని సన్నివేశాలు మహాపేలవంగా, తయారయ్యాయి మీనాకుమారి, షమ్మీకపూర్, కిశోర్‌కుమార్, కుంకుం ఇందులో నటించారు.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)



వాహినివారి "భాగ్యరేఖ"లో జమున.



మినర్వాపిక్చర్స్ నిర్మిస్తున్న "సారంగధర"లో రేలంగి.

1955 లో చలన చిత్రాలు, కళాకారులకూ చలనచిత్రాభిమానులసంఘం సన్మానాలు

1955 లో విడుదల అయిన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చలనచిత్రాలలో ఉత్తమ చిత్రాలనూ, ఉత్తమ నటనటులుగా ఎన్నిక చేసి సత్కరించడానికై మద్రాసు చలన చిత్రాభిమానులసంఘం సన్మానాలు చేస్తున్నారు. ఈ క్రిందివారితో పరీక్షాసంఘాలు ఏర్పాటు చేసినట్లు పై సంఘం కార్యదర్శి శ్రీ ఇ. శామ్యూల్ తెలియజేస్తున్నారు. మద్రాసు పోలీసుకమిషనర్ శ్రీ ఎస్. పార్థసారథి అయ్యంగార్ (అధ్యక్షుడు). తెలుగు ప్రతినిధులు శ్రీమతి జ్యోతి వెంకటాచలం, డా॥ ఎస్. పురుషోత్తం, శ్రీ ఎస్. రఘురావు, శ్రీ పి. మల్లికార్జునరావు. తమిళం, శ్రీమతి యు కృష్ణారావు, శ్రీయుతులు వి. వి. రామగురై, సి. ఆర్. పట్టాభిరామన్ పి. ఆర్. గోపాలకృష్ణన్. కన్నడ, మలయాళ చిత్రాలకు విడివిడిగా సంఘాలను నెలకొల్పారు.

ఈ సంవత్సరం ఈ రెండుభాషల చిత్రాలనుకూడా యీ చలన చిత్రాభిమానుల సంఘం గౌరవించ పూనుకోవడం ముదావహం. పరిశ్రమలో ప్రముఖులు కూడా ఇందుకు హర్షం వెలిబుచ్చారు.

ఈ నిర్ణాయక సంఘాలకు మా పత్రిక చిత్రాలు ఏ కేనిమిత్తం నెలకొన్న ఉపసంఘం క్రిందిచిత్రాలను సిఫార్సు చేశారు.

తెలుగు: అనార్కలి, అర్ధాంగి, బంగారు పాప, దొంగరాముడు, కన్యాశుల్కం, మిస్సమ్మ, రోజులుమారాయి, సంతోషం, వదినెగారి గాజులు.

తమిళంలో కావేరి, చెళ్ళపిళ్ళై, డా॥ సావిత్రి మొదలైన 15 చిత్రాలను ఎన్నిక చేశారు. మలయాళంలో నాలుగుచిత్రాలు, కన్నడంలో నాలుగు ఉన్నాయి.

మంచి చిత్రంలో చిన్న 'అపశ్రుతి'

రాజకమల్ కళామందిర్ వారి కొత్తచిత్రం "తూఫాన్ ఔర్ దియా"ను వెనిస్ చలన చిత్రోత్సవానికి పంపాలని భారతప్రభుత్వం నిర్ణయించినట్లు తెలియవచ్చింది.

ఆత్మవిశ్వాసంతో కష్టాల నెదుర్కొని గట్టెక్కిన ఒక అనాథ బాలుడి కథను, శ్రీ శాంతారాం కుమారుడు శ్రీ ప్రభాత్ కుమార్ ఇందులో చిత్రించారు.

కథలో ఈ కుర్రవాడు నిర్భాయించుకొచ్చిన కష్టాలు, సాధించిన ఫలితాలూ సామాన్యమైన వేమీ కావు. అయినా ఆవేశం మాటుగా కొట్టొచ్చినట్లు చెప్పలేననిపిస్తుందనో, కాకపోతే, అలవాటుకొద్దినో, సంప్రదాయం మానుకోవడం ఎందుకనో, ఇందులో కూడా ఒక పాత్రకి అంగవైకల్యం అమర్చిపెట్టారు రాజ్‌కమల్ చిత్రాలలో ఏదో ఒక పాత్రకి, మొదటినుంచి చివరవరకునో, లేదా ఇంటర్వెల్ వరకూనో, ఎక్కడో అక్కడ, ఏదో ఒక వైకల్యం - కనబడుతూ ఉంటుంది. ఇందులో కూడా అనాథ బాలుడి అక్కకు తాత్కాలికంగా అంధత్వం కలిగించారు. కథలో సహజత్వానికి ఇది దెబ్బఅనిపిస్తుంది. అనాథ బాలుడుగా సతీష్‌వ్యాస్, అతని



విక్రం ప్రొడక్షన్స్ వారి కొత్తచిత్రం "[illegible]" [illegible] మరుద్వతి పూజా కార్యక్రమం [illegible] 'కూట్' [illegible], మార్కండేయుడి భూమికను [illegible]. [illegible] ఉన్నవారు దర్శక, నిర్మాత శ్రీ బి. ఎస్. రంగా. "[illegible]" [illegible]

[illegible]త్రోత్సవం

జెకోస్లావాకియాలో ప్రసిద్ధికెక్కిన ఆరోగ్య, విశ్రాంతి కేంద్రం కార్లొవివారీ నగరంలో జరిగే అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో పాల్గొంటున్న భారతీయ చలన, చిత్ర పరిశ్రమ ప్రతినిధులు, ఈ రూపేణా యూరప్ దేశాలతో స్నేహ సంబంధాలు

అక్కడగా కొత్తనటి సందా ఇందులో చక్కగా నటించారు. ఝనక్ ఝనక్ పాయల్ బాజేలో మంగళ్ మహారాజ్ భూమికను ఉత్తమంగా నిర్వహించిన కేశవ రావ్ దాతే ఇందులో సన్యాసిగా నటించారు.

వసంతదేశాయ్ కూర్చిన సంగీతం ప్రశంసనీయంగా ఉంది. ★

ఇతోధికంగా పెంపొందించుకోగల మనే ఆశాభావంతో బయలుదేరి వెళ్లారు. యూరప్ దేశాలకూ మనకూ చలనచిత్ర రంగంలో ఇచ్చి పుచ్చుకోవటాలు తక్కువ. మనదేశం తప్పే విదేశీయ చిత్రాల్లో అమెరికాది అగ్రస్థానం; ఆ తరువాత బ్రిటన్. కాగే, ఆ దేశాలలో మన చిత్రాలకు వాణిజ్య స్థాయిలో ప్రదర్శనావకాశాలు లభ్యం కావటం లేదు.

మనదేశంలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం జరిగిన సందర్భంలోనూ, ఆ తరువాత అనేకానేక ఇటలీ ప్రభృతి దేశాల నుంచి వచ్చిన చిత్రాలు ఇక్కడి ప్రశంసలు అందుకున్నాయి. చలనచిత్ర నిర్మాణకళలో వారు ఏ దేశానికీ తీసిపోరని ఋజువు చేశాయి. ఇటుపై, పోను పోనూ ఆ దేశాల చిత్రాలు ఇక్కడ విరివిగా [illegible] [illegible] [illegible] [illegible] మార్కెట్ లభ్యం [illegible], అయినంతం భారీ ఎత్తున లోటేమీ వసూలు లభించకపోయినా, పెద్ద [illegible] ముటుకు లేవు. రష్యా దేశాలలో భారతీయ చిత్రాలు బహుళ జనాదరణ పొందటం [illegible]. రుమేనియా, హంగరీ, ఇతర తూర్పు యూరప్ దేశాలలో కూడా, భారతీయ చిత్రం విడుదల అవుతోందీ.అంటే, జనం [illegible] ఉత్సాహంతో [illegible] భారత ప్రభుత్వ సమాచారశాఖ దేశంలోని చలనచిత్ర పరిశ్రమ వారికి తెలియచేసింది. కాగే, పరిశ్రమ స్థాయిలో సంయుక్త నిర్మాణాలకు ఒప్పందాలు కూడా జరుగుతున్నాయి. వీటివల్ల ఈ రంగంలో వాణిజ్య సంబంధాలతో పాటు, పరస్పరం సద్భావం, మైత్రీ పెంపొందడానికి దోహదం జరుగుతుంది.

క్రమక్రమాభివృద్ధి పొందుతున్న భారత చలనచిత్రపరిశ్రమ, అంతర్జాతీయరంగంలో స్థానం సంపాదించు కోవలసిన అవసరం



రేవతీ ప్రొడక్షన్స్‌వారి "షత్రంజ్"లో అశోక్‌కుమార్.

జెక్ చలనచిత్రోత్సవం

కూడా ఏర్పడింది. ఈ దృష్ట్యా కూడా మన చిత్రాలకు ఇతర దేశాలలో మార్కెట్ సంపాదించడానికి కృషి జరగవలసి ఉంది. అందువల్లనే భారతీయ నిర్మాతలూ, దర్శకులూ, ఇప్పుడు యూరప్, పశ్చిమాసియా దేశాలలో మార్కెట్ సంపాదించడం పట్ల శ్రద్ధవహిస్తున్నారు.

జెకోస్లొవాకియా నవమ చలనచిత్రోత్సవంలో అనేక దేశాలవారు పాల్గొంటున్నారు. మన దేశం నుండి వెళ్ళే ప్రతినిధివర్గంలో శ్రీయుతులు బిమల్ రాయ్, దిలీప్ కుమార్, సుచిత్రా సేన్, దేవానంద్, చేతన్ ఆనంద్, శీలారామాని, షమ్మీకపూర్, ఖ్వాజా అహమద్ అబ్బాస్ ప్రభృతులున్నారు. ఉత్సవాలు జూలై 29న పూర్తి అయినా వీరిలో కొందరు వెంటనే తిరిగి రాకుండా, యూరప్ దేశాలలో పర్యటించి, సంగతి సందర్భాలు తెలుసుకుని రావాలనుకుంటున్నారు.

ఈ ఉత్సవంలో భారతదేశం ప్రదర్శించే చిత్రాలలో బిమల్ రాయ్ నిర్మించిన 'దేవదాస్', దేవకీబోస్ చిత్రం 'భాలో భాషా' (బెంగాలీ), భారత ప్రభుత్వ ఫిలింస్ డివిజన్ నిర్మించిన "లిటిల్ ఎంబాసెడర్స్" (చిట్టి రాయబారులు) అనే డాక్యుమెంటరీ, "భారతదేశంలో మార్షల్ బుల్గానిన్, నికితా కృశ్చేవ్‌ల పర్యటన" చిత్రం ఉన్నాయి ★

సాలుకు రెండువందలు…

"చార్ దోస్త్" (నలుగురు స్నేహితులు) పేరిట, శ్రీ బి. ఎన్. సర్కార్ దర్శకత్వాన ఒక పిల్లల చిత్రం తయారైంది. హాస్యనటుడు జేపిక్ దీనికి హిందీ ఆంగ్లభాషలలో, వ్యాఖ్యానం వ్రాసి, చదివారు. చిత్రం పూర్తి అయిన తరువాత నిర్మాణంలో పాల్గొన్నవారంతా మంచి చెడ్డా మాట్లాడుకుంటూ ఉండగా, దీనికి సినేరియో వ్రాసిన బినయ్ ఛటర్జీ, "మన దేశంలో తయారైన మొట్టమొదటి 'పిల్లల' చిత్రం ఇదేకదూ' అన్నారు.

"ఎవరు చెప్పారు మీకు! ఇదే మొదటి దేమీ కాదు. ఇటువంటివి మన దేశంలో సాలుకు రెండువందల పైచిలుకు తయారవుతున్నాయి" అన్నారు దర్శకుడు శ్రీ సర్కార్.

వాహినివారి "భాగ్యరేఖ"

వాహిని పేరట బొమ్మలూరి బ్రదర్స్ నిర్మిస్తున్న "భాగ్యరేఖ" చిత్రం శ్రీ బి. ఎన్. రెడ్డిగారి దర్శకత్వాన ముమ్మరంగా తయారవుతోంది. రామారావు, రేలంగి, సి. ఎస్. ఆర్., రమణారెడ్డి, అల్లు రామలింగయ్య, జానకి, జమున, సూర్యకాంతం మొదలగువారు పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి శ్రీ పాలగుమ్మి పద్మరాజు మాటలు, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి పాటలూ వ్రాశారు. సంగీత దర్శకుడు శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు. కెమేరా శ్రీ కొండారెడ్డి, కళ శ్రీ టి. వి. ఎస్. శర్మ.

* * *

ఎ. వి. ఎం. నిర్మిస్తున్న మరో హిందీ చిత్రం "చోరీ చోరీ." నర్గీస్, రాజ్ కపూర్‌లు నటిస్తున్న ఈ చిత్రం ఆగస్టులో విడుదల కావచ్చుననుకుంటున్నారు. ★

డిటెక్టివ్ సీరియల్

అరుణ వలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

26. క్లోరోఫారం సీసా

థాలియా డ్రమండ్ తన బసలో కూర్చుని ఉత్తరం వ్రాసుకుంటున్న సమయంలో మిలీ మాక్‌రాయ్ వచ్చింది. ఆమె ఆ సమయంలో తన్ను చూడడానికి వస్తుందని థాలియా ఊహించనేలేదు. మిలీ బాగా చిక్కిపోయి, అలసి ఉన్నట్లు ఉంది. ఆ స్థితిలో కూడా థాలియా నివసించే గృహాన్ని దాని చక్కదనాన్ని ఆమె మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

"రాజభవనంలాగే ఉంది నీ ఇలు! ఫప్ బార్నెట్ అంటె పాపం తెలివి తక్కువ వాడుగాని, నీకేం? నువ్వు బలే ఆరితేరిన దానివి!?" అన్నది మిలీమాక్‌రాయ్

"ఎలా ఉన్నాడు నీ ఫప్ బార్నెట్?" థాలియా అడిగింది.

మిలీకి కోపం వచ్చింది. "ఇదిగో, మిస్ డ్రమండ్! ఫప్‌ను గూర్చి చులకనగా మాట్లాడావంటే నే నూరుకోను. నువ్వు ఉండవలసిన చోట అతడున్నాడు. నువ్వు మాత్రం తక్కువ తిన్నావా? ఆ కేసుతో నీకు మాత్రం సంబంధం లేదూ?"

"ఎందుకంత కోపం? కూర్చో, కూర్చో. నిన్ను చూస్తుంటే మళ్ళీ పాత సంగతులన్నీ జ్ఞాపకం వస్తున్నాయి"

మిలీ ఏదో గొణుగుతూ కుర్చీలో ఆసీనురాలైంది "ఫప్ విషయంలో నిన్ను చూడడానికి వచ్చాను. అతనిమీద ఏదో హత్యానేరం మోపుతారని తెలిసింది. అతడు ఏపాపం ఎరగడని నీకు తెలుసు కదా?"

"నాకు తెలుసా? నాకెందుకు తెలియాలి?' థాలియా జవాబిచ్చింది "మర్నాడు దయం పత్రికలలో చదివేదాకా, అతడా రాత్రి మార్ల్ ఇంటిలో ఉన్నాడని నాకు తెలియదు. ఈ పత్రికలవాళ్ళకి ఇలాంటి రహస్యాలన్నీ ఎలా తెలుస్తాయో, చిత్రమే!"

పత్రికలవారి చాకచక్యాన్ని చర్చించడానికి కాదు మిలీ వచ్చింది. ఆమె తన ప్రియుడు ఫప్‌ను గూర్చి మాట్లాడడానికి వచ్చింది.

"నేను నీతో పోట్లాడదల్చుకోలేదు," అన్నది మాక్‌రాయ్.

థాలియా "చాలా సంతోషం. అయినా పోట్లాడవలసినంత తగాదా ఏముంది?" అంది.

"ఉండొచ్చు, లేకపోవచ్చు. నాకు కావలసిందదికాదు. ఫప్‌నుగూర్చి నువ్వేం చేయబోతున్నావు?" ఈ దరిద్రులందరూ నీకు తెలుసు. అసలు నువ్వు ఆ వెధవ యేల్ దగ్గర పని చేస్తున్నావు కూడాను. మార్ల్ ఇంటివద్ద పార్ చేత పోలీసు కాపలా పెట్టించింది యేల్. పార్‌కి ఆ మాత్రం తెలివితేటలు కూడానా? సరేగాని, యేల్ దగ్గర ఉద్యోగం బాగా ఉందా?" అని అడిగింది మిలీ

"నువ్వు చాలా హాస్యాస్పదంగా మాట్లాడుతున్నావు" థాలియా అసహ్యంతో అన్నది.

"నేను యేల్ దగిర పనిచేస్తున్న మాట నిజమే. అతని ఉత్తరాలు వ్రాసిపెట్టడం, డెస్కు సర్దిపెటడం మొదలయిన చిల్లర పనులు ఉద్యోగమే అయితే నేనుచేస్తున్నది ఉద్యోగమే. కాని నువ్వు ఏ దరిద్రుల్ని గూర్చి మాటాడుతున్నావో నాకు తెలియడం లేదు. ఇంతికీ నేను ఫప్ బార్నెట్‌కు ఏం చెయ్యగలను?"

ఇన్‌స్పెక్టర్ పార్ దగ్గిరికిపోయి చెప్పు. ఫప్ నిన్ను ప్రేమించాడని, నువ్వు మార్ల్ ఇంటిలోకి వెళ్లడం చూసి, నిన్ను అనుసరించాడనీ, మళ్లీ బయటికి రావడానికి వీలులేకపోయిందనీ..."

"నామాట ఎవరు నమ్ముతారు మాక్‌రాయ్! ఇదేం లాభంలేదు. ఇంతకంటె కాస్త గట్టి ఉపాయమేదన్నా ఆలోచించు. అయినా అతనిమీద హత్యానేరం మోపుతారనుకోను. డెరిక్ యేల్ అలాగని ఇవాళ ఉదయమే చెప్పాడు."

థాలియా లేచి చేతులు వెనక్కికట్టుకుని గదిలో అటూ ఇటూ పచారుచేస్తూ మళ్ళీ ఇలా అంది: "అదిగాక నీ ప్రియుణ్ణిగూర్చి నాకేం పట్టింది? అతని తరఫున నేనెందుకు మాట్లాడాలి?"

"ఎందుకో చెబుతాను," అని మిలీ లేచి నిలబడి నడుంమీద చేతులు పెట్టుకొని థాలియా వంక తీవ్రంగా చూసింది.

"ఎందుకంటే బ్రబజాన్ కేసు విచారణకు వచ్చినపుడు, నేను వెళ్ళి సాక్ష్యం చెబుతాను. నువ్వు బ్రబజాన్స్ బ్యాంకిలో పని చేస్తున్నప్పుడు నువ్వు చేసిన దొంగతనాలన్నీ చెప్పేస్తాను. తెలిసిందా? ఏం, కంగారు పడుతున్నావే? అప్పుడే భయం వేస్తోందా? హహ్హ!"

"బ్రబజాన్ కేసా? వాణ్ణి పట్టుకున్నారా?" అని థాలియా ఆశ్చర్యపడింది.

అరుణవలయం

"ఆ, పట్టుకున్నారు," అని ఆ విజయం తనదే అయినట్లు మాక్‌రాయ్ సమాధానమిచ్చింది. "పార్ పట్టుకున్నాడు. నేను పోలీసుస్టేషనుకు వెళ్లాను. ఫ్లష్ నాకోసం డబ్బేదో మిగిల్చివెళ్లాడంటే కనుక్కుందామని వెళ్లాను. సరిగ్గా అప్పుడే పోలీసులు బ్రబజాన్‌ను లోపలికి పట్టుకొస్తున్నారు."

"బ్రబజాన్‌ను పాపం ఖైదులో పెట్టారన్నమాట," అని నెమ్మదిగా అన్నది థాలియా.

సగం మూసినకళ్లతో మాక్‌రాయ్ ఆమె వంక చూస్తోంది. థాలియా అంటే ఆమెకేనాడూ ఇష్టం కలగలేదు. ఇప్పుడు ఆమెపై ఎందుకో పట్టరాని ద్వేషం కలిగింది. థాలియాలోని గాంభీర్యం వెనుక ఏదో నిగూఢరహస్యం ఉన్నట్లు తోచి ఆమెకు భీతికూడా జనించింది. థాలియా ఇంకా ఇలా అంది:

"నేను ఫ్లష్ బార్నెట్‌కు చెయ్యగలిగినదంతా చేస్తాను. నువ్వు నా మీద నేరాలు చెబుతావని భయంవల్లకాదు. పోలీసు కోర్టుకి వెళ్లేధైర్యం నీకు లేదని నాకు తెలుసు. కాని ఫ్లష్ బార్నెట్‌కు హత్యతో సంబంధం లేదని నాకు తెలుసు. కనుక అతనికి నేను సాయం చేస్తాను. రేపు ప్రొద్దున్నే యేల్‌తో మాట్లాడతాను. దాని వల్ల లాభం ఉంటుందనుకోను."

మిలీముఖం కొంచెం తేటపడింది. ఇల్లు బావుందని మళ్లీ మెచ్చుకోసాగింది.

థాలియా ఆమెకు ఒక్కొక్కగదే చూపిస్తోంది.

"ఇదేం గది?"

"వంటగది"అని థాలియా జవాబిచ్చింది గాని గది చూపించే ఉద్దేశంలో లేదు. ఇంతలో హఠాత్తుగా మిలీ తనంత తనే గదితలుపు తెరిచి లోపల ప్రవేశించింది.

వంటగది చిన్నది. ఖాళీగా ఉంది. ఎలక్ట్రిక్ లైటు వెలుగుతూనే ఉంది. తను వచ్చే ముందువరకూ థాలియా ఆ గదిలోనే ఏదో చేస్తూ ఉన్నట్లు మిలీ గ్రహించింది. లోపలికిపోయి ఒక మూలఉన్న ఒక సీసా తీసింది.

"ఏమిటిది?" అంటూ సీసాపై ఉన్న పేరు చదివింది. సీసాలో రంగులేని ద్రావకమేదో ఉంది. మూత తీయడానికామె ప్రయత్నించలేదు. "క్లోరోఫారమ్‌తో ఏం చేస్తున్నావు నువ్వు?" అని మిలీ ప్రశ్నించింది.

థాలియా ఒక్క క్షణం జంకిపోయినట్లు కనిపించింది. మళ్లీ తేరుకుని నవ్వింది. వెటకారంగా ఇలాగంది: "పాపం ఫ్లష్‌బార్నెట్ దుస్థితి తలుచుకున్నప్పుడల్లా నాకెంతో

బానకలుగుతోంది. అతన్ని మర్చిపోవడానికి ఇలాంటిదేదో ఉపయోగించడం మంచిదని దగ్గిర పెట్టుకున్నాను" మాక్ రాయ్‌కోపంతో సీసాను విసురుగా బల్లమీద పెట్టింది.

"థాలియా! నీకెప్పుడో తగినశాస్తి జరుగుతుందిలే," అని మాత్రం అనగలిగింది.

"పోనీ ఫస్ట్ కార్నెట్‌కు జరిగే దానికంటె ఎక్కువ శాస్తి జరగదుగా?"

మిస్ మలీమాక్ రాయ్ దీనికేం బదులు చెబుదామా అని ఆలోచించుకుంటూనే బయటికి వచ్చేసింది. ఇంతా చేస్తే థాలియా డైమండ్ తన కెవిధమైన సాయమూ చేస్తానని వాగ్దానం ఇవ్వనేలేదని అప్పుడామెకు గుర్తువచ్చింది.

27. ఇన్‌స్పెక్టర్ పార్ తల్లి

బ్రబజాన్ అరెస్టు సంగతి విని జాక్ బియర్డ్‌మోర్ సరాసరి పోలీసు ఠాణాకు పార్ కోసం వెళ్లాడు. పార్ అప్పుడే ఇంటికి వెళ్ళిపోయాడని తెలిసింది. పోలీసు గుమాస్తా ఒకడు "ముఖ్యమైన వ్యవహారమేమైనా మాట్లాడదలిస్తే ఇంటికివెళ్లి చూడండి. స్టాంఫర్డ్ అవెన్యూలో ఉంది ఆయన ఇలు."

ఆరుణవలయం కేసు విషయంలో తప్ప జాక్‌కు ఇన్‌స్పెక్టర్ పార్‌తో మాట్లాడవలసిన అవసరమేమీ లేదు. తెలుసుకోదగినంతా డెరిక్ యేల్ టెలిఫోన్ చేసి ఇదివరకే చెప్పాడు.

"ఈ అరెస్టుతో చాలా విషయాలు బయటపడతాయని పార్ అనుకుంటున్నాడు. ఊహు. నేను బ్రబజాన్‌ను ఇంకా చూడలేదు. రేపు ప్రొద్దున పార్‌తోపాటు వెళ్లి చూస్తాను," అని యేల్ చెప్పాడు. యేల్‌ను కూడా ఆవేళ కలుసుకోవటం పడలేదు. అతడు తనకేదో నాటకానికి ఆహ్వానం వచ్చిందని, వెళుతున్నానని చెప్పాడు. చేసేదిలేక జాక్ తన ఇంటికి బయలుదేరాడు. వ్యాయామం లేని శరీరానికి కొంత వ్యాయామం ఇచ్చినట్లవుతుందని, కారును పంపివేసి నడక సాగించాడు.' చీకటిగా ఉన్న పార్కులో నడుస్తున్నాడు. పార్ గృహ జీవితం ఎలా ఉంటుందీ అని ఆలోచన పోయింది. పార్ ఎప్పుడు తన కుటుంబాన్ని గూర్చి మాట్లాడలేదు. పోలీసు జీవితం తప్పిస్తే అతనికి మిగతా జీవితమేమీ లేనట్లే సంచరిస్తాడు.

స్టాంఫర్డ్ అవెన్యూ ఎక్కడుందా అని జాక్ ఆలోచించాడు. పార్కులో జనం ఎవరూ లేరు. ఆ నిశ్శబ్దంలో అతనికి హఠాత్తుగా వెనుకనుంచి అడుగుల చప్పుడు వినిపించింది. సాధారణంగా అతడు భయపడే రకం కాడు. తనవెనక అడుగుల చప్పుడు వినబడినంతమాత్రాన వెనక్కి తిరగవలసిన అవసరంకూడా లేదు. కాని ఆ సమయంలో నిర్జనంగా ఉన్న ప్రదేశంలో అడుగులసడి వినబడటం అతనికి ఆశ్చర్యంకలగచేసింది. జాక్ వేగం హెచ్చించి నడిచాడు.

అడుగుల చప్పుడు ఆగిపోయింది. వెనక్కి తిరిగిచూడగా, బాట ప్రక్కన పచ్చికలో ఎవరో నడుస్తున్నట్లు కనిపించింది. జాక్ ఆగాడు. ఆ మనిషి కూడా ఆగాడు. ఏం చెయ్యడమా అని యోజించాడు. ఎదుర్కొందామా అనుకున్నాడు. కాని అదేమంత మంచిపనిగా తోచలేదు. రాత్రివేళ పార్కులో నడవడానికందరికీ హక్కు ఉన్నది. ఒకమనిషి వెనకాల మరో మనిషి నడవడానికికూడా హక్కు ఉన్నది. తను కాదనడానికి వీలులేదు.

ఇంతలో ఎదురుగా కొంత దూరంలో బీటు పోలీసాతడు కనిపించాడు. అమ్మయ్య అనుకున్నాడు. మళ్లీ తిరిగి చూసే సరికి తన్ను వెంటాడుతున్న మనిషి మాయమైపోయాడు. వాడెవడో కాని పొట్టిగా ఉన్నాడు. ఎవరో బాలుడని మొదట్లో అనుకున్నాడు. బిచ్చగాడేమోనని మళ్ళీ ఇంకో ఊహవచ్చింది. వాడెవడైతేనేమి, పార్కులోంచి బయటపడి, విద్యుద్దీపాలతో ప్రకాశించే వీధిలోకి వచ్చేసరికి పెద్ద బరువు తొలగిపోయినటయింది.

పోలీసు దగిరికి వెళ్లి స్టాంఫర్డ్ అవెన్యూ ఎక్కడుందని అడిగాడు.

"అదిగో ఆకనిపించే బస్సునెక్కి వెళ్ళండి. లేకపోతే టాక్సీ ఎక్కండి. పదినిమిషాల్లో వెళ్లి వచ్చు."

టాక్సీని పిలుద్దామా వద్దా అని చాలాసేపు ఆలోచిస్తూ నిలబడ్డాడు. తన ఇంటికి అకారణంగా వచ్చినందుకు పార్ ఏమనుకుంటాడో. ఏదైతే అదవుతుందని మరి ఆలోచించకుండా టాక్సీని పిలిచి స్టాంఫర్డు అవెన్యూ చేరుకున్నాడు. పార్ ఇంటి ముందు దిగి మళ్లీ సందేహిస్తూ ఆగాడు.

పార్ స్వయంగా వచ్చి తలుపుతీశాడు. పార్ ముఖం మామూలుగా వున్నట్టే భావరహితంగా ఉన్నది. ఆశ్చర్య పడలేదు. విసుక్కోనూ లేదు.

"ఓ నువ్వా, బియర్డ్‌మోర్! నేనూ ఇప్పుడే వచ్చి భోంచేస్తున్నాను. నువ్వు భోజనంచేసి చాల సేపైందనుకుంటాను."

"సరే మీ భోజనం కానివ్వండి. బ్రబజాన్‌ను పట్టుకున్నారని తెలిసి, ఊరికే ఇటు వచ్చాను" అన్నాడు జాక్.

భోజనాల గదిలోకి జాక్‌ను తీసుకువెళుతూ హఠాత్తుగా పార్ ఆగాడు. ఎందుకాగాడో తెలియక జాక్ కంగారు పడ్డాడు.

"ఇప్పుడే వస్తాను, ఇక్కడే ఉండు."

పార్ ఆ విధంగా గాబరా పడటం జాక్ ఎన్నడూ చూడలేదు.

"మా ఇంట్లో మా మేనత్త ఒకావిడ ఉన్నది ఆమెతో నువ్వు వచ్చావని ముందుగా చెప్పాలి. కొత్తవాళ్లు మాఇంటికిలా రావటం ఎప్పుడూ లేదు. నాభార్య పోయిన తర్వాత నాగృహ వ్యవహారాలన్నీ మా మేనత్తే చూస్తోంది."

భోజనాల గదిలోకివెళ్లి తలుపులు మూసివేశాడు. జాక్ ఏం చెయ్యడానికీ తోచక నిలబడ్డాడు.

ఒకటి రెండు నిమిషాలు గడిచాయి. లోపలిగదిలో ఎవరో తొందరగా తిరుగుతున్నట్లు వినిపించింది. పార్ తలుపు తెరిచాడు.

"రా, లోపలికిరా" అని పార్ ఆహ్వానించాడు. "కూర్చో. నిన్నింతసేపూ నుంచో పెట్టినందుకు ఏమీ అనుకోకు."

ఆగది శుభ్రంగా, అందగా అలంకరించబడి ఉంది. ఇంకోలా ఉంటుందని ఎందుకనుకున్నానా అని జాక్ కించపడ్డాడు.

పార్ మేనత్త వృద్ధురాలు. కొంచెం పరధ్యానంగా ఉంటుంది. ఆమెను గూర్చి పార్ ఆందోళన పడుతున్నట్లు జాక్ గ్రహించాడు. ఆమె పనిమీద అటూఇటూ తిరుగుతున్నంతసేపూ పార్ ఆమెవైపే చూస్తున్నాడు. ఆమె ఏదో

అరుణావలయం

మాటాడ్డ బోయినప్పుడల్లా పార్ ఆమెకు అడ్డం వచ్చి తనే మాట్లాడేవాడు.

"ఇలు శుభ్రంగా లేనందుకు ఏమీ అను కోవద్దు మిస్టర్..."

"నా పేరు బియర్డ్ మోర్" అన్నాడు జాక్.

"ఆవిడకి జ్ఞాపకశక్తి తక్కువలే" అన్నాడు పార్.

"అమ్మిలాగా ఇల్లంతా శుభ్రంగా ఉంచడం నాకు చేతకాదు" అన్నది వృద్ధురాలు. ఆమె మాటకడ్డువస్తూ—పార్ "అవును మరి," అని ఏదో అని జాక్‌తో "కొంచెం పరధ్యానంలే" అన్నాడు. "సరే నువ్వు దేనికి వచ్చావన్నావు?"

"ఏం లేదు ఊరికే చూసి పోదామని వచ్చాను. అరుణావలయం ఎంత విచిత్రంగా ఉందంటే కొల్లగా పట్టుబడిన ప్రతివాడూ దాని యజమానేనని నాకనుమానం కలుగుతోంది. అసలు బ్రబజాన్ వల్ల ఏమన్నా తెలిసే సూచనలున్నాయా?" అని జాక్ అడిగాడు.

"ఏమో, నాకూ తెలియడంలేదు బహుశా అతనివల్ల చాలా విషయాలు తెలియవచ్చని నాకనిపిస్తోంది. ఖైదులో బ్రబజాన్ వద్ద కాపలాగా నాకు బాగా నమ్మకమున్నమనిషిని పెట్టాను. జైలర్‌నుకూడా ఏ పరిస్థితుల్లోనూ లోపలికి వెళ్లనివ్వవద్దని ఆజ్ఞాపించాను"

"సిబ్లీ అనేవాణ్ణి విషంపెట్టి ఖూనీచేసినట్టు జరుగుతుందనా?"

పార్ అవునన్నాడు. "కాని ఆ ఖూనీ అన్నిటిలోకీ చాలా చిత్రమైనదికదూ?"

పార్ గంభీరంగానే ఈ ప్రశ్న వేశాడు. కాని అతని కళ్ళల్లో ఎక్కడో ఒక హాసరేఖ ఉన్నట్లు జాక్ కనిపెట్టకపోలేదు.

"మీరు నవ్వుతున్నారు. కాని నా ఉద్దేశం అది నిజంగా చిత్రమైనదనే"

"అవును, అంతేకాదు సిబ్లీని విషంపెట్టి చంపిన ఉదంతం చాలా ముఖ్యమైనది. అరుణావలయాన్ని పట్టుకోవడంలో బ్రబజాన్ కంటే అదే ఎక్కువగా సహాయపడుతుందని నానమ్మకం."

"అసత్యమూనం హత్యలు, దొంగతనాలు ఇవే కదా నీకు? నా ప్రాణాలు తీసేస్తున్నావు. ఇదే అమ్మ అయితేనా" అని ఏదో అనబోతున్న వృద్ధురాలి మాటలకడ్డంవచ్చి,

"అవునవును అత్తా! పారబాటే. ఊరుకో" అని పార్ సమాధానపరిచాడు. ఆమె గదిలోంచి వెళ్ళిపోయింది. జాక్ బియర్డ్ మోర్ ఇక ఉండబట్టలేక పోయాడు.

"అమ్మ చాల గొప్ప దల్లే ఉందే?" అని చిరునవ్వు నవ్వాడు.

పార్ కూడా నవ్వాడు.

"అవును. చాలా గొప్పది. కాని ఇప్పుడామె మా దగ్గర ఉండడంలేదు"

"ఆమె మీ తల్లిగారేనా?" అని జాక్ అడిగాడు.

"కాదు. మా నాయనమ్మ" అని పార్ సమాధానమిచ్చాడు.

జాక్ నిర్ఘాంతపోయి ఇన్‌స్పెక్టర్ వంక చూస్తూ నిలబడిపోయాడు.

(ఇంకా ఉంది)

★ పథేర్ పాంచాలి ★

(-వ పేజీ తరువాయి)

ఆ యువతి ఉడకపెట్టిన బంగాళా దుంపలు ఒలుస్తోంది. అంతా ఏకంగానే వంట!

ప్రొద్దున ఏడున్నరకి వచ్చింది రైలు. అపూ రైలుని చూద్దామని చాలాసేప ట్నుంచి ప్లాట్‌ఫారంమీద ముందుకు వంగి నుంచుని ఉన్నాడు. వాళ్ళనాన్న "అలా ముందుకువంగి చూడకు, కొస్త వెనక్కి వచ్చి నుంచో" అన్నాడు. రైల్వేమనిషి కూడా ఒకడు 'జనాన్ని తప్పుకోండి' అని అంటున్నాడు.

ఎంతపెద్ద రైలు! ఎంతచప్పుడు! ఆముందున్నదే కాబోలు ఇంజనంటే. వాహ్!

హాబీబ్‌పూర్ పడుచు కూడా ముఖం మీది తెర తప్పించుకుని, స్టేషన్‌లోకి వస్తున్న రైలుకేసి చూస్తూనుంచుంది!

హడావిడిగా మాటలతో - వాటితో రైల్లో కెక్కారు జనం. లోపల కొయ్య బెంచీలు ఒకదానికొకటి ఎదురుగా వేసివున్నాయి. రైల్లో క్రింద సిమెంట్ చేసినట్లుంది. అంతా అద్భుతంగా ఓగదిలాగానే ఉంది. తలుపులూ, కిటికీలూఅవీ...ఇక్కడికివచ్చిఆగిన ఈ రైలు బండి - మళ్ళీ కదలి వెళుతుందని నమ్మకం కలగటంలేదు వాడికి. ఏమో, ఒకవేళ వెళ్ళ దేమో, ఎవరికి తెలుసు? 'ఏయ్ మీ రంతా దిగండి, మా రైలు ఇవాల్టికి వెళ్ళదంటా రేమో' వాళ్లు. చుట్టూ అడ్డంకట్టిన తీగలకివ తలగా గడ్డిమోపు ఎత్తుకునివున్న ఓ మనిషి, రైలు ఎప్పుడు వెళ్ళిపోతుందా అని చూస్తు న్నాడు. అతణ్ని చూడగానే 'అయ్యో పాపం' అని అతడిమీద జాలిపడాడు అపూ. ఇవాళ రైలు ఎక్కలేనివాడు ఎలా ఉండ గలడు అసలు? బండివాడు రైలుకేసి చూస్తూ కటకటాల కవతల నుంచున్నాడు :

రైలు కదలింది. అపూర్వం, అద్భుతం ఈ కదలటం! చూసూ చూస్తూ ఉండగానే, మాఝేర్‌పాడాస్టేషన్‌నీ, అక్కడి జవాన్ని, పాగాకు వేళ్లని, నోరు తెరుచుకుని చూస్తూ నిలబడ్డ బండిమనిషి హీరూని వెనకపడేసి, రైలు పొలిమేరలోకి వచ్చేసింది రైలు రోడ్డుకి అటూ యిటూ ఉన్న చెట్లు కిటి కీలు దాటి ఘ్రుఇన పరుగెత్తుతున్నా యి వెనక్కి. ఏం వేగం! ఏం వేగం! ఇదన్న మాట రైలంటే! ఉహ్: చేలన్నీ గిర్రున తిరిగి పోతున్నాయి. గుబురు గుబురుగా ఉన్న చెట్లని, గడ్డివాముల్ని, పేద రైతుల గుడి సెల్ని ఒకే రకంగా కన్పించేట్లు చేస్తూ పరు గెత్తుతోంది రైలు. క్రింద చక్రాల కిరకిర ధ్వనులు, ముందు ఇంజన్‌మోత సరేసరి!

మాఝేర్‌పాడాస్టేషన్ వెలుపలి సిగ్నల్ క్రమంగా కనుమరుగైపోతోంది...

చాలా రోజుల క్రితం ఒకనాడు!

తాను, అక్క తప్పిపోయిన దూడను వెతు క్కుంటూ, ఒగర్చుకుంటూ రైలు రోడ్డు చూద్దామని పరుగు పరుగున వచ్చారు ఆ రోజున!...ఇవాళ?

ఆపాథూ - దుర్గాపురాల రాతిరోడ్డుమీది చెట్లవరుస దూరదూరంగా పోతున్నచోట ఆకాశంక్రింద, ఆ ప్రక్కనే తమ ఊరు నుంచి వచ్చే వంకరదారి సోనాడాంగా మైదానంలో కలిసేచోట, ఊరు చివరి ఆ పెద్ద జామచెట్టుక్రింద వాళ్ళ అక్క ఇంత ముఖం చేసుకుని తమ రైలు బండిని చూస్తూ నుంచున్నట్లే ఉంది!

అక్కను ఎవరూ వెళ్లి తీసుకునిరాలేదు; అందరూ విడిచిపెట్టే వచ్చేశారు. అక్క చచ్చిపోయినా తామిద్దరూ కలసి ఆడుకునే వెదురు తోపులో, మామిడిచెట్ల నీడలో నిశ్చిందిపురంలోని కూలిపోయేట్లున్న కొంపలో - అక్క స్నేహ స్పర్శ తన కెప్పుడూ సోకుతున్నట్లే ఉండేది. కాని ఇవాళే అక్కతో శాశ్వతంగా తెగతెంపు లయి పోయాయి నిజానికి!

అక్కను ఇక ఎవరూ ప్రేమించటం లేదు, అమ్మ లేదు, ఎవరూ లేరు. అక్కను విడిచిపెట్టి వస్తున్నందుకు ఎవరికీ విచారమే కలగటంలేదు.

అపూ మనస్సు హఠాత్తుగా ఓ విచిత్ర మైన అనుభూతితో నిండిపోయింది. అది దుఃఖమూ కాదు, శోకమూ కాదు, విర హమూ కాదు, అదేమిటో వాడికి తెలియదు. ఒక్క క్షణంలో వాడిమనసుకి ఎన్నో కన్పిం చాయి-ఆదయ్యం ముసలిది. ఏటి ఒడ్డు... వాళ్ల ఇల్లు...రాణీదీ ఎన్నో సాయంత్రాలు ఎన్నో మధ్యాహ్నాలు...ఎన్నాళ్లో అకు కున్న ఎన్నెన్నో ఆటలు...పటూ...అక్క ముఖం...తీరని అక్క కోరికలు...ఎన్నో... అక్క ఇంకా రెప్పవాల్చకుండా తనకేసే చూస్తోంది.

మరుక్షణంలోనే వాడి మనసులోని అవ్యక్తభావ కన్నీళ్లలో వ్యక్తమవుతూ- నాకు నేనెవెళ్లటంలేదు అక్కా. నేను నిన్ను మరచిపోలేదు; బుద్ధి పూర్వకంగా విడిచిపెట్టి రావటంలేదు. వీళ్లు నన్ను లాక్కుని వెడుతున్నారు" అని చెపుతున్న ట్లుంది...

అపూ నిజంగా మరిచిపోలేదు.

తర్వాత జీవితంలో వినీలకుంతల సాగర మేఖల అయిన పృథివితో వాడికి ఘనిష్ట పరి చయం ఏర్పడింది. కాని వాడికి శరీరం ఝల్లుమన్నప్పుడు, సముద్ర యానంలో ఓడ డెక్ మీదినుంచి వినీలాకాశపు నూతన రూపం కంటపడుతున్నప్పుడు, ద్రాక్షా కుంజవేష్టితమైన ఏ నీల పర్వతసానువో- సముద్రంలో విలీనమవు తున్నట్లుండీ దిగంత ప్రాంతంనుంచి సుదూరంగా పోయిపోయి లీలగా కన్పిస్తున్నప్పుడు, దూరంనుంచి భాసా భాసంగా కన్పించే చెలియలికట్ట- ప్రతిభా శాలియైన స్వరకర్త, సృజించిన మధుర స్వరంలాగా మధురాలాపనను విన్పింప చేస్తున్నప్పుడు - అలాంటి సమ యాల్లో యెప్పుడూ వానకురుస్తున్న ఒక రాత్రివేళ, ఓపాతచీకటి కొంపలో రోగంతో మంచంలోపడిన ఓ పల్లెటూరి పేదపిల్ల 'అపూ! నయమయి లేచాక నాకొక రోజున ఎప్పుడైనా రైలు చూపిస్తావా?' అని అడ గటం వాడి మనస్సులో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

మాఝేర్‌పాడా స్టేషన్ డిస్టెంట్ సిగ్నల్ చూస్తూచూస్తూ ఉండగానే దాటి పోయి పోయి కనుచాటైపోయింది.

(ఇంకావుంది)

చక్కని తీర్పు

బాలా కాలం క్రిందట ఒక గ్రామంలో ముగ్గురు దొంగలు వుంటూండేవారు. ముగ్గురూ కూడా దొంగతనంలో ఆరితేరినవారే! ముగ్గురు దొంగలూ కూడా దొంగతనం కలిసి చేస్తూవుండేవారు. అదీ...సంవత్సరానికి ఒక్కమారే!- ముగ్గురూ కూడా ఒక అమావాస్య రాత్రి, బాగా డబ్బున్న వారిఇంట్లో దిగి, సంవత్సరానికి సరిపోయే సొమ్ము దోచుకొని వచ్చేసేవారు. అంతే! తిరిగి వాళ్లు మళ్లీ సంవత్సరమే దొంగతనంకు వెళ్లేవారు. అంతవరకూ హాయిగా తిని కూర్చునేవారు!

అలవాటు ప్రకారం ముగ్గురూ కూడా ఆ సంవత్సరం, ఆ వూరి రాజుగారి ఖజానా ఖాళీ చెయ్యడానికి నిశ్చయించుకున్నారు. ముందు వాళ్ళలో ఒకడు వెళ్లి ఖజానాకు దారి మొదలయిన విషయాలన్నీ తెలుసుకొని వచ్చాడు - ఆ రాత్రే ముగ్గురూ వెళ్లి ఖజానా దోచేశారు!

ఇంకేముంది!... ఈ విషయం రాజ్యంలో పాక్కిపోయింది. ఎవరి నోటమాసినా ఇదేమాట - "ఎవరో దొంగలు రాజుగారి ఖజానా దోచేశారుట!" అని. ఖజానా ఖాళీ అయితే యేమన్నా వుందా?...ఆ డబ్బుతో నే కదా - అన్ని సౌకర్యాలూ జరగాలి!

ఈ విషయమై రాజుగారు ఆలోచించి, అన్ని గ్రామాలకూ భటుల్ని పంపి, ప్రతీ యింటినీ సోదా చెయ్యవలసిందిగా ఆజ్ఞాపించారు.

పిళ్లా సుబ్బారావుశాస్త్రి

ఇది విని, ముగ్గురు దొంగలూ కూడా వారికి వంట చేసిపెట్టే అవ్వ యింట్లో, దొడ్లో పెద్ద గొయ్యితిసి, అందులో భద్రంగా ధనం దాచి. యధాప్రకారం మన్ను కప్పేశారు, తర్వాత దాని మీద, పైపైన మాత్రం ధనియాలు, పెసలు మొదలయినవి చల్లి, నీళ్లు చిమ్మేశారు మొక్కలు మొలిచేందుకు! అవ్వకు చెప్పి ముగ్గురూ కూడా... ఆ గ్రామం వదలి పారిపోయారు.

ముగ్గురూ వూరవతల ఒక పాడుబడ్డ దేవాలయంలో కూర్చున్నారు ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ. మాటల సందర్భంలో, ముగ్గురిలోనూ ఎక్కువభాగం ఎవరికి ధనం రావాలన్న సందేహం కలిగింది.

"నాకు ఎక్కువ రావాలి! ఎందువల్లనంటే- నేను ఖజానాతలుపు అతి నేర్పుతో తీసి, ఎంతో భద్రంగా ధనసంచులు బయటకు తీసుకు వచ్చాను. కాబట్టి నాకే ఎక్కువ భాగం రావాలి!" అన్నాడు మొదటి దొంగ.

"ఖజానా తలుపులు ఎంత నేర్పుగా తీయగలిగినా, స్థలం తెలియనప్పుడు యేం లాభం? ధనమున్న స్థలం ముందు తెలియాలి. ఆ ఖజానా వున్న స్థలం నేను కనుక్కున్నాను కాబట్టి, ధనంలో ఎక్కువభాగం నాకు రావాలి!" అన్నాడు రెండో దొంగ.

ఇది విని మూడో దొంగ అన్నాడు — "ఆపండి! న్యాయంగా అయితే, నాకు ఎక్కువభాగం రావాలి! నేను అతినేర్పు చూపించి నా బలం ఉపయోగించి 'ఖజానా' దగ్గరవున్న కావలివాళ్ళను, శబ్దం రాకుండా చంపేశాను. వారు చావకుండా ఉంటే—నువ్వు ఖజానా యెక్కడవున్నదో తెలుసుకున్నందువల్ల గాని, నీ నేర్పు ఉపయోగించి తాళాలుతియ్యడంవల్ల గాని యేమీ లాభం లేదు! వారు బ్రతికివుంటే వాళ్ళకు దొరికిపోయేవాళ్లంగూడా! కాబట్టి నాకు ఎక్కువ రావాలి!" అని. ఇక ముగ్గురూ 'నా'కంటే 'నాక'ని తగవులాడుకోసాగారు.

ఇంతలో రాజభటుల్లో ఒకడు - "అదిగో...దొంగలు! పట్టుకోండి!!" అని ఎలుగెత్తి అరిచాడు. ఇంకేముందీ, ముగ్గురూ కాళ్లకు బుద్ధి

చెప్పారు. వారిని రాజభటులు కొంబడించారు.

ఇద్దరు ఒకదారిని, ఒకడు మఱో దారిని పారిపోయారు. ఆ యిద్దరూ యెటో వెళ్ళిపోయారు. మూడో వాడు మాత్రం చీకటిపడే వేళకు, రొప్పుకుంటూ, అతి కష్టంమీద ప్రాణాలతో అవ్వ యింటికి వచ్చాడు.

"ఏం, నాయనా! ఇలా రొప్పు కుంటూ వచ్చావేం? వారిద్దరూ యేరీ?" అని అడిగింది అవ్వ.

"వాళ్లు అక్కడ వున్నారులే!" అన్నాడు ఆయాసంగా మూడో దొంగ— "ఎక్కడ?" అన్నాదామె. "తర్వాత చెబుతాను. ముందు అన్నం పెట్టు!" అన్నాడు దొంగ.

భోజనం అయినతర్వాత-"ఏమీ లేదు! ఆ రాజభటులు 'యిల్లు' కూడా తవ్వి మరీ, సోదాచేస్తున్నారట! అందువల్ల దీనికి మఱో రహస్యస్థలం వెతికాము. వారిద్దరూ కూడా అక్కడే వున్నారు. ఈ ధనం అక్కడ దాచేస్తే బ్రహ్మరుద్రుడికి కూడా యీ విషయం తెలీదు! నువ్వు త్వరగా ఆ ధనం యివ్వు! ఊఁ...పద...!! వాళ్ళు నాకోసం ఎదురుచూస్తూవుంటారు. లే-" అని తొందర చేశాడు మూడోవాడు. అవ్వ నిజమే ననుకున్నది.-ఆ ధనం అంతా మూటలో కట్టి యిచ్చి-"నాకెందుకో భయంగా వున్నది నాయనా!...మీరు యిచ్చేప్పుడు 'మేంముగ్గురం వస్తే కాని యివ్వకు' అని చెప్పారు! ఇప్పుడేమో ఒక్కడివీ వచ్చావాయె!" అని అన్నది.

"అదేమిటిఅవ్వా! ముగ్గురమూ అన్నదమ్ముల్లా ఎన్నో ఏళ్ళుగా మెలుగుతున్నాంకదా! ఆ మాత్రం నమ్మకం లేదా?" అన్నాడుదొంగ. తర్వాత ఆ ధనంమూటతో పారిపోయాడు దొంగ.

మూడురోజుల తర్వాత దొంగతనం గొడవ తగ్గింది. రాజభటులు కూడా వెళ్లిపోయారు. అప్పుడు మిగిలిన దొంగలిద్దరూ అవ్వదగ్గరకు వచ్చారు.

"మూడోవాణ్ణి, అక్కడ కావలి వుంచారా?" అని అడిగింది అవ్వ. ఇది విని వాళ్లు ఆశ్చర్యపోయారు.

"ధనం జాగ్రత్తగా వుందా?" అని అడిగింది తిరిగి. వారికి మరింత ఆశ్చర్యం వేసింది.

"ఏమిటలా చూస్తారు?-మాట్లాడరేం?"

"అసలు డబ్బు భద్రంగా వుంచావా?" అన్నాడు అవ్వతో అందులో ఒకడు.

"డబ్బా?...ఎక్కడిదీ?" అన్నదామె.

"బావుంది! భూమిలో పాతిపెట్టినది. ఏమయిందీ?" అని అడిగారు వాళ్లు.

"ఇచ్చేశానుగా!"

"ఎవరికిచ్చేశావూ!?"

"మూడోవాడు వచ్చేడు. మీరు తీసుకురమ్మనమన్నారని తీసుకువెళ్ళాడు." అన్నది అవ్వ. ఈ మాటలు విని 'గతుక్కు'మన్నారు.

"వాణ్ణి మేము పంపలేదే!" అన్నారు. అవ్వ వెలవెలబోయింది. జరిగిన విషయం అంతా చెప్పింది. అంతా విని వాళ్లు మూఁసుముఖులేశారు.

"ఐనా, నీకు దాచే ముందు చెప్పాము కదా! మాలో ఏవక్కరొచ్చినా యివ్వొద్దని!—ముగ్గురమూ రానిదే ఎందుకుయిచ్చావు?" అన్నాడు మొదటివాడు.

"ఇలా జరుగుతుందని నాకేం తెలుసూ? తెలీక యిచ్చేశాను." అన్నది అవ్వ.

"మంచిపని చేశావు!—తెలీక యిచ్చావో, తెలిసేయిచ్చావో... అదంతా మాకు అనవసరం. మా డబ్బు అంతా యెలా యిచ్చ

★ చక్కని తీర్పు ★

కుంటావో యిచ్చుకో...!"అన్నారు వాళ్ళు.

"నేనేమయినా పని చేస్తానా?... పనిచేసినా అంత డబ్బు ఎక్కణ్ణుంచి తీసుకు వస్తాను? — నా ముసలితనంలో వాడుకుందుకు దాచుకున్న ధనం యిచ్చేస్తాను. తీసుకోండి!" అన్నది అవ్వ బ్రతిమలాడుతూ.

"అబ్బే! అదేమీ వీల్లేదు. ఇచ్చావా సరేసరి, లేకుంటే న్యాయాధికారికి ఫిర్యాదు చేస్తాం!" అన్నాడు మొదటివాడు.

"న్యాయాధికారికిమనం'దొంగ'లం అని తెలియబరిస్తే" అన్నాడు రెండోవాడు.

"దాని మీదనే చెబుతాం! మనతోపాటు దాన్నీ...జైలులో పెడతారు." అన్నాడు మొదటివాడు. అవ్వ 'చెప్పవద్ద'ని కాళ్ళా, వేళ్ళా పడింది. ఏమీ లాభం లేకపోయింది.

వారిద్దరూ న్యాయాధికారి దగ్గరకు వెళ్ళి—"అయ్యా! మేము ముగ్గురం కలిసి, యీ అవ్వదగ్గర కొంత డబ్బు దాచుకున్నాము. ఆ డబ్బు మేము ముగ్గురం వస్తే కాని యివ్వవద్దని చెప్పాము. కాని యీ అవ్వమాత్రం మాలో ఒకడు రాగానే యిచ్చేసింది. ఈవిషయమై విచారించాలి!" అని మనవి చేసుకున్నారు.

"అవ్వా! ఇది నిజమేనా?" అని అడిగాడు న్యాయాధికారి—"నిజమే బాబూ! నాకు తెలీకయిచ్చేశాను. వాడు నన్ను మోసం చేసి తీసుకు వెళ్ళిపోయాడు. అందుకని, నా ఆస్తి కూడా .వీరికి యిచ్చేస్తానంటున్నాను. దానికి వీరు ఒప్పుకోవడం లేదు." అని దీనంగా చెప్పింది అవ్వ.

న్యాయాధికారి చాలాదూరం ఆలోచించాడు. "అవ్వదగ్గర మీరిచ్చినంత ధనం యెలావస్తుంది?— కాబట్టి ఆవిడ యిస్తానన్న ధనం తీసుకొనండి. ఆ మూడో వాణ్ణి వెతకడానికి ప్రయత్నించండి!" అన్నాడాయన.

"అదేమీ వీల్లేదు! మీరూ యిలా అంటే బావుండదు. మా ధనం అంతా మాకు రావాలి!" అని యిద్దరూ మొండికేశారు.

అప్పుడు న్యాయాధికారి యిలా తీర్పు చెప్పాడు—"ఈ విషయంలో అవ్వదే తప్పు...! వారు ముగ్గురూ రాకుండా, ఒకడు రాగానే డబ్బిచ్చేసింది! అందుకుగాను అవ్వే ఆ ధనాన్ని యిచ్చుకోవాలి!—" ఇంకా యేమో అనబోతూ వుండగా అవ్వ "ఏం న్యాయం బాబూ! మీరూ యిలా ముసిలిముండను అన్యాయం చేస్తారా?" అని దీనంగా చూసింది. దొంగలిద్దరి ముఖాలూ 'అంత' అయినయ్!

"వుండు! అప్పుడే అలాతొందర పడతావేం? పూర్తిగా చెప్పనివ్వు!- ఐతే యింకో విషయం! ఆ'ధనం' వారు చెప్పిన దాని ప్రకారం యీ ఇద్దరికీ కూడా యివ్వడానికి వీల్లేదు. న్యాయంగా-ఆ ముగ్గురూ వచ్చి ధనం అడిగ్గానే ముగ్గురికీ ఆ ధనం అవ్వ యిచ్చేయాలి!" అని న్యాయాధికారి అవ్వతో అన్నాడు

"అవ్వా! నువ్వు నీ ఆస్తి నేమీ వీరికి యివ్వ నక్కర లేదు. వీళ్లు మూడోవాణ్ణికూడా వెతికి తీసుకొని నీ దగ్గరకు వస్తారు. అప్పుడా మూడోవాణ్ణి ఆ 'ధనం' అడిగి తీసుకొని ముగ్గురుకూ యిచ్చేయ్! వెళ్లు!!"

ఆమాటలు విని అవ్వ "దండాలు ...బాబూ! దండాలు!!" అంటూ వెళ్ళిపోయింది.

తర్వాత న్యాయాధికారి వారిద్దర్నీ చూసి-"మీరు వెళ్లవచ్చు! ఆ మూడోవాణ్ణిగాని వెతికి తీసుకు వచ్చినట్టయితే, మీధనం దమ్మిడీ తక్కువ గాకుండా యిచ్చేస్తాను!" అన్నాడు. వాళ్లు "ఈయనేదో న్యాయం చేస్తాడని వస్తే, ఆ యిచ్చే డబ్బుకూడా యివ్వకుండా చేశాడే! వూరుకుంటే ఆడబ్బయినా వచ్చేది!" అనిగుణుస్తూ, తెల్లముఖాలేసుకు వెళ్లిపోయారు, మూడోవాణ్ణి వెతికేందుకు! మూడోవాడు అప్పటికీ యిప్పటికీ అంతే లేదు! ★



జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణం చేసే నౌకల కది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకాప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కౌన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళ వర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కౌన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు. భోజనం చేసి అందరూ హాయిగా నిద్రపోతారు. తిరిగి తమ కన్నప్రాణాలు రాలేదని అంతా మథనపడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతర్గామి అధికారి హెచ్చరిక వినిపిస్తుంది. కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బయటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. ప్రొఫెసర్ అరోనా నీమో గదిలో వింతలు విశేషాలు చూచి ఎంతో ఆశ్చర్యపోతాడు. కెప్టెన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి

15. ప్రత్యేకాహ్వానం

ఆ మరునాడు నేను చాలాసేపు నిద్రపోయాను. లేచి నా వాచి చూసుకుంటే 12 గంటలసేపు నిద్రపోయినట్టు తేలింది. యథాప్రకారంగా కౌన్సెలు నా యోగక్షేమాలడగడానికి వచ్చాడు. అతడు బయలుదేరేటప్పటికి నెడ్‌లాండ్ ఇంకా గదిలోనే పడుకుని హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

కౌన్సెల్ నాతో ఏదో చెప్తూనే పోతున్నాడు. మధ్య మధ్య నన్నేవేవో ప్రశ్నలడుగుతున్నాడు గాని నేను సమాధానాలేవీ చెప్పకుండా అతని నలాగే చెప్పుకుపోనిచ్చాను. మేము సాగరగర్భంలో కనిపించే అత్యద్భుత విషయాలు పరిశీలించే సమయంలో కెప్టెన్ నీమో అక్కడికి రాలేదు. దానికి నేనెంతో ఆశ్చర్యపోయాను. ఈవేళైనా నీమో వచ్చి మాతో

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

మాట్లాడకపోతాడా! అని అనుకున్నాను.

సముద్రంలో కొన్ని చేపలొక విధమైన సిల్కులాంటిపదార్థం తయారు చేస్తాయి. నేనావేళ ఆ సిల్కుతో తయారు చేసిన దుస్తులు ధరించాను. కౌన్సెలు నా దుస్తులు చూచి చాలా ఆశ్చర్యపోయాడు. అలాంటి సిల్కు మధ్యధరా సముద్రంలో ఎక్కువగా దొరుకుతూంటుంది. దానితో స్టాకింగులు మొదలైనవి తయారుచేస్తారు. ఆ సిల్కుతో తయారు చేసిన దుస్తులు వేసుకుంటే చాలా హాయిగా ఉంటుంది. నాటిలస్ జలాంతర్గామిలో పనిచేసే వారందరికీ పూర్తిగా అలాంటిదుస్తులే సప్లయి చెయ్యడానికి తగినంత సిల్కు దొరుకుతుంది.

తరవాత నేను నా గదిలోకి వెళ్లాను. అక్కడ ఎవరుకనిపించ లేదు.

ఆ రోజంతా మరి కెప్టెన్ నీమో దర్శనమే లభించ లేదు. మళ్ళీ అద్దాలు తెరుస్తారేమోనని అనుకొన్నానుగాని అది జరగ లేదు. బహుశః అస్తమానము అదేపనిగా చూస్తే బాగుండదని వాళ్లాఅద్దాలు తెరవ లేదేమో!

జలాంతర్గామి ఇంచుమించుగా 30 నిలువుల లోతున గంటకు 12 మైళ్ళ వేగంతో సాగిపోతూంది.

ఆ మర్నాడు కూడా అలాగే జరిగిపోయింది. ఎంతసేపు కనిపెట్టుకొని కూర్చున్నా మరి కెప్టెన్ నీమో దర్శనమే కాలేదు. ఆఖరికి జలాంతర్గామి నరంగులు కూడా ఎవరు కనిపించ లేదు.

ఆ రోజంతా నెడ్‌లాండ్ కౌన్సెలు లిద్దరు నాతోనే కాలక్షేపం చేశారు. కెప్టెన్ మా గదిలోకి రాకపోవడం వారికీ ఆశ్చర్యంగానే కనిపించింది. అతనికేమైనా గాని జబ్బు చేసిందా? లేక మా విషయంలో ఏదైనా కొత్త ఎత్తు ఎత్తాడా?

కౌన్సెల్ చెప్పినట్లు మేమీ ఓడలో ఏవిధమైన నిర్బంధము లేకుండా హాయిగా కాలక్షేపం చేసుకుపోతున్నాము.

హాయిగా విందు భోజనాలారగిస్తున్నాము. కెప్టెన్ నిమో అన్న మాట ప్రకారం మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా ఆదరిస్తున్నాడు. అందుచేత మాకు ప్రత్యేకంగా ఇబ్బందిగా ఉన్న దేదిలేదు.

నిజానికి నేనారోజునించే సముద్రంలో దొరికే కాగితంలాంటి పత్రాలమీద జరిగినవన్నీ ఎప్పటికప్పుడే రాసివెయ్యడం మొదలుపెట్టాను.

అంతలో చల్లని సముద్రపుగాలి వీచింది. ప్రాణం లేచివచ్చినట్లయింది. ప్రాణవాయువు సరఫరా కోసం ఓడ మళ్ళీ సముద్రంమీద తేలిందని అనుకున్నాను.

నేను మళ్ళీ మెట్లెక్కి నాటిలస్ టాపుమీదికి వెళ్లాను. అప్పటికి ఉదయం ఆరుగంటలయింది. ఆకాశం నిండా మబ్బులు కమ్ముకున్నాయి. సముద్రం అంతా బూడిద చల్లినట్లుంది. కాని ఎక్కడా ఒక చిరు తరంగమైనా చలించడం లేదు.

బహుశః కెప్టెన్ నీమో వస్తాడేమో అని ఎదురు తెన్నులు చూచాను. జలాంతర్గామి చుక్కాని తిప్పే ఆసామీస్వరూపం ఒక అద్దం బీరువాలో ప్రత్యక్షమైనది. తిరిగీ సముద్రపుగాలి చల్లగా వీచింది.

క్రమక్రమంగా సూర్యకిరణాలు మబ్బుల దొంతరలు చీల్చుకొని ఆకాశం అంతటా వ్యాపిస్తున్నాయి. మబ్బుదొంతరలుకూడా మంచు విడిపోయినట్లు విడిపోతున్నాయి.

ఆ ప్రశాంత ప్రాతఃకాల సౌందర్యం చూడగానే నా హృదయం ఆనంద తరంగాలలో ఉర్రూతలూగింది. అంతలో నే ఎవరో టాపుమీదికి వచ్చిన అలికిడి వినిపించింది. మొట్టమొదట నేను కెప్టెనే వచ్చాడని అనుకున్నాను. కాని ఆ వచ్చినవాడు కెప్టెన్ నిమో కాదు. అతని కింది అధికారి. అతని నింతకు పూర్వం నేనొకసారి చూచాను. అతగాడు నేనక్కడ నిలుచున్న విషయమే గమనించినట్లు కనబడలేదు. భూతద్దాలనహాయంతో సముద్రంఅంతా అతిజాగ్రత్తగా పరకాయించి చూస్తున్నాడు. తరవాత లోపలికి పోయే మెట్లదగ్గిరికి వచ్చి నాకు తెలియని భాషలో ఏదో అన్నాడు. ప్రతిరోజు ప్రొద్దున్నే లేచి అతడా మాటలే అంటూంటాడు. ఇది చాలా రోజులనించి జరుగుతూన్న వ్యవహారం. అతడుచ్చరించే

వాక్యం ఇది:

"నో ట్రస్ రెస్పెక్ లోర్న్ విర్ప్"

అంటే ఏమిటో నా కెంతగా తలబద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. ఆ వాక్యం అన్న తరవాత ఆ అధికారి మళ్ళీ జలాంతర్గామి లోపలికి వెళ్ళిపోయాడు దానినిబట్టి, ఓడ మళ్ళీ సముద్రగర్భంలో ప్రవేశింపగలదేమోనని అనుకొన్నాను. అందుచేత నేనుకూడా అతనితోబాటే జలాంతర్గామి లోపలికి వెళ్ళిపోయాను.

అలాగలాగ అయిదు రోజులు గడిచిపోయాయి. అంతేగాని మళ్ళీ కెప్టెన్ నీమో దర్శన భాగ్యం కలగలేదు. ప్రతిరోజు ఉదయమే లేచి జలాంతర్గామి టాపుమీదికి వెళ్ళిపోయేవాణ్ణి. అలాగే ఆ అధికారి అక్కడికి వచ్చి యథాప్రకారంగా ఆ వాక్యం అలాగే ఉచ్చరించేవాడు. అంతేగాని కెప్టెన్ నీమో దర్శనభాగ్యం లభించే జాడ లేవీ కనిపించలేదు ఆ పైన కొంతకాలం దాకా మరి కెప్టెన్ నీమోను చూడాలనే అనిపించలేదు.

ఆ నాడు నేను, నెడ్‌లాండు, కౌన్సెలు నా గదిలో కూర్చుని ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నాము.

అంతలో నా కెదురుగా ఉన్న బల్లమీద ఒక చీటీ కనిపించింది. అది ప్రత్యేకంగా నా కోసమే పంపించిన చీటీ. వెంటనే నేనది విప్పి చూచాను. ఉత్తరం అంతా జర్మన్ లిపిలో ఉన్నట్లు కనిపించింది అది ఇది :

"ప్రొఫెసర్ అరోనాకు—అయ్యా ! రేపుదయం క్రెస్పో ద్వీపంలో ఉన్న అడవిలో వేటాడ



★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

డానికి వెళ్లుతున్నాము. మీరు మీ అనుచరులు తప్పకుండా మాతో వస్తారని ఆశిస్తున్నాను."

"అమ్మయ్య! వేటన్నమాట!" అని ఎంతో ఉత్సాహంగా అరిచాడు నెడ్.

"అందులోను క్రెస్పో ద్వీపం అరణ్యాలలో!" అన్నాడు కౌన్సెల్.

"అయితే కెప్టెన్ ఎక్కడో అక్కడ దిగి జలాంతర్గామిలోనించి ఇవతలికి వస్తాడన్న మాట." అన్నాడు నెడ్ లాండ్. నేనా ఉత్తరం కేసి చూసి - "అవును అలాగే కనిపిస్తూంది." అన్నాను.

"అయితే మనమీ ఆహ్వానం తప్పకుండా అంగీకరించితీరాలి. దిగిన తరవాత ఆ తరవాత కార్యక్రమం సంగతి ఆలోచించుకోవచ్చును. అదీగాక ఆ అడివిలో తాజామాంసంకూడా రుచి చూడవచ్చును!" అన్నాడు నెడ్ లాండ్.

నేనా క్రెస్పోద్వీపం ఎక్కడ ఉన్నదో కనుక్కోవాలనే దృష్టితో మాపుకేసి చూశాను. ఆ ద్వీపం అక్కడికింకా 18 వందల మైళ్ల దూరంలో ఉంది. ప్రక్కనే నిలబడిన వారిద్దరికీ మాపులో ఆ ద్వీపం ఉండే చోటు చూపించాను.

"కెప్టెన్ నీమో జలాంతర్గామిలోనించి దిగడమే జరిగితే సామాన్యంగా ఎడారులవంటి ద్వీపాలకే పోతూంటాడు."

నెడ్ లాండ్ ఆ మాటవిని బుజాలెగరేశాడు. అంతేగాని నేనన్న దానికి సమాధానం చెప్పలేదు. తరవాత నెడ్ లాండ్ కౌన్సెలు లిద్దరు నా గదిలోనించి వెళ్లిపోయారు.

నేనా తరవాత భోజనంచేసి నిద్రపోయాగాని లోలోపల ఏదో మథనపడుతూనే ఉన్నాను.

ఆమరునాటి ఉదయం లేచి చూచేసరికి జలాంతర్గామి నడక పూర్తిగా ఆగిపోయినట్లు కనిపించింది. తొందరతొందరగా దుస్తులు వేసుకొని అందరు కూర్చునే గదిలోకి వెళ్లిపోయాను.

కెప్టెన్ నీమో అక్కడ నాకోసం నిరీక్షిస్తూ కూర్చున్నాడు. నేను వెళ్ళగానే అతడు లేచి నిలబడి, వెంటనే బయలుదేరి తనతో రావడానికి వీలుపడుతుందా అని సగౌరవంగా అడిగాడు.

"కెప్టెన్! మీరు, భూమితో మీకున్న సమస్త సంబంధాలు తెంచివేసుకొన్నారుగదా! అయినా క్రెస్పో ద్వీపంలో కొన్ని అడవులింకా మీ స్వాధీనంలోనే ఉన్నాయన్నమాట!" అన్నాను.

కెప్టెన్ నీమో దానికిలా గన్నాడు:

"ప్రొఫెసర్! మీరు పొరబడుతున్నారు. ఆ అడవులు భూమిమీది అడవులు కావు! సముద్రగర్భంలో ఉన్న అడవులు!"

"సముద్రగర్భంలో ఉన్న అడవులా?" ఎంతో ఆశ్చర్యపడుతూ అడిగాను.

"అవును! ప్రొఫెసర్!"

"ఇప్పుడు మీరు నన్నక్కడికి తీసుకుపోతున్నారన్నమాట!"

"అయితే మీ అరికాలు కూడా తడికాదు!"

"ఓహో! అయితే మనం వేటాడడ మెలాగ? తుపాకీతోనా?"

"అవును. తుపాకీతోనే!"

నేనా సమాధానంతో కెప్టెన్ నీమోకు పూర్తిగా మతిపోయిందనే అనుకొన్నాను. అయితే మాట్లాడకుండా అతని వెనకాలే వెళ్లాను. తరవాత భోజనాల గదిలో ప్రవేశించాము. అక్కడ అందరికీ ఫలహారాలు వడ్డించి ఉంచారు.

"ప్రొఫెసర్! మీరు కొంచెం ఫలహారాలారగించండి! మళ్లీ చాలా సేపటిదాకా మనకు ఫలహా

రాలు దొరకడం కష్టం! అవి తీసుకుంటూ కబుర్లు చెప్పుకుందాం." అన్నాడు కెప్టెన్.

నేను కూడా కొంచెం ఫలహారం ప్రారంభించాను. అవి, చిత్రచిత్రమైన చేపలతోను, సముద్రపు తీగల ఆకులతోను తయారు చేసిన ఫలహారాలు. తరవాత మేమిద్దరము చల్లని మంచినీళ్లు తాగాము. నేనొక విధమైన సముద్రపు లతల ఆకులతో తయారుచేసిన మద్యం కూడా సేవించాను. కెప్టెన్ నీమో కొంత సేపటిదాకా నోరు మెదపలేదు. తరవాత నెమ్మదిగా ప్రసంగం ప్రారంభించాడు:

"మొట్టమొదట మిమ్మల్ని సాగరగర్భపు అడవుల్లో వేటాడడానికి పిలిచినప్పుడు మీరు నేనొక పిచ్చివాణ్ణని అనుకొని ఉంటారు. వీల్పే గాలి సరఫరా జరుగుతూంటే మనిషి సముద్రగర్భంలో ఎంత సేపైనా ఉండవచ్చును. మాపనివాళ్లు ప్రత్యేకంగా సాగరగర్భంలో సంచరించడానికి వీలయిన దుస్తులు ధరించి, తలకొకవిధమైన కవచం తొడుక్కుంటారు. వారికి పైనించి గాలి సరఫరా చేస్తూంటారు. ఆ విధమైన ఏర్పాట్లతో మేము సాగరగర్భంలో ఉన్న అడవుల్లో ఏ యిబ్బందీ లేకుండా వేటాడుతూంటాము."

"అయితే మీకు నీటిలో మునిగి ఉండడానికి కావలసిన పరికరాలన్నీ అమారుగా ఉన్నాయన్న మాట!"

"ఓ! ఉన్నాయి. వాటి సహాయంతో మేము ఎంత లోతులోనైనా ఏవిధమైన ఇబ్బందీ లేకుండా హాయిగా గాలి పీల్చుకుంటాము. మేము తొడుక్కునే కవచాలలో కావలసినంత గాలి నింపుగుంటూ ఉంటాము."

"చాలా బాగానే ఉందిగాని మీరుపయోగించే గాలి కొంత సేపటికయిపోదా?

"అలాంటి ఆపత్తేమీ రాకుండా జలాంతర్గామిలోంచి కావలసినప్పుడల్లా పరిశుభ్రమైన గాలి పంపిస్తూంటారు."

"అయితే సరేగాని మీకు సముద్రంలోపల వెలుతురెలాగ వస్తుంది?"

బాలగేయం:

శుకుడు - రంభ

రచన: వజ్రపాణి

వేదవ్యాసుని కొమరుడు-
వేదవిదుడు - శుకమహర్షి!
శుకమనగా రామచిలుక,
శుకుని ముక్కు- చిలుక ముక్కు!

శ్రీ శుకునకు వైరాగ్యము
శైశవముననే కలిగెను!
అతడు సర్వమును త్యజించి
అడవి తపం బాచరించె!

అత డాహారము మానెను!
అతడు ముట్టడాయె జలము!
గాలియు పీల్చక సమాధి
లో, లీనుండాయె నతడు!

అతని యుగ్రతపము జూచి
శతమఖుడగు దేవేంద్రుడు
తన దేవేంద్రత్వము పో
వునని యహోభయము చెంది-

రంభను పిలిపించి, "పోయి,
డింభకుని తపము విఘ్నము
చేయు" మనుచు ఆనతిచ్చె,
"చిత్త" మనినదా అచ్చర!

తోడి అప్సరసలతోడ
కూడి, ఆమె,-శుకుడుగల అ
రణ్యములో, నాట్యపు నై
పుణ్యమును ప్రదర్శించెను!


ఆమె ఆట, ఆమె పాట
ఆ శుకర్షి ముందు వృథా
యైనవి! విధిలేక ఆమె
తర్కమునకు సిద్ధపడెను!

"నాయకుడా! వమ్మైనది
నీ యౌవన" మనెను రంభ!
"కాదు! భక్తితో తరించి
పోదు!" ననెను శుకమహర్షి!

"నా యందముచూచి, పెండ్లి
యాడు" మనిన దప్సరస!
"పై అందముకేమి? లోన
పాపపు దుర్గంధమె కద!"

—అని, శుకుడు వచించినంత
ఆమె చీర తనయుదరము!
అందు పునుగు, కస్తూరి సు
గంధములే కనుపించెను!

"ఇట్టి మంచి కడుపున నే
పుట్టలేదు! పాపాత్ముడ!
తల్లి!" అన శుకుడు; రంభ
తెల్లబోయి, వెడలిపోయె!



శాంతినికేతన బుద్ధుడు

ఫొటో: జె కె. ఎ. పి. స్వామి.

★ సాగరగర్భంలో సాహస యాత్ర ★

"దీనికోసం ప్రత్యేకంగా మే మొక విద్యుద్దీపికలాంటి దీపం తయారు చేసుకొన్నాము "

"సరేగాని మీరీ వేటలో ఎలాంటి తుపాకీ ఉపయోగిస్తారు?"

"మేము వాడేదొక విధమైన గాలితుపాకీ. లేకపోతే నేనిక్కడ తుపాకీమందు మొదలైన వెలాగ తయారు చెయ్యగలను?"

"అదీగాక, నీటి లోపల తుపాకీ కాల్పాలంటే ఎంతో ఒత్తిడికి తట్టుకోవాలికదా!" అన్నాను.

"నేను గాలికి పెద్ద ఒత్తిడి కలిగించి దానిమూలంగా నా తుపాకులు పేలుస్తూంటాను."

"అయితే ఆ గాలి సరఫరా తొందరగా తగ్గిపోతుందిగదా?" అని మళ్ళీ అడిగాను.

"నేను కావలిసినంత గాలిసప్లయి జరగడానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చేసుకొన్నాను అయితే మా వేటలో అంతగా తుపాకీగుళ్లు పేల్చవలిసిన అవసరమేమీ ఉండదు."

"ఏమయినా అలాంటి పరిస్థితుల్లో వేటాడడం నాకంత తేలికగా కనిపించడం లేదు."

"ఏమీ కష్టం లేదు! మా తుపాకీగుండు తగిలిన ప్రాణి మరి బతకడమనేది జరగదు."

"ఎందుచేత?"

"మేము తయారుచేసే తుపాకీ గుళ్లు సామాన్యమైనవికావు. అవి గాజుతో తయారుచేసి వాటిల్లో విద్యుచ్ఛక్తి నింపుతాము. అందుచేత అవి తగలగానే జంతువులు వెంటనే చచ్చిపోతాయి."

"మీరు చెప్పిన దానితో నా సందేహాలన్నీ తీరిపోయాయి! ఇంక తుపాకీ చేత్తోపట్టుకొని మీ రెక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను." అన్నాను.

పిమ్మట నేను నా అనుచరులతో సహా కెప్టెన్ వెనకాలే వెళ్లాను. తరవాత మేమంతా సముద్రగర్భంలో సంచరించడానికనుకూలమైన దుస్తులు వేసుకొన్నాము.

—ఇంకా ఉంది

అదృష్టజాతకుడు

1

స్పెయిన్ దేశములో గ్రానాడ్ అనే ప్రసిద్ధమైన పట్నముండేది. ఆ పట్నంలో జేమ్సు అనే పేద తాపీవాడొకడు నివసిస్తూ ఉండేవాడు. తన కుటుంబ పోషణార్థము ధనము కూడ సంపాదింపలేక పోయేవాడా పేద తాపీవాడు. బీదవాళ్లకే సంతానమన్నట్లు అతనిది కుచేల సంతానం.

ఒకనాటిరాత్రి ఎవరో తలుపు తట్టుట వలన జేమ్సు నిద్ర నుండి మేల్కొన్నాడు. అతడు తలుపు తీయగానే పొడవుగా ఉన్న ఆచార్యుని చూచాడు.

“నీవు ఉత్తముడవనీ, నమ్మదగినవాడవని వింటిని. ఈరాత్రి నీవు నాకొక పనిని చేసిపెట్టగలవా?” అని ప్రశ్నించాడు ఆచార్యుడు జేమ్సును.

“హృదయపూర్వకముగా చెబుతున్నాను. తప్పక చేస్తాను. కాని తగిన ధనము మాత్రమియ్యాలి.”

“కాని కళ్లకు గంతలుండాలి. ఇష్టమేనా?”

జేమ్సు కళ్ళకు గంతలు కట్టుకొనుటకు ఇష్టపడ్డాడు. అంచేత ఆచార్యుడు జేమ్సు కళ్లకు గంతలు కట్టి, అతనిని చాల సందుగొందుల గుండా తీసుకుపోయాడు. ఆఖరికి వాళ్లిద్దరూ ఒక యింటి ముందు ఆగారు. ఆచార్యుడు ఇంటి తలుపు తెరచి తాపీజేమ్సును లోనికి తీసుకుపోయాడు. అక్కడ ఆచార్యుడు గంతలు విప్పాడు. అది ఒక ఇల్లు చివరి భాగమని జేమ్సు తెలుసుకున్నాడు.

అక్కడ నీటితో నిండిన కొలను ఒకటి కనబడింది జేమ్సుకు. ఆచార్యుడు కొలను అడుగున గది నొకదానిని నిర్మించమని జేమ్సుతో చెప్పాడు. సామగ్రి అంతా సిద్ధం చేయబడింది. జేమ్సు రాత్రల్లా కష్టపడి పని చేశాడు. కాని పని పూర్తి కాలేదు. తెల్లవారగానే ఆచార్యుడు ఒక బంగారు నాణాన్ని జేమ్సుకిచ్చాడు. మళ్లా అతనికళ్లకు గంతలు కట్టి, యింటికి చేర్చాడు ఆచార్యుడు.

“నీ కిష్టమేనా మరల వచ్చి పని పూర్తిచెయ్యడానికి” అని అడిగాడు ఆచార్యుడు.

“తగినంత డబ్బు యిస్తే తప్పక చేస్తాను”

“మంచిది. రేపు రాత్రి మళ్లా పిలుస్తాను.”

మరునాడు రాత్రి తాపీవాడు గది నిర్మించడం పూర్తి చేశాడు. “ఇప్పుడు ఇక్కడ ఉన్న కొంత సామగ్రిని తీసుకొని రావడములో సహాయపడు” అని పలికాడు ఆచార్యుడు.

ఈ మాట విన్న వెంటనే జేమ్సు భయపడ్డాడు. కాని వెంటనే ఆచా ర్యునితో కలసి ఒక గదిలో వెళ్లాడు. అక్కడ శవాన్ని చూస్తా నేమో అనుకున్నాడు జేమ్సు. కా అక్కడ మూడు బరువైన కుండల్ని చూచాడు. అతి కష్టంమీద ఆచా ర్యుడు, జేమ్సు కలసి మూడ కుండల్ని కొలను క్రింద కొత్తగ కట్టబడిన గదిలో అమర్చారు. తర వాత గది మరల మూయబడింది మళ్లా జేమ్సు కళ్లకు గంతలు కట్టి వేరుదారిని నగరమధ్య భాగాని తీసుకుపోయాడు ఆచార్యుడు.

అతని చేతిలో రెండు బంగా నాణాలు ఉంచి “చర్చిగంట వి బడేవరకు ఇక్కడ ఉండు. అం లోగా కళ్లగంతలు విప్పావంటే నీ ముప్పు రాగలదు” అని జేమ్సుతో పలికి తనదారిని తానుపోయా ఆచార్యుడు.

చర్చిగంట వినబడేవరకు జేమ అక్కడే ఉండిపోయాడు. గంట వి బడగానే కళ్లగంతలు విప్పి తనయింటికి చేరుకున్నాడు జేమ్సు రెండు వారాలపాటు అతనికి బా గడిచింది. ఆచార్యుడు యిచ్చి బంగారునాణాలు అయిపోగా మళ్ళా మొదటిలాగే బీదరి ప్రారంభమైంది.

[illegible]

2

కొన్ని రోజులు గడిచాయి.

దొరగారు మీసాలు పెట్టుకుని తుపాకీ పట్టుకుని వేటకెళ్ళారు. ఓగంట తరవాత, ఓనౌకరు పరుగెత్తుకొచ్చాడు.

"అయ్యా ఇక్కడికి ఉత్తరంగా ఓమైలు దూరాన పులి అడుగుజాడలు కనబడ్డాయండి" అని విన్నవించాడు.

తపీమని లేచి నిలబడ్డారు దొరగారు. "రైతో, దక్షిణ దిక్కు ఎటోయ్?" అన్నారు గంభీరంగా.

★ అదృష్ట జాతకుడు ★

రోజు సాయంకాలము జేమ్సు తన యింటిముంగిట కూర్చుని ఉన్నాడు. అప్పుడు చాల యిండ్లకు అధికారి అయిన ధనికుడొకడు అచ్చటికి వచ్చి యిలా అన్నాడు. "నీవు చాల బీదవాడివని విన్నాను"

"అవునండీ" అన్నాడు జేమ్సు.

"అలాగైతే నాకు పాత ఇల్లు ఒకటి ఉంది. దానిలో నివసించడానికి ఎవరూ యిష్టపడరు. అది చాల పాత యిల్లు. పడిపోడానికి సిద్ధంగా ఉంది. దానిని బాగుచేయించాలంటే చాల డబ్బు ఖర్చవుతుంది."

జేమ్సు ఆ యింటికి వెళ్ళి చూచాడు. అందులో ఎవరూ లేనట్టుఉంది. చాల వసారాలు గడచిన తరవాత అతడు యింటి చివరి భాగానికి వచ్చాడు. అక్కడ అతని కొక కొలను కనబడింది. వెంటనే అతనికి పూర్వపు సంగతి జ్ఞాపకానికి వచ్చింది. ఆచార్యుడు తనను తీసుకొనివచ్చి ఈ యింటిలోనే రెండు రాత్రులు పని చేయించాడని తెలుసుకున్నాడు.

ధనికునివైపు తిరిగి "అయ్యా! ఈ యింటిలో ఇంతకు పూర్వమెవరుండేవారో చెప్పగలరా?" అని ప్రశ్నించాడు జేమ్సు.

ధనికుడీవిధంగా అన్నాడు. "ముసలివాడైన ఆచార్యుడొకాయన ఉండేవాడు. అతడు ధనవంతుడని అందరూ అనేవారు. బంధువులెవరూ లేకపోవడంచేత, తన ఆస్తి నంతటినీ చర్చికి వ్రాసేశాడని అంటూ ఉంటారు. అతడు అకస్మాత్తుగా చనిపోయాడు. క్రిష్టియను మతగురువులు కొందరు అతని ఆస్తిని లోబరచుకోవాలని చూచారు. ఇంటి నంతటినీ గాలించగా, వారికి కొన్ని వెండినాణాలు తప్ప మరేమీ దొరకలేదు. ఆముసలి ఆచార్యుడు అద్దె లేకుండా, ఉచితంగా ఈ యింట్లో ఉండేవాడు."

జేమ్సు ఇదంతా శ్రద్ధగా విన్నాడు. ధనికుడు కొంచెంసేపు ఆగి మళ్లా ఇలా ప్రారంభించాడు.

"రాత్రివేళ బంగారు నాణాల్ని లెక్కపెడుతున్నట్లుగా బాధతో మూలుగుతున్నట్లుగా, దయ్యాలు రకరకములైన ధ్వనులు చేస్తూ ఉంటాయని యిరుగుపొరుగులవాళ్లు అంటూ ఉంటారు. ఇది యదార్థమో, కల్పితమో తెలియదుగాని ఈ కథలవల్ల నా యింటికి చెడ్డపేరు వచ్చింది. దీనిలో ఎవరూ నివశించడానికి ఇష్టపడరు."

"ఎవరైనా అద్దెకు వచ్చేదాకానైనా నన్నీ యింట్లో ఉచితంగా ఉండనివ్వండి. నేనీ ఇల్లు పునర్నిర్మిస్తాను. నాకీ దయ్యాలు భూతాలవల్ల భయంలేదు" అన్నాడు జేమ్సు.

ధనికుడందుకు ఇష్టపడ్డాడు. అందుచేత జేమ్సు మర్నాడే సకుటుంబముగా ఆ యింట్లో ప్రవేశించాడు. క్రమక్రమంగా అతడా యింటిని అందంగా చేశాడు. వింత ధ్వనులు మరి వినబడలేదు. జేమ్సు కొలనును త్రవ్వించి, గదిలో ఉన్న మూడు కుండల్ని బయటకుతీసి చూచాడు. ఆశ్చర్యము! మూడు కుండలూ వెండి బంగారునాణాలతో నిండిఉన్నాయి. తాపీ జేమ్సు గొప్ప ధనవంతుడుగా మారిపోయాడు. ఆఖరికి గ్రానాడ్‌లోగల పెద్ద ధనవంతులలో ఒకడయ్యాడు. అతడు చాల ధనము చర్చికీ, బీదలకు యిచ్చి, భార్యాబిడ్డలతో సుఖముగా జీవించాడు. పేద తాపీవాడైన జేమ్సు ధనవంతుడుగా మారిపోయినందుకు అందరూ ఆశ్చర్యపడ్డారుగాని ఎవ్వరికీ యీ విషయం యిప్పటికి కూడా తెలీదు.

★

సరికి సరి

అదొక చిన్న పల్లె గ్రామం. అందులోమాత్రం ఏవో రెండు మూడు ఆఫీసు లున్నాయి. కోర్టు తగాదాలకని, వీటికని వాటికని ఆ గ్రామానికి చుట్టుప్రక్క లూళ్ల దగ్గరనుండి వస్తూ పోతూంటారు. మరి ఈవచ్చేపోయేవాళ్లకని భోజనా లెక్కడివి? కనికరించి ఓ యమ్మ కూళ్లు పెట్టేది. చక్కగ ఓకూర, ఓపచ్చడి, యింత ఆవకాయ, మజ్జిగ పోసి, మనిషి భోజనం 0-6-0 అని బోర్డు తగిలించింది. తిని పోయేవాళ్ళతోనే ఆ పూటకూళ్ళమ్మ పని తీరి పోయేది. బాగా ఆర్జించిందని అందరూ అనుకున్నారు. అనుకోవట మేమిటి? కనబడుతూనే ఉంది! పూర్వం తినేవాళ్లు ముందుకొచ్చి ఇంతమంది వస్తున్నాం అని కొంత అడ్వాన్సు యిచ్చేవారు. ఇప్పుడో? వచ్చి, తిని, డబ్బు యిచ్చేయటమే! ఇదంతా ఆ గ్రామంలోని రావయ్యమ్మ అనే పేదరాలుకు కొంచెం కన్ను కుట్టిందనే చెప్పాలి. పూట భోజనం 0-4-0 అని బోర్డు వ్రేలాడ కట్టింది. 0-2-0 తగ్గిందని అందరూ ఇక్కడ కొస్తారని ఆశ. కొంచెం తెలివితేటలుండేవాళ్ళు "ఇది 0-4-0 భోజనం. అది 0-6-0 భోజనం" అనుకుని అక్కడికే పోయేవారు. కొంచెం నిరుపేదల్లాంటివాళ్ళు మాత్రం వచ్చేవారు. ఆ వచ్చే వాళ్లని మహాచక్కగా ఆదరించేది. రాగానే వాళ్ళను కూర్చోపెట్టేది. ఎంతో దూరం నుండి నడిచి వచ్చారేమో, చెమటలు కక్కుకుంటూ "అస్సో - యిస్సో" అనుకునేవారు. ఆ సమయంలో విసనకర్రల సదుపాయం చేసేది. నడక ప్రయాసవలన గొంతు ఆర్చుకపోయేది. పాపం రాగానే కొంచెం మంచినీళ్లు అడిగి

పక్కి బాలకృష్ణారావు

త్రాగేవారు. ఆ సమయంలో రావయ్యమ్మ గంజిలో కాస్త నీళ్ళుపోసి, పలుచగా చేసి కొంత ఉప్పుకలిపి యిచ్చేది. ఆ గంజినీళ్ళు ఆ గొంతు ఆర్చుకపోయేవాళ్లకు ఎంతో సేద తీర్చేది. రావయ్యమ్మ ఆదరాభిమానాలకు వాళ్లెంతో పొంగిపోయేవారు. రావయ్యమ్మ ఆ పూటకూళ్ళమ్మకంటే చాల జాలి గుండె కలదనీ, డబ్బులేనివారిని కనికరించి రోజుకి ఒకరికో యిద్దరికో ఉత్తినే పుణ్యానికి అన్నం పెడుతుందని ఆ గ్రామం అంతా అనుకునేవారు. దాంతో రావయ్యమ్మ రోజులు మంచివయ్యాయి. రెండు చేతులా డబ్బు ఆర్జించటంతో కొంచెం దుర్బుద్ధి పుట్టింది. రోజూ గంజినీళ్లు ముందుగ యిచ్చేటప్పుడు వాళ్ళు "చాలమ్మా" అన్నా "మొహమాటపడకు నాయనా. శుభ్రంగా దాహం తీర్చుకో! పొయ్యిమీద కూర ఉంది. దిగ్గానే భోజనాలు పెడతా. చూడు నాయనా! వ్యాపారం దగ్గరా భోజనందగ్గరా మొహమాటపడకూడదు. మరి కొంచెం దాహం పుచ్చుకో!" అని మంచిమాటలాడి వాళ్ల చేత బలవంతాన త్రాగించేది. పాపం! అమాయకులు కడుపుగంజినీళ్లతో నింపుకునేవారు. తీరా భోజనాలకు కూర్చునేసరికల్లా యింకేంతింటారు? కడుపునిండా గంజినీళ్లేగా! ఏదో కాస్త ఎంగిలిపడి సంతృప్తిపడేవారు. మరి వీళ్ళంతా అట్టే మిగతా వాళ్ళలా తినలేకపోయేవారు. మరిదంతా కలిసి వచ్చేది. యిలాంటివాళ్ళకి 0-2-0కు పెట్టినా రావయ్యమ్మకు లాభం వచ్చేది. ఇలాగు అమాయకులనందరినీ మోసం చేసి భోజనం పెట్టేది. అందులోను పల్లెటూరి ప్రజల్లో చాలమంది అమాయకులేగా! అన్యాయంగా బాగా డబ్బు ఆర్జించింది.

ఈవిధంగా రోజులు గడుస్తూంటే వీరాజనే బాటసారి ఒకసారి

★ సరికి సరి ★

వచ్చాడు. మామూలుగ అందరి లాగునే అలసటగా ఉండటంచూచి "ఏం నాయనా! కొంచెం దాహం పుచ్చుకుంటావా!"అంది. "లేదమ్మా! భోజనమే చేస్తాను" అన్నాడు వీర్రాజు. "కొంచెం ఆలస్యం ఉంది నాయనా. పొయ్యిమీద కూరఉంది. దిగ్గానే పెడతాను" అంది. అమిత దాహంగా ఉంది వీర్రాజుకు. మరేం చేస్తాడు? కొంచెం గంజినీళ్లు పుచ్చుకున్నాడు. అతిదాహంగా ఉన్న వాళ్ళకు ఆ త్రాగేది కొంచెం ఉప్పగాఉంటే మరీ రుచిస్తుంది సంతృప్తిపడినట్లు ముఖం పెట్టగానే రావయ్యమ్మ మరింత పోసింది. ఆలాగే వీర్రాజుతో ఉన్న వాళ్లంతా త్రాగేరు. ఎవరెవరు ఎందుకు వచ్చారో ఏ ఊరో యిత్యాది ప్రశ్నలతో కాలయాపన చేసేవాళ్ళువారు. వీర్రాజు ప్రక్కవాడిని అడిగాడు "ఏమండీ! ఈ గంజినీళ్లకూడ డబ్బు పుచ్చుకుంటుందా?" అని. "అబ్బే!" అని తల అడ్డుగా తిప్పాడతను ఇంతలో భోజనాలకు రమ్మని కేకవచ్చింది. అందరూ వచ్చారు గాని వీర్రాజు రాలేదు. రావయ్యమ్మ వచ్చి రమ్మంది. "చూడమ్మా! నాకు తెలియకడుగుతాను. యిందాక పోసిన గంజికూడ డబ్బు పుచ్చుకుంటావా?" అన్నాడు.

"అదేమిటి నాయనా! అలా గడుగుతున్నావు. ఏదో దాహంకని యిచ్చాను కదా, దానికెందుకు? యిప్పుడెందుకది రా నాయనా" అంది. "అయితే మరి నాకు భోజనం పెట్టొద్దు; నీకు నేను 0-4-0 యివ్వావొద్దు, నా ఆకలితీరిపోయింది. నేపోతాను"అని లేవపోయాడు. రావయ్యమ్మ నీరైపోయింది. అప్పుడు భోజనాలకు వచ్చేవాళ్ళంతా గుమిగూడారు. "చూశారయ్యా! భోజనానికని వచ్చి, మరి చెయ్యనంటాడు. మరదంతా నేను నష్టపోవటమేనా! నువ్వు తినూ-మానూ, 0-4 0 యిచ్చివెళ్లు" అంది రావయమ్మ గట్టిగా. అప్పుడు వీర్రాజు ముందుకొచ్చి "చూశారయ్యా! ఆమె మోసం. రాగానే కడుపు నిండేట్లు గంజిపోసింది. యిప్పుడు ఏం తినగలం? ముందు గంజినీళ్లు బాగా త్రాగితే, యిక మనం తిన్న అన్నం తక్కువవుతుందని మోసంతో యిలా గంజినీళ్ళు బలవంతాన పోస్తూంది. మీలో ఎవరయినా చెప్పండి. మీరు పూర్తిగ భోజనం చేయగలరా? అంచేత 0-4-0 యివ్వటం శుద్ధ దండుగ. నిజంగా ఈ భోజనానికి 0-2-0 యివ్వాలి. యిప్పుడర్థమయ్యిందా, ఈమె ఎందుకు ముందుగ మంచిమాటలతో బలవంతాన గంజినీళ్లు త్రాగిస్తుందో?" అన్నాడు ఆవేశంగా. అంతా ఔనన్నారు. "0-2-0 అయితే భోజనం చేస్తాం. అప్పుడే మా కడుపంతా గంజితో నిండిపోయింది. యింకేం తింటాం. 0-2-0 అయితే సరే, లేకపోతేమేం తినం" అని అంతా వచ్చేశారు. రావయ్యమ్మ మోసం బయలుపడగానే బిక్కముఖం వేసింది. నీరసంగా "రండి" అంది ఒప్పుకున్నట్లు. లేకపోతే ఎలా? చేసిన వంటకం అంతా దండుగ. వృథా. అంతా భోజనంగా చేస్తూ వీర్రాజును మెచ్చుకున్నారు. రావయ్యమ్మను బాగా ఆడిపోశారు. దాంతో రావయ్యమ్మ దుర్బుద్ధి పోయింది అప్పటినుండి యథాప్రకారంగా వంటకం చేసేది గాని, గంజినీళ్లు అడిగినా యిచ్చేది కాదు. చూశారా! రావయ్యమ్మకు తగిన వీర్రాజు రాబట్టి గాని, లేకపోతే యింక అన్యాయార్జితం కూడబెట్టేదిగా! ★

అసమర్థుని ఆత్మకథ

(11-వ పేజీ తరువాయి)

ఆప్రిరీలో అమ్మని కేక వేసినప్పుడు, ఆమె కళ్లనీళ్లు పెట్టుకున్నప్పుడు, నాకంత బాధ అనిపించదు. ఆత్మ విమర్శ చేసుకునే ఆక్షణంలో అమ్మని తలుచుకున్నప్పుడు, నేనొక పశువు ననిపిస్తుంది నాకు అల్లా అనుకోవటమే అమ్మకి ఒక విధంగా క్షమాపణ చెప్పుకోవటం అనుకుంటా.

అమ్మ ఏవో సంబంధాలు వ్రాసి వస్తుంది. ఆమెని పంపించేటప్పుడు నాకు ఏ భావమూ వుండదు. సాయంత్రం ఏ పార్కులోనో కూర్చొని. ఆలోచిస్తా. నాకే నవ్వువస్తుంది. నా జీవితమెంత? నా జీతమెంత? ఒక వ్యక్తిని అదనంగా పోషించగల బాధ్యత వహించగల శక్తి నాకు వుందా? లోకంలో దారిద్ర్యంతో కుమిలిపోతున్న ఎంతమందిని చూడటం లేదు? నా సంపాదనా, నా పరిస్థితులు తెలుసుకునేటప్పటికి, నా జీవితం మీద నాకే రోత పుడుతుంది ఈ ఊబిలోకి అన్యాయంగా యింకొక వ్యక్తిని దించి, భావి జీవితాన్ని గురించి మధురమైన కలలు కనే ఆ వ్యక్తి జీవితానికి తీవ్రా ఘాతం కలిగించటం నాపట్ల రాక్షసత్వంగా కనిపిస్తుంది. మనస్సులో ఒక నిశ్చయానికి వస్తా. పెండ్లి సంబంధాలు చూచి వచ్చిన అమ్మకూ నాకూ యిదే సంభాషణ

చివరికి అమ్మ విసిగి 'నీ మనస్సుకి నిలకడ లేదు. నీకు జీవితంలో సుఖపడే విధం తెలియదు. ఒకరు చెపితే వినవు' అంటుంది నిస్సహాయంగా. అక్కడితో సంభాషణ తుంచేసి అక్కడి నుంచి లేచిపోతా.

నా యీ ఇరవై ఏళ్ళ జీవితం నుంచి నేపొందిన అనుభవం ఒక్కటే. నిరాశ. ఆశని కూడా క్రమమైన మార్గంలో, పరిమిత అవధుల్లో పెంచుకోవాలి. అల్లా కాని

"నే చెప్పలేదూ?"

గుండె జబ్బు ఉందన్న ఒక వ్యక్తిని వైద్యుడు పరీక్ష చేశాడు. "జబ్బేమీ లేదు. నిక్షేపం వంటి గుండె. 80 ఏళ్ల వరకూ ఢోకా లేకుండామీరు బ్రతుకుతారని ఢంకా మీద దెబ్బకొట్టి మరీ చెప్పగలను" అన్నాడు వైద్యుడు ధాటీగా.

"అయ్యో అలాగా అండీ. అయితే మరి నాకు 80 వెళ్లాయే. ఇప్పుడు సరిగ్గా 82 ఏళ్లు నాకు" అన్నాడు 'రోగి' కాస్త జంకుతో.

"ఇంకేం మరీ. నే చెప్పిందేమిటి? నా మాట రైటే నన్న మాట!" అన్నాడు వైద్యుడు సగర్వంగా.

నాడు జీవితంలో మిగిలేది నిరాశ మాత్రమే.

* * *

ఒకరోజు ఎవరో వచ్చారు ఆఫీసుకి. పాపం! ఆయన నాగురించి గొప్పగా విని వుంటాడు. 'నూరు అబద్ధాలాడి ఒక పెళ్ళి చేయమని' లోకంలో సామెత. కాని నా మనసు అసత్యానికీ, అధర్మానికి ఎప్పుడూ లొంగదసేది, నా అంతరాత్మకి తెలిసిన విషయమే. ఆమనిషిని అవతలికి తీసికెళ్లి ఉన్న పరిస్థితి యథాతథంగా చెప్పా. 'మంచిది' అంటూ ఆయన గొడుగు చంకన పెట్టుకుని తోక ఝాడించాడు. ఇట్లాటి సంబంధాలు నా చేతులలోనే రెండు మూడు పంపించా.

'ఇటా అయితే నీవు పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావురా?' అంది అమ్మ లోకంలో, నా పెళ్ళి అంటూ జరిగింతర్వాత ఇక ప్రళయంవచ్చినా ఇబ్బందిలేదు అమ్మకి.

ఎక్కడైనా దాంపత్య విమర్శలు జరిగినప్పుడు, అమ్మ చాలా బాధపడేది నన్ను గురించి. అమ్మ తన జీవితంలో చూడాలని వాంఛించేది నాసుఖం. అది నా వివాహంలో లభ్యమౌతుందని ఆమె సంపూర్ణ విశ్వాసం.

అమ్మ చూసినవి కాక నేను కూడా పెళ్ళి సంబంధాలు కొన్ని చూశా. దానికి కారణం కూడా నాలో ఉన్న ఒకరకమైన దౌర్బల్యమే. కాని ఏవీ నచ్చవు. నేను చూడడానికి వెళ్లిన ఏపిల్లలోనూ నాకు శాంత కనిపించదు. బహుశా నాకు పిల్ల అంటూ నచ్చటం ఈజన్మలో జరగదేమో!

నేను ఎన్నో ఆశలు పెట్టుకున్న శాంత నాదికాదని నాకు తెలుసు. కాని నేను ఏమీ చేయలేని నిస్సహాయుడిని. నేను ఎవరినీ సుఖపెట్టటానికీ, తృప్తిపరచటానికీ పుట్టలేదు. ఒకరిని తృప్తిపరచటానికోసం నేను ఆత్మవంచన చేసుకోలేను. జీవితం అమూల్యమనే అభిప్రాయం నాకు ఎప్పుడూ లేదు. అది తృణప్రాయం. అది అమూల్యమనుకున్న రోజున, ప్రస్తుతం నే ఉన్న వాతావరణంలో ఒక క్షణం బతకలేను.

ఒక్కొక్కప్పుడు నేననుకుంటా. ఇంతగా నేను తాదాత్మ్యం పొందినా, శాంతిని నేనెంతవరకూ అర్థం చేసుకోగలిగా? ఒక్కరోజైనా శాంత నా భావాలని అర్థం చేసుకోగలిగిందా? లేకపోతే నేనొక్కనాడైనా శాంతతో మనసు విప్పి మాట్లాడానా?

నేను శాంతకి నా మనసు విప్పి చెప్పకపోయినా, నామనసుని ఆమె పూర్తిగా చదువుకుందని నా విశ్వాసం. అట్లా అనుకోకపోతే నా ఆత్మకి తృప్తివుండదు. న్యాయానికి అంత తెలివితేటలుగల శాంతదగ్గర నేను నా సంగతి విప్పిచెప్పటం కేవలం గురువుగారి దగ్గర చేతులుకట్టుకుని పాఠం అప్పచెప్పటం లాగే ఉంటుంది.

అన్ని తెలివితేటలుగల శాంత ప్రవర్తన కూడా నాకు ఒక్కొక్కప్పుడు పెద్ద సమస్యఅయి కూర్చుంటుంది. నిజంగా శాంత నన్ను ప్రేమించిందా?...నన్ను ప్రేమిస్తే మరొకడ్ని ఎందుకు కట్టుకోవడానికి సిద్ధపడుతుంది?

ఎందుకు పడకూడదు? నేను యీరోజున ఒక దోవనపోయే పిల్లని పెండ్లి చేసుకుంటానంటే ఏమౌతుంది. నామీదే అన్ని ప్రాణాలూ పెట్టుకున్న అమ్మగతి ఎంతదుస్థితికి దిగజారుతుంది? అమ్మముఖంచూచి నేను ఆపనిఒక్కనాటికి చేయలేను. అట్లాగే శాంత కూడా వాళ్ళ నాన్నమాటకి ఎదురుచెప్పలేదని ఎందుకనుకోకూడదూ?

ఒక విధంగా పెద్దవాళ్ల గౌరవం నిలిపే శాంతపెళ్లి నాకు చాలా సంతోషమే. కాని, తనకు తానుగా శుభలేఖను స్వదస్తూరితో నాకు పంపించటానికి శాంత ఏమైనా బాధపడి వుంటుందా? అత్తయ్య మామూలుగా చెప్పటంలో ఏమీ ప్రత్యేకతలేదు.

కానీ...శాంత రాసిన శుభలేఖ శాంతిని, నాకు అందని ఏ లోకాల్లోకో తీసుకుపోయింది.

నిజంగా నాకు వివాహంవల్ల సుఖం దొరకటం అంటూ జరిగితే, అది శాంతతో వివాహంతోనే దొరుకుతుందని నా విశ్వాసం. అమ్మకి నా మనస్సులో దూరి చూసేశక్తిలేదు. ఒక వేళ చూచినా ఆమె ఏమీ చేయలేదు. అందువల్ల ఆమె ఆ ప్రయత్నం చేయకపోవటయే మంచిదనుకుంటా.

శాంత పెళ్ళికి అమ్మ వెళ్ళింది. నేను మాత్రం శెలవుదొరకలేదనే కారణం చూపించా అమ్మకి. తనచేత్తో శుభలేఖ రాయగల ధైర్యం శాంతకుంటే వుండవచ్చు కాని, శాంతని పెండ్లికూతురుగా పెండ్లి పందిట్లో చూసే ధైర్యం నాకు లేదు.

అత్తయ్య, శాంతా నేను పెళ్లికి రానందుకు అమ్మదగ్గర చాలా వాపోయారట. అసలు నేను రాకపోయిన విషయాన్ని గురించి వాళ్ళు ప్రదర్శించిన భావాలు

అసమర్థుని ఆత్మకథ

తెలుసుకోవాలని నే ప్రయత్నించలేదు.

* * *

కాలచక్రంలో ఐదు సంవత్సరాలు తిరిగాయి. ఈ మధ్యకాలంలో ప్రపంచంలో, మానవుల్లో, సంఘంలో, వ్యక్తుల్లో, మనసుల్లో, మమతల్లో అనేక మార్పులు కలిగాయి. కాని అమ్మకీ నాకూ మధ్య ఎట్టి మార్పూ కలుగలేదు.

అమ్మ నా సుఖంకోసం ప్రయత్నిస్తూనే వుంది.

నిన్న నేను విమర్శించుకుంటూ నే వున్నా—

శాంత యిప్పుడు ఇద్దరుబిడ్డల తల్లి.

నేను పాతికేళ్ళ బ్రహ్మచారిని. ★

వింబుల్డన్ టెన్నిస్

(5- పేజీ తరువాయి)

నుండి వచ్చిన మరో యువకుడు అక్తర్ అలీ. ఇతడు ఈ రంగానికి కొత్త. దక్షిణఇంగ్లాండ్ టూర్నమెంటులో గెలిచి వింబుల్డన్‌కు ప్రవేశార్హత సంపాదించుకువచ్చాడు. తొలి రౌండులో అక్తర్ అలీ, బ్రిటిష్ ఆటగాడు వి. జె. కేటన్‌తో వరుసగా మూడు సెట్లూ గెలుచుకున్నాడు. (6-4, 6-3, 12 10). రెండో ఘట్టంలో ఇతడి ప్రత్యర్థి సీడెడ్ ఆటగాడు (నెం 7) కర్ట్ నీల్సన్ (డెన్మార్క్). పదిహేడేళ్ళ అక్తర్ అలీ ఈ ఘట్టంలో డేనిష్ చాంపియన్ నీల్సన్‌ను, ఓడించలేకపోయినా, మొత్తానికి, ఒక సెట్ గెలుచుకోగలిగాడు. (10-8) మిగతా మూడు సెట్లూ నీల్సన్ 6-1, 6-2,6-1 తో గెలిచాడు.

పురుషుల సింగిల్స్ పోటీలలో క్వార్టర్ ఫైనల్ ఘట్టానికి వచ్చినది. ఒకే ఒక్క యూరపియన్. అతడు, స్వీడిష్ చాంపియన్ ష్మిట్. మిగతా వారిలో నలుగురు ఆస్ట్రేలియన్లు ముగ్గురు అమెరికన్లు. సెమీఫైనల్‌కు హోడ్, రోస్వాల్, అమెరికన్లు హామ్ రిచర్డ్‌సన్, విక్ సీక్సాస్ తేలారు. ఇందులో నెం 1 సీడ్ హోడ్ 6-4, 6-3, 6-4 తో రిచర్డ్‌సన్‌ని, ద్వితీయుడు కెన్ రోస్వాల్ 6-3, 3-6, 6.3, 6-3 7.5 తో విక్ సీక్సాస్‌ను ఓడించారు. అక్కడితో వింబుల్డన్ ఛాంపియన్‌షిప్ కోసం తొలిసారిగా హోడ్, రోస్వాల్‌లు పోటీకి నిలబడటం జరిగింది మొదటి సెట్ రోస్వాల్ 6 4 గేములతో గెలుచుకున్నాడు. ఆ తరువాత హోడ్ విజృంభించాడు. శక్తిసామర్థ్యాలు అమోఘమైన ప్రతిభ చూపించి వరుసగా మూడు సెట్లూ తద్వారా ఛాంపియన్‌షిప్ గౌరవం సంపాదించుకున్నాడు (6-2, 7-5, 6-4)

స్త్రీల సింగిల్స్ ఛాంపియన్‌షిప్ అమెరికన్ యువతి మిస్ షర్లీ ఫ్రై సాధించింది. 50 నిముషాలు జరిగిన పోటీలో ఈమె బ్రిటిష్ యువతి ఏంజెలా బకస్టన్‌ను రెండు సెట్లలో (6-3, 6-1) ఓడించింది. అమెరికా యీ చాంపియన్‌షిప్ 13 సార్లు సాధించింది. కాని, బ్రిటన్‌కు 1931 తరువాత నేటివరకూ, నేడూ కూడా లభ్యంకాలేదు. ఆనాటి చాంపియన్ డరోతీ రౌండ్ ఈపోటీకి పత్రికా విలేఖరిగా హాజరయినది.

పురుషుల డబుల్స్‌లో ఛాంపియన్‌షిప్ ఆస్ట్రేలియాకే లభించింది హోడ్ రోస్వాల్‌ల జంట 7-5, 6-2, 6-1 తో ఇటాలియన్ జంట సిరోలా, పీట్రాంజెలీలను ఫైనల్‌లో ఓడించారు. కృష్ణన్, నరేష్ కుమారులు ఈ పోటీలలో మూడవ ఘట్టం వరకు వచ్చారు. అందులో అమెరికన్ జంట రిచర్డ్‌సన్, విక్ సీక్సాస్‌లు 5-7 6-3, 2-6, 6-2, 6-4 తో గెలిచారు.

స్త్రీల డబుల్స్‌లో ఏంజెలాబక్‌స్టన్ (బ్రిటన్) ఆల్తియాగిబ్సన్ (అమెరికా) కలసి ఆస్ట్రేలియన్ జంట ఫ్రైముల్లర్, సీనీలపై గెలుపొందారు (6-1, 8-6)

మిక్స్‌డ్ డబుల్స్‌లో సీక్సాస్, మిస్ ఫ్రైలు 2-6, 6-2, 7-5 తో జి. ములాయ్, మిస్. గిబ్సన్‌లపై గెలుపొందారు. ★

కొత్తరస్తా

(12-వ పేజీ తరువాయి)

నల్లటి చీకటి తప్ప వేరేరంగు ప్రాకే యొత్తు కించిత్తూ లేదు. ఆ చెట్టుక్రింద ఒక యెత్తుప్రదేశం చూచుక అలా కూర్చున్నాను, యాదాలాపంగా చుట్టుపట్ల నిశ్శబ్దంలో నా నిశ్శబ్దాన్ని లయం గావిస్తూ.

అంతలో ఒక శబ్దం వినిపించింది. అది ఒక నల్లని గునపంపోటు. ఆ చెట్టుయొక్క వేలుమీద ఒక నల్లని మగమనిషి వేస్తూ వున్నట్టయింది చీకట్లో నా చూపుకు. పైని పువ్వుకూడా అసలు ఎర్రదైనా చీకట్లో నల్లగా వుంది ఎర్రదనం చీకట్లో నలని మయంగా మారుతుంది కాబోలు - రెండో దెబ్బకు నామీద ఒక పువ్వు పడింది. అప్పుడు విశేషంగా చకితుడనై పరకాయించి చూచాను ఆ పువ్వును...అది ఎర్రని తురాయి పువ్వు. ఆ చెట్టునుండి రక్తపుచుక్కలా అది రాలి పడింది. అది రాలడానికి కారణం ఆఘాతమే లేకుంటే వసంతంలో పూచిన తురాయి పువ్వు అంత చులాగ్గా పడదు.

"ఏమిరా? చెట్టును పడగొడుతున్నావు?" అని అడిగాను పువ్వును ఇంకా పైకి ఎత్తుతూ.

వాడు "ఈ చెట్టు ఎందుకండి ఇక్కడ మనుష్యులు లేనప్పుడు?" అని అడిగాడు. "నేను మనిషిని కానా?" అని అన్నాను. "మీరూ మనుష్యులే? చీకటి మనిషి!" అని ఎత్తిపొడిచాడు వాడు. ఎత్తిపొడుస్తూ "లెగండి! అది ఇలా వస్తుంది." అని అన్నాడు. 'ఎవరా!' అని ఆ ప్రక్కకు చూచాను కొంచెం తొలగుతూ!

అదొక నల్లని ఆడరూపం! వాని పెళ్ళాం కాబోలు! కాకుంటే 'అది' అని అనివుండడు. ఏదో పేరే వ్యవహరించి యుండును. ఆమె యొక్క అసంస్కారపు తలకట్టుమీద ఒక చిన్న తట్టనెత్తుకుని వస్తూ, ఆ తట్ట వానిముందు దించుకుని "కనిపోయి రాళ్లు తట్టలోకి ఎత్తగలిగాను ఇంత సేపూ! నీవు ఎంత వేటు కొట్టగలిగావు? అని అడిగింది. వాడు దానికి జవాబుగా "ఈయన అడ్డొచ్చాడు. లేకుంటే ఈ పాటికి చెట్టు పడి యుండును" అన్నాడు అంటూ మరో దెబ్బ వేశాడు ఆ చెట్టు మొదట్న. చెట్టు జలజలలాడుతూ మరో రెండు పువ్వులు రాల్చింది ఆ రెండు పువ్వులూ తాను ఏరుకొని ఆ యువతి, తన రెండు చెవుల రెండు కమ్మల్లోను పెట్టుక మురిసిపోతూ "మరో దెబ్బెయ్యరా!" అంది.

నేను తప్పుకున్నాను కాని ఆ మూడో దెబ్బకు చెట్టు చెట్టుకూలి ఎన్నో పువ్వులు విరజిమ్ముతూ పడింది ఆ యిరువురి మీద. "బాబోయి!" అన్నారు ఇరువురూ కూడా ఒక ఎలుగున వాళ్ళమీద చెట్టూ చెట్టూ పడిందనుకొని ఏమ్రా? ఏం జరిగింది?" అని అడిగాను. ఆ యిరువుర్నీ చీకట్లో రూపం పోల్చలేక పోయాను కాని గొంతుక లిద్దతీని ఏకమైనట్లు పోల్చాను. వాళ్లిద్దరూ "మాకేం జరుగలేదు. మామీద పువ్వులే పడ్డాయి. మీకేమైనాఅపాయం వాటిల్లిందేమో గాని?" అని అనుకుంటూ బుజాన్ని గునపమేసుకు వాడు, తట నెత్తి నేట్టుకు అదీ వెళ్లిపోయా.

—ఇక చీకటి ఒకటే మిగిలింది. చీకట్లో నేనూ ఆ పడిపోయిన చెట్టూ మిగిలాం. నేనూ వెళ్లిపోయాను మరి కొంచెం సేపులో. ఆ పడిపోయిన చెట్టు మాత్రమే మిగిలింది ఆ చీకట్లో మరింక!

"పడిపోయిన చెట్టు! అది చిగురించదా? మళ్ళి వసంతానికైనా అది పూలుపూయదా?" ఇదీ నా ఆలోచన. కాని పురపాలక సంఘంవారు ఆ స్థలాన్ని యావత్తూనున్న సమస్థలం చేయడంలో, చెట్టును పువ్వుల్ని అగ్గిలో అంటించి, ఆ బూడిదను బోడి గోడల్ని అంతనూ ఒకే మట్టానికి తెచ్చి రస్తా చేశారు.

ఆ రస్తాయే నాటికీ ఎంతలో ప్రజకు కొత్తరస్తా అయింది. ★


Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at
The Andhra Patrika. Press. 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



బేలూరు ఆలయంలో ద్వారపాలక ప్రతిమ

ఫొటో: ఎన్. రామకృష్ణ.





ఆరోగ్యవంతులైన జనులు ప్రతిరోజూ లైఫ్‌బాయ్‌తో స్నానము చేయుదురు

-అది ప్రతిదిన * మలినములోని క్రిములను కడిగివేయును!

* మనకు ప్రతిదినం తార్సపడే మామూలు మురికిలో క్రిములున్నాయి. మనలో ప్రతివారికీ యీ క్రిములవల్ల రోగాల ప్రమాదం వుంది. అందుచేతనే చాలమంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్ సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుటవల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు — అది ఆరోగ్యవంతమైన హాయిని గలిగించును.

భారతదేశంలో తయారుచేయబడినది